
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'
పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 287
SUNDAY Special
ఆదివారం 7-1-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరీస్ విజయమే లక్ష్యంగా...
తొలి టి20లో ఆస్ట్రేలియా మహిళలపై ఘన విజయం సాధించిన భారత జట్టు ఇప్పుడు అదే ఊపులో సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది.
- వివరాలు 12లో



రాజ్యాంగం.. ఓ రక్షణ కవచం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- దక్షిణాది జడ్జీల ప్రాంతీయ సదస్సులో ప్రసంగం..

- వివరాలు 13లో



బంగ్లాదేశ్‌లో నేడు ఎన్నికలు
బంగ్లాదేశ్‌లోని 300 నియోజకవర్గాల్లో ఆదివారం ఎన్నికలు నిర్వహించేందుకు ఆ దేశ ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది.
- వివరాలు 6లో



గాల్లో గజగజ
అమెరికాలో ఓ బోయింగ్ విమానం దాదాపు 5 కి.మీ. ఎత్తులో ఉండగా దాని కిటికీ భాగం ఊడి పడిపోయింది.
- వివరాలు 6లో



విజయవంతంగా సర్జరీ
ప్రపంచంలోనే తొలిసారిగా మెలకువ ఉండగానే ఓ ఐదేళ్ల చిన్నారికి ఎయిమ్స్ వైద్యులు బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ చేపట్టారు.
- వివరాలు 6లో



ప్రజా'న్యాయం' కోసమే యాత్ర
ప్రజాసమస్యలను ఎలుగెత్తి చాటేందుకు భారత్ జోడో న్యాయ్ యాత్రను మొదలు పెట్టామని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రకటించారు.
- వివరాలు 6లో

3 క్లస్టర్లుగా తెలంగాణ

అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజన.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

ఓఆర్ఆర్ లోపల ఒకటి, ఆర్ఆర్ఆర్ వరకు మరొకటి, ఆపై ఇంకో క్లస్టర్

2050 నాటికి రాష్ట్రం అంతటా పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా మహా ప్రణాళిక

పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వక సంబంధాలు.. ప్రతి పైసా పెట్టుబడికి రక్షణ

సచివాలయంలో సీఎంతో సమావేశమైన సీఐఐ ప్రతినిధులు

అన్ని ప్రాంతాలు హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చెందాలని సీఎం ఆకాంక్ష

కొత్త పారిశ్రామిక విధానానికి పారిశ్రామికవేత్తలు సహకరించాలని వ్యాఖ్య

నిరుద్యోగుల కోసం స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పుతామని వెల్లడి


సీఐఐ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందడానికి వీలుగా మహా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కొత్త విధానంలో తెలంగాణను మొత్తం మూడు క్లస్టర్లుగా విభజించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల అర్బన్ క్లస్టర్, ఓఆర్ఆర్ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) వరకు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్, ఆర్ఆర్ఆర్ తర్వాత చుట్టూరా ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. 2050 నాటికి హైదరాబాద్ తరహాలో తెలంగాణ అంతటా పారిశ్రామిక అభివృద్ధి జరగాలన్నది తమ లక్ష్యమని, అందుకు తగ్గట్టుగా మహా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలతో స్నేహపూర్వకంగా మెలుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులు శనివారం సచివాలయంలో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

అత్యున్నత అభివృద్ధి సాధనే లక్ష్యం

పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, రాయితీలు, ప్రోత్సాహకాల కోసం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని తీసుకుని వస్తామ సీఎం చెప్పారు. తెలంగాణలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒక తీరుగా ఉంటే.. 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని అన్నారు. రాబోయే రోజుల్లో అత్యున్నత అభివృద్ధి దశకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు పెట్టే ప్రతి పైసా పెట్టుబడికి పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందనే వాదనలకు భిన్నంగా తమ ప్రభుత్వం కొత్త

మిగతా 2వ పేజీలో ▶


తెలంగాణ పీఈసీ ఏర్పాటు
చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి
- డిప్యూటీ సీఎం భట్టి సహ 24 మంది సభ్యులు
- జాబితాలో మంత్రులు ఉత్తమ్, దామోదర, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీతక్క..
- నియమించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

2లో



ప్రజాపాలన దరఖాస్తులు 1.25 కోట్లు
అందులో కోటి వరకు అభయహస్తానికి, మిగిలినవి ఇతర సమస్యలపై..
- అన్నింటికీ రేషన్ కార్డు లింక్ అనడంతో ఆ కార్డులకు విపరీతమైన డిమాండ్
- గత నెల 28న ప్రారంభమైన ప్రజాపాలన.. వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణకు శ్రీకారం

5లో



లగ్రాంజ్ పాయింట్‌లోకి ఆదిత్య ఎల్ 1
భూమి నుంచి సూర్యుడి వైపుగా 15 లక్షల కి.మీ. దూరంలోని కక్ష్యలోకి వ్యోమనౌక ప్రవేశం
- ఇకపై ఎలాంటి అడ్డంకుల్లేకుండా నిరంతరం సూర్యుడిని అధ్యయనం చేసేందుకు వీలు
- అంతరిక్ష ప్రయోగాల్లో మరో మైలురాయిని అధిగమించిన ఇస్రో..
- శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి, ప్రధాని ప్రశంసలు

వివరాలు 6లో

కాంగ్రెస్‌లో షర్మిల చేరడం వెనుక
చంద్రబాబు కుట్ర
- అధికారం ఇక కలే అని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- దింపుడుకళ్లం ఆశలతో రకరకాల కుట్రలు
- సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

10లో

పొద్దుపొద్దునే ప్రయాణాలొద్దు!


తెల్లవారుజామున పొంచి ఉంటున్న పొగ మంచు ముప్పు
- ఆ సమయంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవడమే మంచిదంటున్న రోడ్డు భద్రత నిపుణులు..
- ప్రయాణం తప్పనిసరైతే జాగ్రత్తలు పాటించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ఈ చలికాలంలో పొగ మంచు ముప్పు పొంచి ఉంటోంది. దట్టమైన పొగమంచు ఎదుటి వాహనాలను కానరాకుండా చేసి వాహనదారులను కాటికి పంపుతోంది. గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా తెల్లవారుజాము సమయంలో పొగ మంచు తీవ్రంగా కురియడంతో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగింది. దాంతో వీలైనంత వరకు తెల్లవారుజాము నుంచి ఉదయం 7 గంటల వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవడమే ఉత్తమమని రోడ్డు భద్రత నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరంగా ప్రయాణం చేయాల్సి వస్తే.. తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు, జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేస్తున్నారు.

పొగ మంచు కారణంగా జరిగిన కొన్ని రోడ్డు ప్రమాదాలు

➤ ఈనెల 5న(శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు కుతాడి కుమార్, ప్రదీప్ బైక్‌పై వస్తుండగా పాపయ్యగూడ చౌరస్తా వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టడంతో మృతి చెందారు. పొగమంచు కారణంగా రోడ్డు మసకబారడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు

మిగతా 10వ పేజీలో ▶

ఇంకాచెప్పాలంటే

నిజమే సార్! మీ ఫ్యామిలీలో ఎవరూ సంతోషంగా లేరు!

ఫార్ములా-ఈ రేసింగ్ రద్దు
ఫార్ములా-ఈ ఆపరేషన్స్ ప్రకటన
- తెలంగాణ ప్రభుత్వ విముఖత నేపథ్యంలో నిర్ణయం!
- ఎంఏయూడీ విభాగానికి నోటీసులు ఇవ్వనున్నట్లు ఎఫ్ఈఓ వెల్లడి

5లో

వేములవాడ రాజన్న కోడెలు పక్కదారి!
- ఇతర గోశాలల నిర్వాహకులు కొందరు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు.. అసలు గోశాలలే లేకుండా ఫెడరేషన్ లేఖతో తీసుకెళ్తున్నారనే అనుమానాలు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో 24 కోడెలతో పట్టుబడిన వ్యాన్
- 'శ్రీసోమేశ్వర గోసంరక్షణ' పేరిట అసలు గోశాలే లేదని తేలిన వైనం

14లో

అధైర్య పడొద్దు.. ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమే
- మున్ముందు మంచి రోజులు వస్తాయి..
- ఏడాదిలోనే కాంగ్రెస్‌కు తిరుగుబాటు తప్పదు
- త్వరలోనే కేసీఆర్ ప్రజల మధ్యకు వస్తారు..
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2లో



శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ గవర్నర్ నరసింహన్

క్లుప్తంగా...

రైతులను ముంచింది బీఆర్ఎస్సే

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులకు మొండి చేయి చూపింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, రైతులను నట్టేట ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓటమిని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు అన్యాయం జరిగితే ఒక్క రోజు కూడా మాట్లాడని కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలని, మీ పాలనలో రుణమాఫీ సకాలంలో చేయక రైతుల మీద వడ్డీ భారం పడితే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. గతంలో దేశవ్యాప్తంగా ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదనే విషయం తెలుసుకోవాలని హితవుపలికారు. గడువుకు మూడు నెలల ముందే లిక్కర్ దుకాణాల టెండర్లు పిలిచిన మీరు.. రైతులకు ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే ఎందుకు రైతుబంధు వేయలేదో చెప్పాలని అన్వేశ్‌రెడ్డి ప్రశ్నించారు.

బీఆర్ఎస్ నేతలకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం ఉందా

టీపీసీసీ అధికార ప్రతినిధి మృత్యుంజయం

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతలకు ప్రజల్లోకి వెళ్లే దమ్ము, ధైర్యం ఉందా అని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి మృత్యుంజయం ప్రశ్నించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ చేసిన వాగ్దానాల్లో ఏవైనా అమలు చేశారా అని నిలదీశారు. సోనియాగాంధీ ఇచ్చిన ఆరు హామీలను ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ వనరులను దొంగిలించిన దొంగలు కేటీఆర్, హరీశ్‌రావు అని ఆయన ఆరోపించారు. 2020-23 సంవత్సరం వరకు లక్షా పదివేల టన్నుల ధాన్యం రైస్ మిల్లర్ల వద్ద ఉండిపోయిందని, ఇది అతి పెద్ద కుంభకోణమని విమర్శించారు. ఒక్కొక్క రైస్ మిల్లర్ వద్ద వందల కోట్ల రూపాయల రైస్ ఉందని, ఇప్పుడు రైస్ మిల్లర్ వద్ద ధాన్యం లేదనడం ఏమిటని నిలదీశారు. గంగుల కమలాకర్ బినామీలు రైస్ మిల్లర్ల వద్ద డబ్బులు తీసుకుని ఎన్నికల్లో పంపిణీ చేశారని ఆరోపించారు. తమిళనాడుకు రూ.37తో రైస్ అమ్మి ఉంటే ప్రభుత్వానికి రూ. 30 వేల కోట్ల ఆదాయం వచ్చి ఉండేదని మృత్యుంజయం అన్నారు.

'నెల రోజులు గడవకుండానే ప్రభుత్వంపై విమర్శలా..'

సాక్షి, హైదరాబాద్: నెల రోజులు కూడా పూర్తి చేసుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడటం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరు సతీశ్ తెలిపారు. రెండు పర్యాయాలు తెలంగాణ ప్రజలను అబద్ధపు మాటలతో మభ్యపెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగిందని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు ఏదేదో మాట్లాడు తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 12 నుంచి 13 స్థానాలను గెలిచి సోనియా గాంధీకి బహుమానంగా ఇస్తామని వెల్లడించారు.

అమ్మ భాషను అక్కున చేర్చుకోవాలి

మిజోరాం గవర్నర్ డాక్టర్ హరిబాబు

సాక్షి, రాజమహేంద్రవరం/రాజానగరం: ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా ప్రసిద్ధి చెందిన తెలుగ భాష దేశంలోని అన్ని భాషలకంటే అతి సుందరమైనదని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా రెండో రోజైన శనివారం రాజరాజ నరేంద్ర వేదికపై నిర్వహించిన కృతజ్ఞతాంజలి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఒక జాతి సాంస్కృతిక గొంతుక భాషేనని, అమ్మ భాష తెలుగు వ్యాప్తికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు అధికార భాష అంటున్నారని, వాస్తవానికి ఇది మమకార భాష కావాలని శాంతా వసంత ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాదరెడ్డి అన్నారు. మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష వ్యాప్తికి మన రచనలను హిందీలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష సజీవంగా ఉంటుందన్నారు.

ఎన్నికల కమిటీ చైర్మన్‌గా కిషన్‌రెడ్డి

చేరికల కమిటీ సభ్యులుగా సంజయ్, ఈటల, పొంగులేటి?

- లోక్‌సభకు రోడ్‌మ్యాప్‌పై బీజేపీ దృష్టి
- నేడు, రేపు జరిగే సన్నాహక భేటీకి రానున్న సునీల్ బన్సల్, తరుణ్ చుగ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల రోడ్‌మ్యాప్ ఖరారుపై బీజేపీ దృష్టిపెట్టింది. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో కచ్చితంగా పది గెలవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నేపథ్యంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు తుదిరూపం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో నిర్వహిస్తున్న కీలక సన్నాహక సమావేశానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు సునీల్ బన్సల్, తరుణ్ చుగ్ హాజరుకానున్నారు. ఎన్నికల కసరత్తు నిమిత్తం 10 కమిటీలను నియమించనుండగా, రాష్ట్ర పార్టీ ఆ మేరకు ప్రతిపాదనలను ఇప్పటికే జాతీయ నాయకత్వానికి పంపించింది. ఒకట్రెండు రోజుల్లో ఈ కమిటీల నియామకానికి ఢిల్లీ నుంచి గ్రీన్‌సిగ్నల్ రానున్నట్లు తెలుస్తోంది.

కిషన్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికల కమిటీ

ఇక రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా జి.కిషన్‌రెడ్డి నియమితులు కాగా, సభ్యులుగా రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జీలు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్, డా.కె.లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్ సహా మొత్తం 13 మందిని నియమించినట్టు సమాచారం. శ్రీరామ మందిర్ దర్శన్ అభియాన్ కమిటీ సమన్వయకర్తగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఇన్‌చార్జిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వికసిత్ భారత్ సంకల్పయాత్ర కమిటీతో పాటు కొత్త ఓటర్లతో సమ్మేళన కమిటీకు కార్యదర్శిగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు యాదవ్, కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల కమిటీకి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, హర్‌గావ్ జానా (ప్రతీ గ్రామాన్ని సందర్శించే)కమిటీకి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణను నియమించినట్టు తెలుస్తోంది.

చేరికల కమిటీలో ఆ ముగ్గురూ!

పార్టీ చేరికల కమిటీలో ఈటల రాజేందర్, బండి సంజయ్ పొంగులేటి సుధాకరరెడ్డి సభ్యులుగా నియమితులైనట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల చైర్మన్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గతంలో ఇదే కమిటీ చైర్మన్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డిని (అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన త్రిపుర గవర్నర్‌గా నియామకం) నియమించగా ఆ బాధ్యతల నుంచి ఆయన స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఆ తర్వాత ఈటలకు బాధ్యతలు అప్పగించగా, ఇప్పుడు ముగ్గురితో కలిసి చేరికల కమిటీని నియమించినట్టు పార్టీ నాయకుల సమాచారం.

టార్గెట్ కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కేంద్ర రాజకీయాల్లో బీఆర్ఎస్ పాత్ర పరిమితం కాబోతోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి పెద్దగా సానుకూలత వ్యక్తమయ్యే అవకాశాలు లేనందున కాంగ్రెస్‌నే ప్రధానంగా టార్గెట్ చేయాలని బీజేపీ భావిస్తోంది. ఆ మేరకు ప్రధానంగా అధికార కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నాయకత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ఎన్నికల హామీల అమల్లో వైఫల్యాలను ఎండగట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అప్పులున్నా ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- కరెంట్‌తో పాటు కాంగ్రెస్ కావాలనే ప్రజలు తీర్పునిచ్చారు



ప్రజాపాలన సభలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: ఆత్మగౌరవంతో సాధించుకున్న తెలంగాణను ధనిక రాష్ట్రంగా సోనియా గాంధీ అప్పగిస్తే గత పాలకులు రూ.లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. అయినప్పటికీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రజల కోసం పార్టీలకతీతంగా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో శనివారం జరిగిన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన రోజునే మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం ద్వారా రెండు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. అయితే, కొందరు ఆరు గ్యారంటీలు అమలు కాకుంటే బాగుండాలని కోరుకుంటున్నా.. వారి కోరిక నెరవేరదని బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి భట్టి ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదని చెబుతూ, కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా అని బీఆర్ఎస్ అడిగితే ప్రజలు మాత్రం కరెంట్‌తో పాటు కాంగ్రెస్ కూడా కావాలని తీర్పునిచ్చారని అన్నారు. ఎన్ని కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ రాజ్యాన్ని తెస్తామని తెలిపారు. పదేళ్లు పాలించిన వారు నెల కాక ముందే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పాలకులు ఎన్ని అప్పులు చేశారు, రాష్ట్రాన్ని ఎలా తాకట్టు పెట్టారో చెప్పేందుకే శ్వేత పత్రాలను విడుదల చేశామని తెలిపారు. కాగా, గత ప్రభుత్వం ఉద్యోగులకు 20వ తేదీ వరకు జీతాలు ఇవ్వలేదని, తాము 5వ తేదీలోపు ఇచ్చామని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతామని భట్టి వెల్లడించారు. విద్యుత్ రంగంపై రూ.లక్ష కోట్లు అప్పుల భారం ఉన్నా 24 గంటల కరెంట్ ఇస్తామని, ప్రతీ మండలంలో అత్యున్నతస్థాయి పాఠశాలలు ఏర్పాటుచేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మామునూరులోని తాగునీటి ప్రాజెక్టు వద్ద మిషన్ భగీరథ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాల్లో కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

గత పాలనలో ధనిక రాష్ట్రం అప్పులపాలు

పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



కుర్తి తండాలో ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజాంసాగర్(జుక్కల్): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదిన్నరేళ్లు గడిచిపోయినా ప్రజల ఆకాంక్షలు, అమరుల ఆశలు నెరవేరలేదు. వాటిని నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు భావించి అధికారంలోకి తీసుకువచ్చారు'అని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ కోటను సందర్శించిన అనంతరం బిచ్కుంద, పిట్లం మండలాల్లోని ఎల్లారం తండా, కుర్తి గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్‌కు అప్పజెప్పితే ఇప్పుడు రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. అయినా ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై తొలి సంతకం చేశారని, ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జుక్కల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, సంజీవ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేశ్.వి.పాటిల్, ఎస్పీ సింధూశర్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పీఈసీ ఏర్పాటు

- చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి
- డిప్యూటీ సీఎం సహా 24 మంది సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా పలు రాష్ట్రాల ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ)లను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీకి రాష్ట్ర సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా 24 మంది సభ్యులు ఉన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యుల్లో భట్టి విక్రమార్క, టి.జీవన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కె.జానారెడ్డి, వీహెచ్, చల్లా వంశీచంద్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), మధుయాష్కీ గౌడ్, సంపత్‌కుమార్, రేణుకా చౌదరి, పోరిక బలరాం నాయక్, జగ్గారెడ్డి, గీతారెడ్డి, అజారుద్దీన్, ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మహ్మద్ అలీ షబ్బీర్, ప్రేమసాగర్ రావు, పొదెం వీరయ్య, సునీతరావు ముదిరాజ్ ఉన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు.

సకాలంలో రైతుబంధు అందిస్తాం

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: సకాలంలో రైతులకు రైతుబంధును అందజేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రైతుల సంక్షేమం, వ్యవసాయం.. రెండూ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యతాంశాలని ఆయన స్పష్టం చేశారు. తన శాఖ ఉన్నతాధికారులతో శనివారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం క్లిష్టమైన ఆర్థిక పరిస్థితి కల్పించినా.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును రైతులకు సకాలంలో అందజేసేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 40 శాతం మంది రైతులకు రైతుబంధు అందించామని, 27 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు జమయిందని తెలిపారు. వరి, ఇతర యాసంగి పంటల నాట్లు, సాగు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతుబంధు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. రోజువారీగా నిధులు విడుదలయ్యేలా చూడాలని, వచ్చే సోమవారం నుంచి రైతులకు అధిక సంఖ్యలో రైతుబంధు చేరేలా చూడాలని సూచించారు. ఈ అంశంపై సంక్రాంతి తరువాత మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు.

3 క్లస్టర్లుగా తెలంగాణ

▶ మొదటి పేజీ తరువాయి

విధానాన్ని అనుసరిస్తుందని అన్నారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాలు హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తాము తెచ్చే కొత్త పారిశ్రామిక విధానానికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు.

ఫార్మా విలేజీల అభివృద్ధి

ఫార్మా సిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని, ఫార్మా సిటీగా కాకుండా ఫార్మా విలేజీలను అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఓఆర్ఆర్‌పై 14 రేడియల్ రోడ్లు ఉన్నాయని, వీటికి 12 జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని, వీటికి అందుబాటులో ఉండేలా దాదాపు వెయ్యి నుంచి 3 వేల ఎకరాలకో ఫార్మా విలేజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా, కాలుష్య రహితంగా, పరిశ్రమలతో పాటు పాఠశాలలు, ఆస్పత్రులు ఇతర అన్ని మౌలిక సదుపాయాలతో వీటిని అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. రక్షణ, నావికా రంగానికి అవసరమైన పరికరాల తయారీ, ఉత్పత్తికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలున్నాయని, పారిశ్రామికవేత్తలు వీటిపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కొత్తగా సోలార్ పవర్ పాలసీని రూపొందిస్తామని, సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు.

స్కిల్ వర్సిటీలు ఏర్పాటు చేస్తాం

రాష్ట్రంలో 35 లక్షల మంది నిరుద్యోగులను గత ప్రభుత్వం మాదిరిగా భారంగా భావించటం లేదని సీఎం స్పష్టం చేశారు. వీరందరినీ పరిశ్రమల అభివృద్ధిలో పాలుపంచుకునే మానవ వనరులుగా చూస్తామని, యువతీ యువకులకు అవసరమైన నైపుణ్యాలు (స్కిల్స్) నేర్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పుతామని చెప్పారు.ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పరిశ్రమలు, ఐటీ శాఖల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, సీఐఐ ప్రతినిధులు సి.శేఖర్ రెడ్డి, అనిల్ కుమార్, మోహన్ రెడ్డి, సతీష్ రెడ్డి, సుచిత్రా కె.ఎల్లా, వనిత దాట్ల, రాజు, సంజయ్ సింగ్, ప్రదీప్ ధోబాలే, శక్తి సాగర్, వై.హరీశ్‌చంద్ర ప్రసాద్, గౌతమ్ రెడ్డి, వంశీకృష్ణ గడ్డం, శివప్రసాద్ రెడ్డి రాచమల్లు, రామ్, చక్రవర్తి, షేక్ షమియుద్దీన్, వెంకటగిరి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకారంపై అపోహలు వద్దు

ఎన్నికలు.. రాజకీయాలు, అభివృద్ధి వేర్వేరు అంశాలని సీఎం పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమలకు సహకరించదనే అపోహలు వద్దని అన్నారు. తాను 24 గంటలూ ఆఫీసు లేదా క్యాంపు కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానని, తనతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వంతో సంప్రదించకుండా అభిప్రాయానికి రావొద్దని, నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరు ఎన్నికలెందుకు?

మాజీ ఎంపీ వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఒకే ఎన్నిక కాకుండా రెండు ఎన్నికలు నిర్వహించడంలో ఆంతర్యమేమిటని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ప్రశ్నించారు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి 2021 డిసెంబర్ 9వ తేదీన ఒకే నోటిఫికేషన్ ద్వారా ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. కానీ, ఎన్నికల కమిషన్ వీరిస్థానాల్లో కొత్తవారిని ఎన్నుకునేందుకు వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇవ్వడం ఎందుకో అర్థంకావడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది భరత్ కుమార్, ఇతర లీగల్ సెల్ సభ్యులతో చర్చించి ఎన్నికల అధికారులకు ఒక లేఖ సమర్పించనున్నట్లు తెలిపారు. వేర్వేరుగా రెండు ఎన్నికలు నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి లబ్ధిచేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నట్లుగా ఉందని పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌గా మారి వేధిస్తున్నాడని.. భర్తను హత్య చేయించిన భార్య

హత్యకు రూ.18లక్షల సుపారీ

- అడ్వాన్స్‌గా రూ.4.60లక్షలు చెల్లింపు
- ముగ్గురి అరెస్టు, పరారీలో మరో ముగ్గురు



హత్యకు గురైన వెంకటేశ్ (రోజా)

సిద్దిపేట కమాన్: ట్రాన్స్‌జెండర్‌గా మారి వేధిస్తున్నాడంటూ సుపారీ ఇచ్చి మరీ భర్తను హత్య చేయించింది ఓ భార్య. సుపారీ కింద రూ.18 లక్షలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకొని.. రూ.4.60 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించింది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్ కథనం ప్రకారం.. సిద్దిపేట బోయిగల్లికి చెందిన వేదశ్రీకి నాసర్‌పూరకు చెందిన దరిపల్లి వెంకటేశ్(33)కు 2014లో వివాహమైంది. 2015లో వీరికి ఒక పాప జన్మించింది. కొద్ది రోజుల తర్వాత వెంకటేశ్‌కు మానసిక ఆలోచనల్లో మార్పు వచ్చింది. అమ్మాయిలాగా ప్రవర్తించడం చెవులకు కమ్మలు, ముక్కుకు పుడక పెట్టుకుని రాత్రి సమయంలో ఆడవారి దుస్తులు ధరించడం చేస్తుండేవాడు. అదనపు కట్నం కోసం కూడా వేధింపులకు గురి చేసేవాడు. 2019లో ఏకంగా వెంకటేశ్ ట్రాన్స్‌జెండర్‌గా మారి భార్యను తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడు.

వేధింపులకు ఉద్యోగం పోవడంతో పగబట్టి..

రోజాగా పేరుమార్చుకున్న వెంకటేశ్ పలుమార్లు చీరకట్టుకుని వేదశ్రీ పనిచేస్తున్న స్కూలుకు వెళ్లి వేధిస్తుండటంతో తన ఉద్యోగాన్ని కోల్పోయింది. మరో స్కూల్లో చేరినా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ క్రమంలో తనకు పరిచయమైన సిద్దిపేట నాసర్‌పూర వాస్తవ్యుడు బోయిని రమేశ్‌తో తన బాధను చెప్పుకొని వాపోయింది. తనను, పాపను వేధిస్తున్న వెంకటేశ్ (రోజా)ను ఎలాగైనా అడ్డు తొలగించాలని నిర్ణయించుకుంది. దీంతో వేదశ్రీ, రమేశ్ కలిసి పట్టణంలోని కాకతీయ ఫుట్‌వేర్ యజమాని రమేశ్‌తో వెంకటేశ్(రోజా) హత్య కోసం 2023 సెప్టెంబర్‌లో రూ. 18లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు అడ్వాన్స్‌గా వేదశ్రీ మొదటగా రూ.2లక్షలు చెల్లించింది. ఈ క్రమంలో ఫుట్‌వేర్ రమేశ్‌కు మిత్రుడైన నంగునూరు మండలం నాగరాజుపల్లికి చెందిన ఇప్పల శేఖర్‌కు హత్య విషయం తెలిపారు. దీంతో ఇప్పల శేఖర్ ముందుగా వేసుకున్న పథకంలో భాగంగా వెంకటేశ్ (రోజా)తో పరిచయం చేసుకుని తరచూ అతడిని కలుస్తూ ఉండేవాడు. ఈ క్రమంలోనే ఇప్పల శేఖర్ వెంకటేశ్(రోజా)కు ఫోన్ చేసి వరంగల్ నుంచి సిద్దిపేటకు పిలిపించాడు.

మద్యం తాగించి ఊపిరాడకుండా చేసి..

ఇప్పల శేఖర్, వేదశ్రీ, ఫుట్‌వేర్ షాప్ యజమాని రమేష్ ముందుగా వేసుకున్న పథకం ప్రకారం డిసెంబర్ 11న వెంకటేశ్(రోజా)కు బాగా మద్యం తాగించారు. ఆ రోజు రాత్రి ఇప్పల శేఖర్ మరో ఇద్దరు నిందితులతో కలిసి దిండుతో వెంకటేశ్ ముఖంపై ఒత్తి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. రెండు రోజుల తర్వాత వేదశ్రీ తన మంగళసూత్రాన్ని తాకట్టు పెట్టి నిందితులకు రూ.2.60లక్షలు చెల్లించింది. ఈ ఘటనపై మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు మృతుడి భార్య వేదశ్రీని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేయించినట్లు నేరం ఒప్పుకుందని తెలిపారు. ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేయగా, వేదశ్రీ, ఇప్పల శేఖర్, బోయిని రమేశ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న కాకతీయ ఫుట్‌వేర్ యజమాని రమేష్‌తో పాటు మరో ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

అధైర్య పడొద్దు.. ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమే

మున్ముందు మంచి రోజులు వస్తాయి..

- ఏడాదిలోనే కాంగ్రెస్‌కు తిరుగుబాటు తప్పదు
- త్వరలోనే కేసీఆర్ ప్రజల మధ్యకు వస్తారు.. జిల్లాల్లో పర్యటిస్తారు
- బీఆర్ఎస్ శ్రేణులకు ధైర్యం నూరి పోసిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధికారం కోల్పోయామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తొలిసారి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని, మన సత్తా ఏంటో చూపిద్దామని పేర్కొన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, మున్ముందు మంచిరోజులు వస్తాయని శ్రేణులకు ఆయన ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్లమెంటు నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగితే ఎమ్మెల్యేలందరం కలిసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖరరావు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ప్రజల మధ్యకు రానున్నారని తెలిపారు. హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ తరువాత కోలుకుంటున్న కేసీఆర్ జిల్లాల్లో పర్యటనలు జరుపుతారని చెప్పారు. వచ్చే నెలలో కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చి ప్రతిరోజూ కార్యకర్తలను కలిసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.

కేసీఆర్ ఫొటో తొలగించినా ప్రజల గుండెల నుంచి తొలగించలేరు..

కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేసే పనిలో ఉందని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ కిట్ మీద కేసీఆర్ గుర్తును కాంగ్రెస్ ప్రభుత్వం చెరిపేస్తోందనీ కిట్ నుంచి కేసీఆర్ ఫొటో, పేరును తొలిగిస్తారేమో కానీ తెలంగాణ ప్రజల గుండెల నుంచి తొలగించలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దులు, వాయిదాలు అన్నట్టుగా నడుస్తోందని ఎద్దేవా చేశారు.ఈ ప్రభుత్వ తీరు చూస్తుంటే ఏడాదిలోనే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదనిపిస్తోందన్నారు. కొన్ని చోట్ల వడ్ల పైసలు కూడా పడలేదని, రైతుబంధు ఇప్పటికీ వేయలేదని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు., ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

కీలక పోస్టింగ్‌లను రేవంత్ సోదరులే నిర్ణయిస్తున్నారు: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు అధికారిక మీటింగ్‌లలో పాల్గొనడం కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. రెవెన్యూ తదితర కీలకమైన శాఖల్లో పోస్టింగ్‌లను రేవంత్ సోదరులే నిర్ణయిస్తున్నారని, రేవంత్ మనుషులు విచ్చలవిడిగా సిటీ చుట్టుపక్కల లే అవుట్‌లు వేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఎంపీ వెంకటేష్ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొన్నారు.

రేవంత్ కనీస హోం వర్క్ చేయడం లేదు: కడియం

సీఎం రేవంత్‌రెడ్డికి ఎవరు బ్రీఫింగ్ ఇస్తున్నారో తెలియదని, సీఎం దేనిపైనా కనీస హోం వర్క్ కూడా చేయడం లేదనిపిస్తోందని మాజీ మంత్రి కడియం శ్రీహరి విమర్శించారు. ఫార్మా సిటీ, మెట్రో రైలుపై సీఎం వైఖరి కొన్ని రోజుల్లోనే మారిందన్నారు. అదానీని నాగపూర్‌లో విమర్శించిన సీఎం హైదరాబాద్‌లో అదే అదానీకి రెడ్ కార్పెట్ పరిచారని ఎద్దేవా చేశా రు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకా లను ప్రారంభించకపోగా, కేసీఆర్ పథకాలను రద్దు చేస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదని, గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చి ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే గృహలక్ష్మి పథకాన్ని అలాగే కొనసాగించాలన్నారు. దళితబంధు పథకంలో సాయాన్ని పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఉన్న పథకాన్నే ఎత్తివేస్తూ దళితులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.

ఆస్తి కోసం అమ్మనే చంపేశాడు

- భార్యతో కలిసి కన్నతల్లిని హత్య చేసిన దుర్మార్గుడు
- బంధువులకు అనుమానం రావడంతో బయటపడిన విషయం

ఉప్పల్ (హైదరాబాద్): ఆస్తి అమ్మడానికి అడ్డువస్తోందని కన్న తల్లినే భార్యతో కలసి మట్టుబెట్టాడు ఓ కిరాతకుడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన కాసావేణి సుగుణమ్మ (65) భర్త కొన్నాళ్ల క్రితం చనిపోయాడు. ఆమెకు కుమారుడు అనిల్ (38), కోడలు తిరుమల (30) ఉన్నారు. వీరి ఇద్దరు పిల్లలు హాస్టల్‌లో చదువుకుంటున్నారు. భర్త చనిపోయిన తరువాత ఇంటిని సుగుణమ్మ తన పేరు మీదకు మార్చుకుంది. కొడుకు జులాయిగా తిరుగుతుండటంతో అప్పులు పెరిగాయి. అప్పులు తీర్చేందుకు ఇల్లు అమ్మాలని కొడుకు, కోడలు కొంతకాలంగా సుగుణమ్మపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే సుగుణమ్మ ససేమిరా అనడంతో తిరుమల పుట్టింటికి వెళ్లింది. ఇల్లు అమ్మాలంటే ఎలాగైనా తల్లి అడ్డు తొలగించుకోవాలని అనిల్ నిర్ణయించుకున్నాడు. ఈనెల 4వ తేదీన అర్ధరాత్రి తిరుమల మరోవ్యక్తి శివతో కలిసి వెంకటరెడ్డినగర్ వచ్చింది. అదే రాత్రి సుగుణమ్మ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత నిద్రలో ఉన్న సుగుణమ్మ ముఖంపై దిండు అదిమి, గొంతుకు తుండు చుట్టి హత్య చేశారు. అమ్మ నిద్రలోనే చనిపోయిందని అనిల్ బంధువులతో బుకాయించారు.

మృతదేహంపై గాయాలు ఉండటంతో..

మరణ వార్త విని సుగుణమ్మ తల్లి దాసరి ఐలమ్మ (80)తో సహా బంధువులు వరంగల్ ప్రాంతం నుంచి భారీగా తరలివచ్చారు. 5వ తేదీన అంత్యక్రియలకు సన్నాహాలు చేశారు. సుగుణమ్మ మృతదేహానికి స్నానం చేయిస్తుండగా మెడ మీద గాయాలు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చి బంధువులు అనిల్‌ను నిలదీయగా, పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు కొడుకు, కోడలిని అదుపులోకి తీసుకుని విచారించడంతో విషయం బయటపడింది. ఆస్తి కోసం అమ్మను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకుని భార్య, ఆమెతో వచ్చిన శివతో కలిసి హత్యచేసినట్లు అనిల్ పోలీసులకు తెలిపాడు. దీంతో ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.


RAMRAJ
COTTON
CULTURE OF INDIA
సంస్కృతి సంప్రదాయాల
మేళవింపుతో
అమూల్యమైన సిరిసంపదలతో
కొత్త ప్రారంభాలకు
నాంది పలకుతూ
సంక్రాంతి
శుభాకాంక్షలు
SCAN QR CODE
FOR STORE LOCATION
RAMRAJ
కాటన్
భారతీయ సంస్కృతి
• పంచలు
• షర్ట్‌లు
• బనియన్లు
KARIMNAGAR : Ambedkar Road, Court Chowrastha | MANCHERIAL : JB Nagar, Beside: Canara Bank, Bellampally Road
FOR ENQUIRIES : FRANCHISEE : +91 97511 47147 | DISTRIBUTOR : +91 90477 25147 | CORPORATE ORDERS : +91 95140 68147
Available @ Ramraj Showrooms & All leading Textile Shops | Shop Online at www.ramrajcotton.in



అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి : అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.9.24 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** విశాఖ రా.7.26, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.11.32 నుండి 1.08 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.12 నుండి 5.00 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.09 నుండి 11.47 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.36
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అధీర్ రంజన్ (లోక్‌సభ కాంగ్రెస్ లీడర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"ఆవిడ అహంకారం గమనించారా ఖర్గేజీ?! అందుకే ఆవిడకు నేను జన్మదిన శుభాకాంక్షలు చెప్పలేదు..." అన్నాను ఖర్గేజీతో.

ఆ మాటకు ఖర్గేజీ నవ్వారు! "ఆవిడకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పలేదన్న స్పృహ మీలో ఇప్పటికీ ఉందంటే అందరికన్నా ముందు మీరే ఆవిడకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పినట్లు రంజన్‌జీ. ఆవిడ పుట్టిన రోజు వచ్చి పోయి కూడా ఇరవై నాలుగు గంటలు అవడం లేదా..." అన్నారు.

ఆయన వైపు దిగాలుగా చూశాను.

"రంజన్‌జీ... ఆవిడ ఆల్రెడీ ఎలక్షన్ మూడ్‌లోకి వెళ్లిపోయారు కనుక పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయిన మీరు గానీ, ఆలిండియా కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయిన నేను గానీ, పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఉన్న ఇద్దరంటే ఇద్దరే లోక్‌సభ ఎంపీలలో ఒకరైన మన అబూ హాసేమ్ ఖాన్ సాబ్ గానీ ఆవిడకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పడం, చెప్పకపోవడం అన్నవి ఆవిడ పట్టించుకునేంత ప్రాముఖ్యం ఉన్న విషయాలైతే కావు. మనకే ఆ పట్టింపు.." అన్నారు ఖర్గేజీ... అదే నవ్వుతో!



"ఆవిడ అంటే మమతాజీనే కదా..." అన్నారు ఖాన్ సాబ్.

"ఆ.. ఆవిడే.." అన్నాను.

ఖాన్ సాబ్, నేను, ఖర్గేజీ... ముగ్గురం ఢిల్లీ ఆఫీస్‌లో ఉన్నాం.

వచ్చే ఎన్నికల సీట్ షేరింగ్‌లో మాల్దా సౌత్, బెర్హంపూర్.. ఈ రెండూ కాంగ్రెస్‌కు ఇస్తాం అంటున్నారు మమత! మాల్దాకు ఖాన్ సాబ్, బెర్హంపూర్‌కి నేను సిట్టింగ్ ఎంపీలం.

"మన సీట్లు మనకు ఇవ్వడం సీట్ షేరింగ్ ఎలా అవుతుంది ఖర్గేజీ... అహంకారం అవుతుంది కానీ.." అన్నాను, ఢిల్లీ పార్టీ ఆఫీస్ మెట్లెక్కి పైకి వెళ్లగానే.

వెంటనే ఆయనేమీ మాట్లాడలేదు.

"ముందు అలా ప్రశాంతంగా కూర్చోండి రంజన్‌జీ..."అన్నారు!

"అసలు కూటమి నుంచే బయటికి వచ్చేద్దాం ఖర్గేజీ. కాంగ్రెస్‌కి ఏం తక్కువైంది. తృణమూల్‌కి ఏం ఎక్కువైంది?" అన్నాను తీవ్రమైన ఆగ్రహంతో.

ఖర్గేజీ నవ్వుతూ చూశారు.

"ఈ రెండు సీట్ల షేరింగ్ నాకు చికాకు తెప్పిస్తోంది ఖర్గేజీ. పైగా ఆవిడ ఏమంటున్నారో విన్నారు కదా.. బెంగాల్లో బీజేపీ సంగతి తనొక్కరే చూసుకుంటారట. మిగతా స్టేట్‌లన్నిటిలో మనం చూసుకోవాలట! అంటే.. బెంగాల్‌లో మొత్తం 42 సీట్లూ తృణమూల్‌కి వదిలేయమనే కదా! ఎక్కడి నుంచి వస్తుంది అంత అహంకారం ఖర్గేజీ!! మనం తక్కువన్న ఫీలింగా? లేక, తను ఎక్కువన్న ఫీలింగా?!" అన్నాను.

"తను ఎక్కువన్న ఫీలింగే కావచ్చు..." అన్నారు ఖాన్ సాబ్!

"ఎలా చెప్పగలరు?!" అన్నాను.

"అవతలి వాళ్లను తక్కువగా చూడగలినప్పుడు మనం ఎక్కువ అనే ఫీలింగ్ కలుగుతుంది. బహుశా మమతాజీ కూడా అలా మనల్ని తక్కువగా చూడగలగడం ద్వారా తను ఎక్కువ అనే భావనను కల్పించుకుంటున్నారేమో..." అన్నారు ఖాన్ సాబ్.

"లోక్‌సభలో 22 సీట్లు మాత్రమే ఉన్న తృణమూల్ పార్టీ, 48 సీట్లున్న కాంగ్రెస్ పార్టీని తక్కువగా చూడగలుగుతోందంటే... కూటమిలో భాగస్వామి కనుక మన 48 సీట్లు కూడా తనవే అని తృణమూల్ అనుకుంటూ ఉండాలి. లేదా, తనసలు కూటమిలోనే లేనని అనుకుంటూ ఉండాలి..." అన్నాను.

ఆ మాటకు పెద్దగా నవ్వారు ఖాన్ సాబ్.


ఖర్గేజీ నవ్వలేదు!

"మనమూ కూటమిలో లేమనే అనుకోవాలి రంజన్‌జీ. ఇప్పుడున్నది కాదు కూటమి. ఎన్నికలు జరిగి, ఫలితాలు వచ్చాక కుదిరేదే అసలైన కూటమి..." అన్నారు!

"మరిప్పుడేం చేద్దాం ఖర్గేజీ?" అన్నాను.

"బిలేటెడ్‌గానైనా ముందు మీరు మమతాజీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పండి రంజన్‌జీ... ఆవిడ పట్టించుకున్నా, పట్టించుకోకున్నా..." అన్నారాయన!!

భళా... తాటాకు చప్పుళ్ల తాండవం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

'ఆర్తనాదములు శ్రవణానందకరముగా నున్నవి' – ఘటోత్కచుని వేషంలో ఎస్వీ రంగారావు చెప్పిన డైలాగ్ ఇది – ఆల్‌టైమ్ గ్రేట్ మూవీ 'మాయాబజార్' క్లైమాక్స్ సీన్‌లో! కుట్రలతో, కుయుక్తులతో, కపటంతో, వంచనతో పాండవులను వేధిస్తున్న దుష్టచతుష్టయ కౌరవ ముఠాకు ఘటోత్కచుడు తన ఇంద్రజాలంతో బుద్ధి చెబుతాడు. అతని మాయాజాలంలో చిక్కుకొని గిలగిల కొట్టుకుంటూ పలాయన మంత్రం పఠిస్తున్న ఆ కౌరవ మూకను చూసి పగలబడి నవ్వుతాడు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ఉరఫ్ వెన్నుపోటు బాబు అనే కాలం చెల్లిన నాయకుడు మనుగడ కోసం ప్రదర్శిస్తున్న గారడీ విద్యలు కూడా వినోదం పుట్టిస్తున్నవి. ఏఐ టెక్నాలజీ కాలంలో కూడా కనికట్టు టెక్నిక్‌ల దశను ఈ వృద్ధ నేత దాటలేకపోతున్నారు. ఈ తరహా బేసిక్ మోడల్ నాటు విద్యలనే... బాబు చాణక్యాలు, బాబు 'చక్ర' వ్యూహాలుగా యెల్లో మీడియా ప్రచారం చేసిపెట్టింది. ఇప్పుడు కూడా యెల్లో పిల్లి కళ్లు మూసు కొని పాలు తాగే వ్యూహాలను అమలు చేస్తున్నది. తాటాకు చప్పుళ్లను కూడా అణుబాంబు విస్ఫోటాలుగా ప్రచారం చేసే పనిలో యెల్లో మీడియా నిమగ్నమై ఉన్నది.

మార్చి నెలాఖరులోగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు పూర్తి కావచ్చని వినబడుతున్నది. అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈరోజు వరకు కూడా యాభై శాతానికి పైగా ఓటింగ్ బలం ఉన్నది. ముఖ్యమంత్రి రేటింగ్‌లో చంద్రబాబు అందుకోలేనంత దూరంలో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నవారు 58 శాతం మంది ఉన్నారు. ఇటువంటి క్షేత్ర వాస్తవికత గురించిన స్పష్టమైన అవగాహన టీడీపీ కూటమికి ఉన్నది. అయిననూ ఎన్నికల్లో గెలిచి తీరవలె! ఎలా?

వీలైనన్ని ఎక్కువ పొత్తులు పెట్టుకొని తమ కూటమి బలాన్ని ఎంతో కొంత పెంచుకోవాలి. ఇదొక్కటే సరిపోదు. వైసీపీ ఓటింగ్ బలంలో కోతపెట్టాలి. ఈ రెండంచెల వ్యూహాన్ని చాలాకాలంగానే టీడీపీ పెద్దలు అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వ్యూహం లాంటి గొప్ప మాటలు అనవసరం. ఇదో అనైతిక ఎత్తుగడ. దిగజారుడు విధానం. చంద్రబాబు ఆశించే పొత్తులకు సైద్ధాంతిక ప్రాతిపదిక అవసరం లేదు. భావజాల సారూప్యత గురించిన చింతే లేదు.

తనకు ఐడియాలజీలు లేవని ఆయనే ప్రకటించుకున్నారు. కమ్యూనిజం అంతరించిందనీ, టూరిజమే అసలైన ఇజమనీ ఓ దివ్య సందేశాన్ని కూడా ఆయన వెలువరించారు. అయినా సరే, మన ఏపీ కమ్యూనిస్టుల్లో కొందరు ఎర్రజెండాలను చంద్రబాబుకు వింజామరలుగా ఉపయోగించడానికి ఏమాత్రం వెనుకాడరు. ఇదేమి సంబంధమో సామాన్యులకు అర్థం కాదు. అదో దేవ రహస్యం. 'ఏ బంధమో ఇది ఏ బంధమో, ఏ జన్మబంధాల సుమ గంధమో' అని నిట్టూర్పులతో పాడుకోవడం తప్ప చేయగలిగిందేమీ లేదు.

కోస్తా జిల్లాల్లో ఒక బలమైన సామాజిక వర్గంగా ఉన్న కాపులు చంద్రబాబుకు సహజ శత్రువులు. ఈ వ్యతిరేక ప్రవాహం తనను రాజకీయంగా ముంచేయకుండా ఉండటానికి పవన్ కల్యాణ్ ద్వారా ఒక డైవర్షన్ స్కీమ్‌ను తయారు చేసుకున్నారు. తన అవసరాన్ని బట్టి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకో, చీలడం కోసమో ఈ డైవర్షన్ స్కీమ్‌ను ఆయన వినియోగిస్తాడు. ఆయన ఏర్పాటు చేసుకున్న పార్టీయే గనుక తెలుగుదేశం పొత్తు కోసం నిలబడే తొలి పార్టీ – జనసేన. అదొక్కటే సరిపోదు. బీజేపీ కూడా తోడు రావాలి.

ఐదేళ్ల కింద ఎన్నికలు ముగిసిన మరుసటిరోజు నుంచే చంద్రబాబు బీజేపీతో సయోధ్య ప్రయత్నాలు మొదలుపెట్టారు. సీఎం రమేశ్, సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్ వగైరా పలువురు నాయకులను ఢిల్లీ లాబీయింగ్ కోసం కమలం పార్టీలో ప్రవేశపెట్టారు. పవన్ కల్యాణ్‌తో తాను పెట్టించిన పార్టీని ఎన్‌డీఏలో చేర్పించారు. పూర్వాశ్రమంలో తాను ఎన్డీఏలో ఉన్న కాలం నాటి కొందరు సావాసగాళ్ల తోడ్పాటును కూడా పొందుతున్నారు. బీజేపీ వాళ్లకు కూడా ప్రతి రాష్ట్రంలో ఎన్డీఏకు ఎన్నో కొన్ని సీట్లు రావాలని ఉంటుంది కనుక తమ పొత్తుకు అంగీకరించక తప్పదని తెలుగుదేశం అంచనా.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరిని నియమించేలా చంద్రబాబు కూటమి పావులు కదిపింది. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచి బాబు అప్పగించిన 'మిషన్'పైనే ఆమె పనిచేస్తున్నారు. ఈ పండుగలోపునే 'మిషన్ ఎకాంప్లిష్డ్' అనే ప్రకటన ఆమె చేసే అవకాశం ఉన్నదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ కటాక్ష వీక్షణాల కోసం ఇంతగా పరితపిస్తున్న బాబు బృందం మరి ఆరేళ్ల కింద ఎందుకు విడి

ఐదేళ్ల కింద ఎన్నికలు ముగిసిన మరుసటిరోజు నుంచే చంద్రబాబు బీజేపీతో సయోధ్య ప్రయత్నాలు మొదలు పెట్టారు. సీఎం రమేశ్, సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్ వగైరా పలువురు నాయకులను ఢిల్లీ లాబీయింగ్ కోసం కమలం పార్టీలో ప్రవేశపెట్టారు. పవన్ కల్యాణ్‌తో తాను పెట్టించిన పార్టీని ఎన్‌డీఏలో చేర్పించారు. పూర్వాశ్రమంలో తాను ఎన్డీఏలో ఉన్న కాలం నాటి కొందరు సావాసగాళ్ల తోడ్పాటును కూడా పొందుతున్నారు. బీజేపీ వాళ్లకు కూడా ప్రతి రాష్ట్రంలో ఎన్డీఏకు ఎన్నో కొన్ని సీట్లు రావాలని ఉంటుంది కనుక తమ పొత్తుకు అంగీకరించక తప్పదని తెలుగుదేశం అంచనా.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరిని నియమించేలా చంద్రబాబు కూటమి పావులు కదిపింది. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచి బాబు అప్పగించిన మిషన్‌పైనే ఆమె పనిచేస్తున్నారు. ఈ పండుగలోపునే 'మిషన్ ఎకాంప్లిష్డ్' అనే ప్రకటన ఆమె చేసే అవకాశం ఉన్నదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ కటాక్ష వీక్షణాల కోసం ఇంతగా పరితపిస్తున్న బాబు బృందం మరి ఆరేళ్ల కింద ఎందుకు విడిపోయి నట్టు? మోదీతో సహా బీజేపీ నాయకత్వంపై ఎందుకు తీవ్రమైన విమర్శలు చేసినట్టు? బాబు రాజకీయాల్లో సిద్ధాంతాలే కాదు లాజిక్ కూడా ఉండదు. అవకాశ వాదమే ఎజెండా! అధికారమే అంతిమ లక్ష్యం!!

పోయినట్టు? మోదీతో సహా బీజేపీ నాయకత్వంపై ఎందుకు తీవ్రమైన విమర్శలు చేసినట్టు? బాబు రాజకీయాల్లో సిద్ధాంతాలే కాదు లాజిక్ కూడా ఉండదు. అవకాశవాదమే ఎజెండా! అధికారమే అంతిమ లక్ష్యం!!

చంద్రబాబు ఆకాంక్షల మేరకు, పురంధేశ్వరి అభిలషిస్తున్నట్టుగా... బీజేపీతో కూడా పొత్తు కుదిరితే ఇంతటితో ప్రత్యక్ష పొత్తుల వ్యవహారం కొలిక్కి వచ్చినట్టే! ఇక పరోక్ష పొత్తుల కార్యక్రమాన్ని చాలాకాలంగా టీడీపీ నరుక్కొస్తున్నది. బీజేపీ ఉన్న కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేరే అవకాశం ఉండదు కనుక వీరిని అధికార పార్టీ ఓట్లు చీల్చేందుకు ఉపయోగించుకోవాలనే చావు తెలివితేటలతో టీడీపీ ప్లాన్ రూపొందించుకున్నది. కాంగ్రెస్ పార్టీకి గత కొంతకాలంగా వ్యూహకర్తగా వ్యవహరిస్తున్న సునీల్ కనుగోలు సహకారాన్ని కూడా చంద్రబాబు తీసుకుంటున్నారట! సునీల్ కూడా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం.

కాంగ్రెస్ అధిష్ఠానంతో చంద్రబాబు మైత్రీ బంధం ఈనాటిది కాదు. గడిచిన పుష్కరకాలంగా అది బలపడుతూనే వస్తున్నది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తును మొగ్గలోనే తుంచేయడం కోసం కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఉమ్మడి ప్రణాళికతో పనిచేశాయి. ఉమ్మడిగా ఆయనపై కేసులు వేశాయి. ఆయనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన న్యాయమూర్తిని పదవీ విరమణ అనంతరం మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్‌గా ప్రతిష్ఠించారు. జాతీయ స్థాయిలో చిక్కిశల్యావశిష్ట స్థితికి చేరిన కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు కల్పించిన వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఆయన మరణానంతరం ఎఫ్ఐఆర్‌లో ముద్దాయిగా చేర్చి కాంగ్రెస్ హైకమాండ్ దారుణమైన కృతఘ్నతకూ, నమ్మకద్రోహానికీ పాల్పడింది. చంద్రబాబు సలహా సంప్రదింపులు కూడా ఈ వంచన వెనుక ఉన్నాయి.

విభజిత ఏపీ ముఖ్యమంత్రిగా ఉంటూ కేంద్రంలో ఎన్డీఏతో నాలుగేళ్లు కాపురం చేసిన తర్వాత తన వైఫల్యాలను కేంద్రంపై నెట్టేందుకు చంద్రబాబు ఆ కూటమి నుంచి వైదొలిగారు. ఆ సమయంలో మరోసారి కాంగ్రెస్‌కు చేరువై ఆ పార్టీకి వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఆర్థిక సహకారం అందించినట్టు కూడా వార్తలు వచ్చాయి. తెలంగాణ కాంగ్రెస్‌లోనైతే ఆయన మాటే చెల్లుబాటైంది. ఆయనే ఆర్థిక సహకారం అందించి కలిసి పోటీ చేశారు. తాజా ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి నాయకత్వాన్ని సమకూర్చడమే గాక ఆర్థికంగానూ తోడ్పడ్డారనేది బహిరంగ రహస్యమే. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ జీవితాన్ని మొగ్గలోనే తుంచడానికి వివేకానందరెడ్డి రూపంలో ఆయన కుటుంబాన్ని చీల్చినట్టే ఇప్పుడు ఆయన సోదరి షర్మిలను తెలంగాణ కార్యక్షేత్రం నుంచి ఏపీలోకి దించాలనే కాంగ్రెస్ ప్రయత్నాల వెనుక వ్యూహం కూడా చంద్రబాబుదే!

తెలంగాణ కాంగ్రెస్‌లో షర్మిలకు భాగస్వామ్యం కల్పించడానికి రేవంత్‌రెడ్డి వ్యతిరేకించడం, ఆమె ఇడుపులపాయ, విజయవాడల పర్యటనలకు సీఎం రమేశ్ ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయడం, పులివెందులలో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీలో ఉండే బీటెక్ రవి కడప ఎయిర్‌పోర్టులో బ్రదర్ అనిల్‌తో రాజకీయ చర్చలు జరపడం... ఇవన్నీ చంద్రబాబు పాత్రను నిర్ధారిస్తున్నాయి. అడ్రస్ గల్లంతయిన కాంగ్రెస్ పార్టీకి ఆశ్రయం కల్పించడం కోసం చంద్రబాబు ఎందుకు తాపత్రయపడుతున్నట్టు? కాంగ్రెస్ పార్టీ ఎంతో కొంత వైసీపీ ఓట్లను చీల్చకపోతుందా అన్న ఆశ. కుళ్లిపోయి కంపు గొడుతున్న పాతకాలపు రాజకీయ చతురత ఇది.

ఏపీ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ పార్టీనీ, హామీ మేరకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఎగవేసిన బీజేపీనీ కుడిఎడమల నిలబెట్టుకొని అధికార పార్టీపై యుద్ధం చేయాలనుకోవడమే ఒక దిక్కుమాలిన ఆలోచన. మెదడు పూర్తిగా పాడైతే తప్ప ఈ తరహా ఆలోచనలు ఎవరూ చేయలేరు. నెగెటివ్ ఓటును చీల్చాలంటే ఒక అర్థం ఉంటుంది. పాజిటివ్ ఓటును ఎట్లా చీల్చగలుగుతారు? అది ప్రభుత్వం పట్ల అభిమానంతో వేసే ఓటు కదా? మరో పార్టీతో ఎట్లా పంచుకుంటారు?

అది పక్కన పెడితే, జగన్ ప్రభుత్వం ఈ దేశం ముందుకు ఒక కొత్త ఎజెండాను తీసుకొచ్చింది. మెజారిటీ ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలందరూ సాధికారత సంతరించుకోవడమే ఆ ఎజెండా. ఈ సరికొత్త నమూనా ఇప్పుడు ప్రపంచంలోని అభ్యుదయ శక్తుల దృష్టిని ఆకర్షిస్తున్నది. రాష్ట్రంలోని బహుజనులంతా జగన్ పార్టీ గొడుగు కిందకు సమీకృతమవుతున్నారు. పాచిపోయిన వ్యూహాలతో, ఊకదంపుడు హామీలతో వారిని చీల్చడం కలలోని మాట.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి కూడా సంప్రదాయ

తెలంగాణ కాంగ్రెస్‌లో షర్మిలకు భాగస్వామ్యం కల్పించడానికి రేవంత్‌రెడ్డి వ్యతిరేకించడం, ఆమె ఇడుపులపాయ, విజయవాడల పర్యటనలకు సీఎం రమేశ్ ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయడం, పులివెందులలో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీలో ఉండే బీటెక్ రవి కడప ఎయిర్‌పోర్టులో బ్రదర్ అనిల్‌తో రాజకీయ చర్చలు జరపడం... ఇవన్నీ చంద్రబాబు పాత్రను నిర్ధారిస్తున్నాయి. అడ్రస్ గల్లంతయిన కాంగ్రెస్ పార్టీకి ఆశ్రయం కల్పించడం కోసం చంద్రబాబు ఎందుకు తాపత్రయపడుతున్నట్టు? కాంగ్రెస్ పార్టీ ఎంతో కొంత వైసీపీ ఓట్లను చీల్చకపోతుందా అన్న ఆశ. కుళ్లిపోయి కంపు గొడుతున్న పాతకాలపు రాజకీయ చతురత ఇది.

ఏపీ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ పార్టీనీ, హామీ మేరకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఎగవేసిన బీజేపీని కుడి ఎడమల నిలబెట్టుకొని అధికార పార్టీపై యుద్ధం చేయాలనుకోవడమే ఒక దిక్కుమాలిన ఆలోచన. మెదడు పూర్తిగా పాడైతే తప్ప ఈ తరహా ఆలోచనలు ఎవరూ చేయలేరు. నెగెటివ్ ఓటును చీల్చాలంటే ఒక అర్థం ఉంటుంది. పాజిటివ్ ఓటును ఎట్లా చీల్చగలుగుతారు? అది ప్రభుత్వం పట్ల అభిమానంతో వేసే ఓటు కదా? మరో పార్టీతో ఎట్లా పంచుకుంటారు?

రాజకీయ పార్టీలకు భిన్నమైనది. సామాజిక న్యాయాన్ని మరింత ముందుకు తీసుకొనిపోవడం, స్థానిక ప్రజల ఆకాంక్షలనూ, సామాజిక వర్గాల ఆకాంక్షలనూ గౌరవించడం, ప్రజా ప్రతినిధులను ప్రజలకు జవాబుదారీగా నిలపడం జగన్ మోహన్ రెడ్డి ఎజెండాలో భాగం. టిక్కెట్ల పంపిణీలోనూ ఇది ప్రతిఫలిస్తున్నది. ఈ కొత్త ఒరవడిని ఊహించలేని యెల్లో మీడియా, సాంప్రదాయ రాజకీయ పరిశీలకులు హరాయించుకోలేకపోతున్నారు. ఏదో జరిగిపోతున్నదని తాటాకు చప్పుళ్లతో హడావిడి చేస్తున్నారు. జగన్ మోహన్‌రెడ్డి మాత్రం కూల్‌గా తన పని తాను చేసుకుంటూ వెళుతున్నారు.

యెల్లో మీడియా సంగతి తెలిసిందే. అది చేసే గోబెల్స్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్ తరహా దుష్ప్రచారం సంగతీ తెలిసిందే. చంద్రబాబు పరిపాలనలో అభివృద్ధి అంతరిక్షాన్ని తాకిందనీ, జగన్ మోహన్‌రెడ్డి దాన్ని పాతాళంలోకి తోసేసాడనీ రాయని రోజు లేదు. అమరావతి అనే రాజధాని నగరం అలనాటి విజయ నగరంలా వెలిగిపోయిందనీ, ఇప్పుడు మసకబారిందనీ రాస్తున్నారు. 'కత్తులును ఘంటములు కదనుదొక్కినవిచట... అంగళ్ల రతనాలు అమ్మినారట ఇచట...' అంటూ గ్రాఫిక్-డిజైన్లను చూపెడుతున్నారు. ఇప్పుడు రాజధాని రాళ్లపాలైందని వాపోతున్నారు. నిజానికి రాష్ట్రంలోని ఏ పట్టణాన్ని తీసుకున్నా చంద్రబాబు ఐదేళ్ల పాలనతో పోలిస్తే ఈ అయిదేళ్లలో జరిగిన అభివృద్ధే ఎక్కువ. మౌలిక వసతుల రంగంలో గడిచిన డెబ్బయ్యేళ్ల అభివృద్ధిని సవాల్ చేసేదిగా ఈ ఐదేళ్ల కాలం నిలబడిపోతుంది.

ఏకకాలంలో నాలుగు ఓడరేవులు శరవేగంగా పూర్తవుతున్నాయి. పది ఫిషింగ్ హార్బర్లు రూపుదిద్దుకుంటున్నాయి. విశాఖ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం పనులు జరుగుతున్నాయి. 17 మెడికల్ కాలేజీలు నిర్మాణమవుతున్నాయి. 13 కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయి. ప్రతి పల్లె ఒక మినీ రాజధానిగా మారింది. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, విలేజ్ క్లినిక్‌లు వగైరా వేలాది కొత్త భవనాలతో గ్రామసీమలు కళకళలాడుతున్నాయి. పేద బిడ్డలకు అధునాతనమైన బడులు అందుబాటులోకి వచ్చాయి. ఇంటి ముందటే ఆధునిక వైద్యం లభిస్తున్నది. ఇటువంటి మార్పులను యెల్లో మీడియా డార్లింగ్ విజనరీ కలలో కూడా ఊహించి ఉండరు. అందుకే కలవరపడుతున్నారు. తాటాకుల చప్పుళ్లు చేస్తున్నారు. ఐదు వేల మంది యువకులకు శిక్షణ ఇచ్చి ఒక మౌత్ పబ్లిసిటీ వింగ్ (మూతి ప్రచారంగాళ్లు)ను ఏర్పాటు చేసి జనంలోకి వదిలారు. రాబిన్ శర్మ టీమ్‌తో పాటు ఒక రిటైర్డ్ డీఐజీ ఈ వింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. నలుగురు కూడిన ప్రతి చోటకు ఈ మూతి ప్రచారంగాళ్లు చేరుకుంటారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేక గాలి వీస్తున్నదని, అన్నిచోట్లా ఓడిపోతారని చెబుతారు. ఎన్నికలయ్యేంత వరకూ వీరి పని ఇదే! ఈ ప్రచారంతో జనం ప్రభావితం కావాలనే అధమస్థాయి ఎత్తుగడ. వీరి ఆపసోపాలూ, ఆయాస ప్రయాసలూ వినోదభరితంగానే ఉన్నాయి. గెలుపు మీద నమ్మకం లేక గిమ్మిక్కులు ప్రదర్శిస్తుంటే గమ్మత్తుగానే కనిపిస్తున్నది. ఔను! వారి ఆర్తనాదములు శ్రవణానందకరముగా నున్నవి!!

vardhelli1959@gmail.com


తాత్విక అనువాద మూర్తి

సుసంపన్నమైన, వివిధ పార్శ్వాల తెలుగు సాహిత్యంలో, అనువాద సాహిత్య సృష్టి అరుదనే చెప్పాలి. అలాంటి అరుదైన అనువాద కవిత్వం, సాహితీ రచనలో అందె వేసిన కవి, రచయిత యల్లపు ముకుంద రామారావు. మరొక విశేషం... ఏమిటంటే, ఆయన ప్రవాసాంధ్రుడు. 'రెండవ ఆంధ్ర'గా ఒకనాడు పిలువబడిన పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో పుట్టి పెరిగారు. తాత తండ్రుల మూలాలు నేటి అనకాపల్లి జిల్లా, వెంకుపాలెం గ్రామంలో ఉన్నాయి.

యవ్వన దశలోనే రచనా వ్యాసంగం ప్రారంభమైంది. దానికి ప్రవాసాంధ్ర ప్రముఖ రచయితలు ఘండికోట బ్రహ్మాజీ రావు, ముద్దంశెట్టి హనుమంతరావు, ఎస్.ఆర్.నంది వంటి వారితో సాన్నిహిత్యం ఎంతో తోడ్పడింది. రైల్వే శాఖలో ఇంజనీరుగా, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్ వంటి చోట్ల వృత్తి జీవితం గడిచింది. ఆ తర్వాత మారిన వృత్తి రీత్యా అమెరికా, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలలో చాలా కాలం పాటు నివసించారు.

బాల్యం, యవ్వనోత్సాహంలో మామూలు సాదా సీదా కథలు, కథానికలు రాశారు. కౌమార దశలోకి ప్రవేశించిన తర్వాత, ఆయన దృష్టి పూర్తిగా మారిపోయింది. ప్రసిద్ధ విద్యా సాహిత్య వేత్తలు చే.రా., ఆచార్య ఎన్. గోపి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, వెల్చేరు నారాయణ రావు తదితరుల సాన్నిహిత్యం తన సాహితీ వికాసానికి ఎంతో తోడ్పడిందని వినమ్రతతో చెబుతారు.

మంచి సామాజిక, తాత్విక చింతనా కోణంలో ప్రతి అంశాన్నీ పరిశీలించే ముకుంద రామారావు రాశిలోను, వాసిలోను వన్నెలీనిన అపురూపమైన వచన రచనలు చేసి, తెలుగు సాహిత్యాభిమానుల ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. 'అదే ఆకాశం', 'అదే గాలి', 'అదే నేల', 'అదే కాంతి', 'అదే నీరు' పేరుతో ఆయన చేసిన అపురూప రచనలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయనడం అతిశయోక్తి కాదు. ఈ అయిదు పుస్తకాల రచన కోసం, ఆయన ఒక సాహిత్య పరిశోధక విద్యార్థి స్థాయిలో కృషి చేశారు. భారత దేశంలో ఒక మహా అధ్యాయం బౌద్ధయానం, బౌద్ధమత ప్రచారం కోసం సృష్టించబడిన సాహిత్యం. 'చర్యా పదాలు' పుస్తక రచన ఆ భావజాల ఆరాధకుల్ని, చారిత్రక పరిశోధకుల్నీ అమితంగా ఆకట్టుకున్నది. అలాగే తాను పుట్టి పెరిగిన వంగ భూమి రుణం తీర్చుకోవడానికా అన్నట్లు, ఆయన ఈనాటి వరకు సరైన గుర్తింపునకు నోచుకోని, బెంగాల్ భాషలోని బౌల్ కవిత్వాన్నీ అనువదించారు.



వై. ముకుంద రామారావు

'తాత్విక ధోరణి నన్ను బాగా ప్రభావితం చేస్తుంది. నిరంతరం వలస వేదజ్ఞానం నాలో ఉంటుందని' చెప్పే ముకుంద రామారావు ప్రతి రచనలోనూ ఆ రెండు ధోరణులు ప్రతిబింబిస్తాయి. వందమంది జాతీయ, అంతర్జాతీయ కవులను, వారి కొన్ని కవితలను 'విశాలాక్షి' మాస పత్రికలో పరిచయం చేశారు. గుడిపాటి సంపాదకత్వంలోని 'పాలపిట్ట' పత్రికలో 37 మంది నోబెల్ కవులను పరిచయం చేశారు. 'నవ తెలంగాణ' పత్రికలో నోబెల్ బహుమతి గ్రహీతలైన రచయిత్రులను పరిచయం చేశారు. అరుదైన సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించిన ముకుంద రామారావుకు అప్పాజోస్యుల-విష్ణుభొట్ల, కందాళం ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కార' ప్రదానం సందర్భంగా ఆయనకు అభినందనలు!

– బి.వి. అప్పారావు, సాంస్కృతిక విమర్శకుడు

'ముకుంద' కవితా రూపం

తెలుగు వర్తమాన వచన కవులలో నాకు మిక్కిలి ఇష్టమైన ముగ్గురు నలుగురు కవులలో యల్లపు ముకుంద రామారావు ఒకరు. మా గురువర్యులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం సాహిత్య విమర్శ పాఠం చెపుతూ 'కవిత్వము – వేదాంతము ఒకే కొమ్మకు పూచిన రెండు పువ్వులు' అన్నారు. ఈ రెండు పువ్వుల సౌరభాలను మేళవించి, సారవంతంతో మంచి కవిత్వం చెప్పిన వారిలో ముకుంద రామారావు మొట్టమొదటి వారు. వృత్తిరీత్యా కంప్యూటర్ ఇంజనీరు అయిన ముకుంద రామారావు ప్రవృత్తి రీత్యా మూర్తీభవించిన కవి.

రామారావు 1995 నుండి 2017 వరకు 22 ఏళ్ల కాలంలో స్వీయ కవితా సంపుటాలను మాత్రమే ప్రచురించారు. రామారావు ఏ కవిత అయినా సరే సంక్షిప్తంగా, అనుభూతి సాంద్రంగా, ఆత్మీయతానుబంధంతో కూడి ఉంటుంది. ప్రకృతిలోనూ, మానవ జీవితంలోనూ దాగి ఉన్న సృష్టి రహస్యాన్ని వెదుకుతూ ఉంటుంది. తమ పెద్దమ్మాయికి పెండ్లి చేసి అత్తగారింటికి పంపిన తర్వాత ఆమె కోసం బెంగపెట్టుకొని 'వలసపోయిన మంద హాసం' అనే మొట్టమొదటి కవిత వ్రాశారు రామా రావు. ఆ కవితకు ఎంతో పేరు వచ్చింది. 1995లో ఇదే శీర్షికతో మొదటి కవితా సంపుటిని వెలువరించారు. అక్కడి నుండి ఆయన కవితా దిగ్విజయ యాత్ర కొనసాగింది.

'మరో మజిలీకి ముందు' కవితా సంపుటికి ప్రముఖ కవి ఇస్మాయిల్ 'కవిత్వ మజిలీ కథలు' అనే పేరుతో చాలా గొప్ప పీఠిక వ్రాశారు. అందులో 'ముకుంద రామారావు కవితల్లో సున్నితమైన హృదయం అనుభవ ప్రకంపనలకు స్పందించే తీరు కనిపిస్తుంది. ఇక్కడ మనతో మాట్లాడేది హృదయం, హేతువు కాదు...' అని రాశారు.

'ఎవరున్నా లేకున్నా' కవితా సంపుటికి ప్రముఖ కవి, అనువాదకుడు అయిన దీవి సుబ్బారావు తాను రాసిన పీఠికలో 'ముకుంద రామారావు గారి వ్యక్తిత్వం నుండి కవిత్వాన్ని విడదీసి చూడలేము... ఇలాంటి కవిత్వాన్ని చెప్పడానికి మనిషి తాత్త్వికుడై ఉండాలి. చుట్టూరా ఉన్న మనుషుల్ని ప్రేమించ గలిగిన వాడై ఉండాలి. ముకుంద రామారావు గారు ఆ కోవకు చెందినవారు' అని రాశారు. 'నిశ్శబ్దం నీడలో' కవితా సంపుటిలో శరీరంలోని ప్రాణాన్ని ఒక దీపంతో పోల్చుతూ 'దేహ దీపం' అనే ఆ చిన్న కవిత వ్రాశారు–

'దళసరి చర్మం / ఎముకల గూడు / రహస్య స్థావరంలో / దేహ దీపం! / ఎంతోకొంత వెలిగి / ఆరిపోతుందో / ఎగిరిపోతుందో / ఎవరికెరుక? / ఆపలేక / అందుకోలేక / జీవితాంతం ఆరాటం!!' స్వీయ అనువాద రచనలు రామారావు సాహిత్య కృషిలో ముఖ్యమైనవి. దీనిలో మొత్తం 14 గ్రంథాలున్నాయి. వీటిలో మొదటి అయిదు పుస్తకాలు ఈ ప్రపంచ సృష్టికి మూల భూతములయిన పంచభూతాల పేర్లతో వెలువడ్డాయి. 'ఆకాశం – గాలి – నేల – కాంతి – నీరు' అనే వరుసలో తమ అనువాద గ్రంథాలను వెలువరించారు. 'అదే నీరు' పీఠికలో తనలో దాగివున్న పంచభూతాలను తెలియజేస్తూ, ఒక చక్కటి కవిత వ్రాశారు. 'అవును/సూర్యుడు వస్తుంటాడు పోతుంటాడు –/ఆకాశం అదే!/ అలలు వస్తుంటాయి పోతుంటాయి –/సముద్రం అదే!/సముద్రం నువ్వయితే –/నీటిలో మునిగి ఈదాలనుకునే చేపని నేను!' అని సాగే ఇంత గొప్ప కవితను ఈ మధ్యకాలంలో నేను చదవలేదు. దీనిని చదివిన నేను 'ఈ కవితలో కలసిపోతిని, కరిగిపోతిని, కాన రాకే కదిలి పోతిని!'

– ప్రొ॥ తంగిరాల వెంకట సుబ్బారావు, సాహితీవేత్త

(అజో–విభొ కందాళం వారి ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం నేడు విశాఖలో ముకుంద రామారావు అందుకుంటున్న సందర్భంగా)

క్లుప్తంగా...

అభయహస్తానికి 'శివుడి' దరఖాస్తు



ముత్తారం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో శివుడి పేరుమీద వచ్చిన దరఖాస్తు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో శివుడి పేరుతో అభయహస్తం దరఖాస్తు రావడం పలువురిని ఆశ్చర్యపరిచింది. ఆఖరి రోజు శనివారం దరఖాస్తుల్లో ముత్తారం గ్రామస్తుడు ఏనుగు వెంకట సురేందర్‌రెడ్డి శివుడి పేరుతో దరఖాస్తు చేశాడు. **దరఖాస్తుదారు పేరు:** శివుడు, **భార్య పేరు:** పార్వతీదేవి, **కుమారుల పేర్లు:** కుమారస్వామి, వినాయకుడిగా రాశాడు. అందులో గృహలక్ష్మి, గృహజ్యోతి, రైతుబంధు, ఇందిరమ్మ గృహానికి దరఖాస్తు చేసినట్లు ఉంది. అధికారులు దరఖాస్తు తీసుకున్నట్లు రశీదు కూడా ఇవ్వడం గమనార్హం.

మునిసిపల్ శాఖలో అధికారుల బదిలీ

సాక్షి, హైదరాబాద్: మునిసిపల్ శాఖలో పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యుటేషన్ మీద జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్ బి. శ్రీనివాస్‌రెడ్డిని మాతృసంస్థకు పంపిస్తూ జీవో విడుదల చేశారు. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి స్నేహ శబరీశ్‌ను నియమించారు. అలాగే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఉన్న సెలక్షన్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్ వి.మమతను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐయూఎం)కు బదిలీ చేశారు. మమత స్థానంలో ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్‌ను నియమించారు. జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణను మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. మరో ఎస్‌ఈ మల్లికార్జునుడును తదుపరి పోస్టింగ్ కోసం ఈఎన్‌సీ (పబ్లిక్ హెల్త్)కి రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫార్ములా రేసుకు అనుమతి నిరాకరణపై హర్షం

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా రేసుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంపై నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇదివరకు నిర్వహించిన ఫార్ములా రేసు వల్ల ట్రాఫిక్‌జాం కావడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా గత ప్రభుత్వం ఫార్ములా రేసులపై అవివేక నిర్ణయం తీసుకుందని, పైగా మాజీమంత్రి కేటీఆర్ అవివేకంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్ములా రేసులతో విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదమని నిరంజన్ అన్నారు.

ప్రజాపాలనకు 1.25 కోట్ల దరఖాస్తులు

- అందులో కోటి వరకు అభయహస్తానికి, మిగిలిన 20 లక్షలు ఇతర సమస్యలపై
- అన్నింటికీ రేషన్ కార్డు లింక్ అనడంతో ఆ కార్డులకు విపరీతమైన డిమాండ్



నల్లగొండలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

తేదీ	ప్రజావాణి దరఖాస్తులు
08.12.2023	2,019
09-12-2023	816
10-12-2023	163
11-12-2023	1,619
12-12-2023	1,328
15-12-2023	7,153
19-12-2023	4,361
22-12-2023	3,944
26-12-2023	2,447
29-12-2023	1,305
02-01-2024	1,305
05-01-2024	2,200
మొత్తం	30,148

సాక్షి ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా భారీస్థాయిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. గత నెల 28న ప్రారంభమైన ఈ ప్రజాపాలన శనివారం(జనవరి 6)తో ముగిసింది. ఈ ఎనిమిది రోజుల్లో 1,24,85,383 పైగానే దరఖాస్తులు అందాయి. వీటిలో కోటికి పైగా అభయహస్తానికి సంబంధించిన దరఖాస్తులు రాగా 20 లక్షల దరఖాస్తులు ఇతర సమస్యలపై వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల అమలులో భాగంగా ప్రజాపాలన పేరిట ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకునే కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. వచ్చిన దరఖాస్తులన్నింటినీ కంప్యూటరీకరించే కార్యక్రమానికి అధి కార యంత్రాంగం సిద్ధమైంది. ఆదివారం నుంచి ఈ కంప్యూటరీకరణ కోసం డీటీపీ ఆపరేటర్లను సైతం తాత్కాలిక పద్ధతిలో తీసుకుంటోంది.

డిప్యూటీ సీఎం భట్టి శ్రీకారం

గతనెల 28వ తేదీన నగర శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లాంఛనంగా ఈ క్రార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇతర జిల్లాల్లో మంత్రులు ప్రారంభించగా, సీఎం రేవంత్‌రెడ్డి ఎడతెగని పనులతో తీరిక లేకుండా ఉన్న నేపథ్యంలో ఎక్కడా పాల్గొనలేకపోయారని ప్రభుత్వవర్గాల సమాచారం. ప్రజాపాలన కొనసాగుతుండగానే.. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం కూడా మంగళ, శుక్రవారాల్లో కొనసాగిస్తున్నారు. ప్రజాపాలనలో పెద్దఎత్తున దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ... ప్రజావాణిలో సైతం శుక్రవారం వరకు దాదాపు 30 వేలకుపైగా దరఖాస్తులు రావడం గమనార్హం.

ప్రతి రోజూ సీఎస్ సమీక్ష

ప్రతిరోజూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీ రాజ్ ముఖ్యకార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎప్పటికప్పుడు సమీక్షించారు. దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

పోటెత్తిన సమస్యలు

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, చేయూత పథకాల కోసం అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇక పథకాలన్నింటికీ రేషన్ కార్డు ప్రధానం అని సర్కారు తేల్చి చెప్పిన నేపథ్యంలో లక్షల సంఖ్యలో వాటి కోసం దరఖాస్తులు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వంలో ఇచ్చిన గృహలక్ష్మి దరఖాస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో.. వారంతా తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు భారీ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. ప్రారంభంలో ఇదివరకే పెన్షన్ తీసుకుంటున్న వారు, రైతుబంధు లబ్ధిదారులు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న ప్రచారం జరిగింది. కానీ ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో వివరణ ఇస్తూ.. పెన్షన్‌దారులు, రైతుబంధు పొందుతున్న వారు కొత్తగా రైతుభరోసా, చేయూత కింద దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, కొత్తగా కావాల్సిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేయడంతో.. క్రమంగా వాటి సంఖ్య తగ్గినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ప్రజావాణిలో 30,148 అర్జీలు స్వీకరణ

హైదరాబాద్(లక్డీకాపూల్): మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తోన్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. గత నెల 8వ తేదీ నుంచి శుక్రవారం వరకు ప్రజావాణికి 30,148 అర్జీలు వచ్చాయి. తొలుత రోజూ నిర్వహించినా.. ఇప్పుడు ప్రజావాణి కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులకు కుదించి ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నారు.

గ్రేటర్ సిగలో మరో నగ!

- ఫైవ్ స్టార్ ర్యాంకింగ్‌కు ఎంపికైన నగరం
- 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో జాతీయ పురస్కారం
- ఈ నెల 11వ తేదీన అవార్డు అందజేత

సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ మరో అరుదైన ఘనతను సాధించింది. బల్దియా సిగలోకి మరో నగ వచ్చి చేరింది. పరిశుభ్రత విభాగంలో నగరాలకిచ్చే పురస్కారాల్లో భాగంగా ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఆహ్వానం అందినట్లు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది. ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కోసం జీహెచ్‌ఎంసీ ఫైవ్ స్టార్ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసింది. దీంతో డిసెంబర్ 23వ తేదీ నుంచి పది రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటించిన థర్డ్ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాల్ని సేకరించింది. తన నివేదికను కేంద్రానికి అందజేసింది. ఈ నెల 11వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర హౌసింగ్, పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా జాతీయస్థాయి అవార్డును ప్రకటించనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీకి ఆహ్వానం అందింది. దీంతో తమకు ఫైవ్ స్టార్ ర్యాంకింగ్ రానున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. 'స్వచ్ఛ సర్వేక్షణ్ -2023' అవార్డుల్లో భాగంగా లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలను (నేషనల్ ర్యాంకింగ్), లక్ష కంటే తక్కువ ఉన్న జనాభా నగరాలను (స్టేట్ అండ్ జోనల్ ర్యాంకింగ్) ఎంపిక చేసి అవార్డులిస్తారు. గత రెండు సంవత్సరాలుగా వాటర్‌ప్లస్ సిటీగా కూడా గుర్తింపు పొందిన జీహెచ్‌ఎంసీ ఇప్పటికే త్రీ స్టార్ ర్యాంకింగ్స్‌లో ఉంది. ఈసారి ఫైవ్ స్టార్ ర్యాంకింగ్ పొందనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. అయితే.. ఈ ర్యాంకింగ్‌ను కేంద్రం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఇప్పటి వరకు..

◆ జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ సర్వేక్షణ్ కింద 2015 నుంచి 2022 వరకు 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాల్లో వివిధ ర్యాంకింగ్‌లు సాధించింది. పలు అవార్డులు పొందింది. ◆ స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో గ్రేటర్ హైదరాబాద్‌కు బెస్ట్ స్టేట్ క్యాపిటల్ అవార్డు లభించింది. -స్వచ్ఛ సర్వేక్షణ్-2019లో బెస్ట్ మెట్రో సిటీ అవార్డు దక్కింది. ఇదే సంవత్సరంలో ఓడీఎఫ్++ ర్యాంకింగ్ లభించడంతో పాటు స్వచ్ఛత ఎక్సలెన్సీ అవార్డు పొందింది. ◆ సర్వేక్షణ్-2020 లో బెస్ట్ మెగా సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డు పొందింది. 2021 సంవత్సరంలో బెస్ట్ సెల్ఫ్ సస్టైనబుల్ మెగా సిటీ అవార్డును పొందడం ద్వారా త్రీ స్టార్ హోదాను సాధించింది. ఇదే సంవత్సరంలో వాటర్ ప్లస్ సర్టిఫికెట్‌ను మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ అఫైర్స్, హౌసింగ్ ద్వారా పొందింది. ◆ 2022 సంవత్సరంలో గార్బేజ్ ఫ్రీ సిటీ కింద త్రీ స్టార్ హోదాను పొందింది. తిరిగి ఈ సంవత్సరం కూడా రీ-సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అవార్డు రావడం బాధ్యత మరింత పెరిగిందని బల్దియా అధికారులు పేర్కొన్నారు.

ఒక్క దరఖాస్తు.. అధికారి చొరవ..

- ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం
- అటవీ గ్రామం ఉడుంపూర్‌కు అందనున్న సాగునీరు



శనివారం కాలువ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి

నిర్మల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన'వల్ల సుదీర్ఘకాలంగా ఉన్న తమ ఊరి సమస్య పరిష్కారమవుతోందని నిర్మల్ జిల్లా కడెం మండలం ఉడుంపూర్ గ్రామ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం కవ్వాల్ అభయారణ్య ప్రాంతంలో ఉంటుంది. ఇక్కడ దాదాపు 2,500 జనాభా ఉండగా.. ఈ ఊరికి అటవీ ప్రాంతం నుంచి వచ్చే వాగు ఉంది. ఈ వాగుపై ఎప్పుడో కట్టిన చెక్‌డ్యామ్ 30-40 ఏళ్ల కిందటే కొట్టుకుపోయింది. గతంలో చెక్‌డ్యామ్ నుంచి వచ్చే కాలువతో సమీపంలోని చెరువులు నింపేవారు. అయితే చెక్‌డ్యామ్, కాలువ దెబ్బతినడంతో సాగునీటికి గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉడుంపూర్ కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉండటంతో కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడానికి అటవీశాఖ అనుమతులివ్వడం లేదు. ఏళ్లుగా గ్రామస్తులు మొర పెట్టుకుంటున్నా.. ఎవరూ పరిష్కారం కోసం ప్రయత్నం చేయలేదు.

కదిలిన అధికారి..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈనెల 3న ఉడుంపూర్‌లో నిర్వహించారు. కడెం మండల ఇన్‌చార్జిగా ఉన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) విజయలక్ష్మి ఆరోజు ఉడుంపూర్‌లో కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా 'ఆరు గ్యారంటీ'ల దరఖాస్తులతోపాటు తమ ఊరి సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలంటూ గ్రామస్తులు డీఆర్‌డీవో విజయలక్ష్మికి దరఖాస్తును అందించారు. వెంటనే స్పందించిన ఆమె సభ కాగానే, గ్రామస్తులతో కలసి మోటార్‌బైక్‌పై కొంతదూరం, ఆపై కాలినడకన అటవీ ప్రాంతంలో ఉన్న చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆమె ఉడుంపూర్ నీటి సమస్యను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో చర్చించారు. వారి సూచనల మేరకు వెంటనే రూ.9 లక్షల అంచనాలతో పనులకు ప్రణాళికలు రూపొందించారు. అటవీ ప్రాంతంలో చెట్లకు ఇబ్బంది కలగకుండా కాలువ తవ్వకానికి పథకం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు చేతుల మీదుగా శనివారం చెక్ డ్యామ్ ప్రాంతం నుంచి కాలువ తవ్వకం పనులు ప్రారంభించారు. ప్రజాపాలనతో తమ ఊరి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించడంతో ఉడుంపూర్‌వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే బొజ్జు, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా రమేశ్‌నాయుడు



సాక్షి హైదరాబాద్: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి రమేశ్‌నాయుడిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన సీఐడీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఉన్నారు. ఇదివరకు పర్యాటక సంస్థ ఎం.డి.గా ఉన్న మనోహర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించారని ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే ఆయన తన సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లారు.

నేడు తెలంగాణ రచయితల సంఘం 'అంతర్వాణి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో ఈ ఆదివారం 'అంతర్వాణి' సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి నిఖిలేశ్వర్ తన జీవన ప్రయాణంపై వివరిస్తారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సంపత్ కుమార్ సమన్వయపరుస్తారు. ఇందులో ప్రముఖ కవులు సాహితీవేత్తలు పాల్గొంటారు.

మూసీ సుందరీకరణకు ముందడుగు

సబర్మతి, యమున రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి ఆధ్వర్యంలో అధికారుల బృందం గుజరాత్‌లోని అహ్మదాబాద్ సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, యమునా నదిని సందర్శించింది. రెండు నదుల ఉన్నతాధికారులతో సమావేశమై వాటి పరీవాహక ప్రాంతాల అభివృద్ధిపై చర్చించింది. శనివారం అధికారులు ఈ రెండు ప్రాజెక్టులకు అనుసంధానంగా ఉన్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లను, వాటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నమామి గంగా ప్రాజెక్టు డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్‌ను కలిసి చర్చించారు. ఆ రెండు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల ఉన్నతాధికారులు తమ అనుభవాలను మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలికి వివరించారు.

ఫార్ములా-ఈ రేసింగ్ రద్దు

ఫార్ములా-ఈ ఆపరేషన్స్ ప్రకటన

- తెలంగాణ ప్రభుత్వ విముఖత నేపథ్యంలో నిర్ణయం!
- ఎంఏయూడీ విభాగానికి నోటీసులు ఇవ్వనున్నట్లు ఎఫ్‌ఈఓ వెల్లడి
- గతేడాది రేస్ నిర్వహణకు రూ.100 కోట్లకు పైగా ఖర్చు
- వారం పాటు ట్రాఫిక్ కష్టాలపై తీవ్ర విమర్శలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఫార్ములా- ఈ కార్ రేసింగ్ పోటీలను (రేస్ రౌండ్ -4) రద్దు చేసినట్లు ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ ఈఓ) ప్రకటించింది. వచ్చే ఫిబ్రవరి 10వ తేదీన నెక్లెస్‌రోడ్డు స్ట్రీట్ సర్క్యూట్‌లో నిర్వహించవల సిన ఈ అంతర్జాతీయ పోటీలపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్న ట్లు పేర్కొంది. ఫార్ములా-ఈ పోటీలపై గతేడాది అక్టోబర్ 30వ తేదీన ఏర్పాటు చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆరోపించింది. ఈ మేరకు తెలంగాణ పురపాలన, పట్టణా భివృద్ధి (ఎంఏయూడీ) విభాగానికి నోటీసులు ఇవ్వను న్నట్లు ఎఫ్‌ఈఓ తెలిపింది. తెలంగాణ సర్కా ర్ వైఖరి తమను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసిందని ఎఫ్‌ఈఓ కో-ఫౌండర్, చీఫ్ చాంపియన్‌షిప్ ఆఫీసర్ ఆల్బర్ట్ లొంగో అన్నారు. తదుపరి పోటీలను హాంకాంగ్‌లో నిర్వహించను న్నట్లు తెలిపారు. ఫార్ములా-ఈ పోటీల వల్ల ఎలాంటి ప్రయోజ నం లేదని భావించడం వల్లే ప్రభుత్వం విముఖతతో ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పోటీల నిర్వహణపై ప్రభుత్వ ఉన్నతాధికారు లతో చర్చించేందుకు నిర్వాహ కులు ప్రయత్నించినప్పటికీ ఎలాంటి సానుకూలత వ్యక్తం కాలేదని ఈ నేపథ్యంలో పోటీలను రద్దు చేసినట్లు సమాచారం.

గత ఏడాది భారీ ఏర్పాట్లు


ప్రపంచవ్యాప్తంగా మోటార్ స్పోర్ట్స్ ప్రియులను విశేషంగా ఆకట్టుకొనే ఫార్ములా-ఈ పోటీలు గత సంవత్సరం ఫిబ్రవరి 10, 11 తేదీల్లో హైద రాబాద్ నెక్లెస్ రోడ్డులో జరిగాయి. ఈ పోటీల కోసం హెచ్‌ఎండీఏ సుమారు రూ.100 కోట్లకు పైగా వెచ్చించి స్ట్రీట్ సర్క్యూట్ నిర్మాణంతో పాటు అన్ని ఏర్పాట్లు చేసింది. భారతదేశంలోనే మొట్టమొదటిసారి ఈ పోటీలు జరగడంతో దేశవ్యాప్తంగా భారీఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు వేలా దిమంది మోటార్ స్పోర్ట్స్ ప్రియులు, రేసింగ్ డ్రైవర్‌లు హైదరాబాద్‌ను సందర్శించారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

ఫార్ములా-ఈ పోటీలతో పాటు అంతకంటే రెండు నెలల ముందు జరిగిన ఒక రోజు ఇండియన్ రేసింగ్ కార్ పోటీల సందర్భంగా నగ రంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నెక్లెస్‌రోడ్డు వైపు వచ్చే వాహనాలను నిలిపివేశారు. దీంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హిమాయత్‌నగర్ మార్గాల్లో ఖైరతాబాద్ వైపు ట్రాఫిక్ స్తంభించింది. అమీర్‌పేట్ వైపు నుంచి లక్డీకాపూల్ వైపు వచ్చే వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఐదు రోజుల ముందు నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోటీలపై సామాజిక మాధ్యమాల్లో పెద్దయెత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రజలకు ట్రాఫిక్ నరకాన్ని చూపుతూ ఎవరి కోసం ఈ పోటీలు అంటూ నెటిజన్‌లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ పరిస్థితిని కూడా దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఇది దుర్మార్గమైన తిరోగమన చర్య: కేటీఆర్




ఫార్ములా -ఈ రేస్‌కు ప్రభుత్వం వెనుకడుగు వేయడంపై బీఆర్‌ఎస్ కార్య నిర్వాహక అధ్య క్షుడు కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గమైన, తిరోగ మన నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'హైదరాబాద్ ఇ- ప్రిక్స్ వంటివి ప్రపంచవ్యాప్తంగా మన నగరం, దేశం బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో హైదరాబాద్ నగరాన్ని ఆకర్షణీయమైన పెట్టుబడులకు గమ్యస్థానంగా ప్రపంచానికి చాటేందుకు ఉపకరిస్తాయి. ఎలక్ట్రానిక్ వాహన రంగానికి చెందిన ఔత్సాహికులు, తయారీదారులు, స్టార్టప్‌లను ఆకర్షిస్తూ ఒక వారం పాటు ఈవీ సమ్మిట్‌ను నిర్వ హించేందుకు ఫార్ములా-ఈ రేస్‌ను ఒక సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం ఉపయోగించుకుంది..' అని కేటీఆర్ పేర్కొన్నారు. సస్టైనబుల్ మొబిలిటీ సొల్యూషన్స్‌కు కేంద్రంగా రాష్ట్రాన్ని ప్రమోట్ చేయడానికి తాము తెలంగాణ మొబిలిటీ వ్యాలీని కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

గాల్లో గజగజ

టేకాఫ్ అయిన కాసేపటికే విమానానికి పెద్ద రంధ్రం

- ఐదు కిలోమీటర్ల ఎత్తులో ఉండగా ప్రమాదం
- ఉన్నట్టుండి ఊడి పడిపోయిన కిటికీ భాగం
- పెను గాలుల తాకిడికి ఊగిపోయిన విమానం
- 174 మంది ప్రయాణికులకు గాల్లో ప్రత్యక్ష నరకం
- అరగంట తర్వాత సురక్షితంగా ల్యాండింగ్
- అమెరికాలోని ఓరెగాన్‌లో గగుర్పొడిచే ఘటన


అది అమెరికాలో ఓరెగాన్‌లోని పోర్ట్‌లాండ్ విమానాశ్రయం. శుక్రవారం సాయంత్రం 4.52 గంటలు. అలస్కా ఎయిర్‌లైన్స్‌కు చెందిన అత్యాధునిక బోయింగ్ 737 మాక్స్ 9 విమానం 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో కాలిఫోర్నియాలోని ఒంటారియో బయల్దేరింది. టేకాఫ్ తీసుకుని, చూస్తుండగానే వేగం పుంజుకుని దాదాపు 5 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లింది. బయల్దేరిన ఆరు నిమిషాలకే విమానం రెక్క వెనక ప్రయాణికుల వరుసను ఆనుకుని ఉన్న కిటికీతో పాటు కొంత భాగం ఉన్నట్టుండి ఊడి గాల్లో కలిసిపోయింది. ఒక ఫ్రిజ్‌ను మించిన పరిమాణంలో పెద్ద రంధ్రం పడింది. దాంతో విపరీతమైన వేగంతో పెను గాలులు లోనికి దూసుకొచ్చాయి. వాటి దెబ్బకు విమానం పిచ్చి పట్టినట్టు అటూ ఇటూ ఊగిపోవడం మొదలుపెట్టింది. లోపల వాయు పీడనం పూర్తిగా తగ్గిపోవడంతో ప్రయాణికులంతా ప్రాణ భయంతో వణికిపోయారు. రంధ్రంలోంచి దూసుకొస్తున్న పెను గాలుల వేగానికి ఆ వరుసలోని సీట్లోనే కూర్చున్న ఒక చిన్నారి చిగురుటాకులా వణికిపోయాడు. గాలి విసురుకు అతని షర్టు ఒంటి నుంచి విడివడి అమాంతంగా బయటికి దూసుకెళ్లింది. దాంతో పాటే బాబు కూడా గాల్లోకి లేవడంతో తల్లి పెను కేకలు వేసింది. బలమంతా ఉపయోగించి అతన్ని గట్టిగా కౌగిలించుకుని ఆపింది! ఇంకో ప్రయాణికుని చేతిలోని సెల్ ఫోన్ గాలి విసురుకు శరవేగంగా విమానంలోంచి బయటికి దూసుకెళ్లింది. దాంతో విమానమంతటా హాహాకారాలు చెలరేగాయి. ప్రాణభయంతో ప్రయాణికులు ఆర్తనాదాలు చేశారు. సీట్ బెల్టులు పెట్టుకుని సీట్లను గట్టిగా కరుచుకున్నారు. అందరి ప్రాణాలూ అక్షరాలా గాల్లో వేలాడాయి. 10 నిమిషాలకు పైగా నరకం చూసిన అనంతరం విమానాన్ని పైలట్ కల్లోలం మధ్యే అతి కష్టంగా వెనక్కు మళ్లించింది. నిబ్బరంగా కిందికి దించి సాయంత్రం 5.27కు తిరిగి పోర్ట్‌లాండ్ విమానాశ్రయంలోనే సురక్షితంగా లాండ్ చేసింది. దాంతో బతుకు జీవుడా అంటూ అంతా ఊపిరి పీల్చుకున్నారు. అచ్చం హాలీవుడ్ సినిమాను తలపించిన ఈ ప్రమాదం బారి నుంచి కొద్దిపాటి గాయాలు మినహా అంతా సురక్షితంగా బయట పడ్డారు.



విమానం విండో ప్యానెల్ ఊడిపోవడంతో ఏర్పడిన భారీ రంధ్రం

నరకం అంచులకు వెళ్లొచ్చాం...

ప్రమాదం జరిగిన తీరును వివరిస్తూ ప్రయాణికుల్లో పలువురు భయోద్వేగాలకు లోనయ్యారు. ''విమానం వెనక వైపు నుంచి పెద్ద శబ్దం విన్పించింది. ఏమిటా తిరిగి చూసేలోపే పెను గాలులు విమానమంతటినీ ఈడ్చి కొట్టడం మొదలైంది'' అని ఎవాన్ స్మిత్ చెప్పాడు. ''నేను పక్క వరుసలో కూర్చుని ఉన్నాను. చూస్తుండగానే నా కళ్లముందే అటు వైపున్న కిటికీతో పాటు దాని చుట్టుపక్కల భాగమంతా ఎవరో బయటి నుంచి లాగేసినట్టుగా ఊడి కొట్టుకుపోయింది. ఆ కిటికీ సీట్లో ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది'' అంటూ జెస్సికా అనే ప్రయాణికురాలు చెప్పుకొచ్చింది. అక్షరాలా నరకం అంచుల దాకా వెళ్లి అదృష్టం కొద్దీ సురక్షితంగా బయట పడ్డామంటూ వణికిపోయింది. ''ఎమర్జెన్సీలో చిక్కుకున్నాం. గాలి పీడనం పూర్తిగా తగ్గిపోయింది. మేం తక్షణం ల్యాండవ్వాలి'' అని గ్రౌండ్ కంట్రోల్‌ను పైలట్ రిక్వెస్ట్ చేస్తున్న ఆడియో క్లిప్ వైరల్‌గా మారింది.


విమానం లోపల సీటు పక్క నుంచి కనిపిస్తున్న రంధ్రం

ఆ విమానాల నిలిపివేత...

ప్రయాణికులకు ఎదురైన భయానక అనుభవాన్ని తలచుకుంటేనే గుండె తరుక్కుపోతోందని అలస్కా ఎయిర్‌లైన్స్ సీఈఓ బెన్ మినికుచి తీవ్ర విచారం వెలిబుచ్చారు. ప్రమాదం నేపథ్యంలో పూర్తిస్థాయి తనిఖీలు, భద్రతా పరీక్షలు జరిగేదాకా తమ వద్ద ఉన్న మొత్తం 65 బోయింగ్ 737 మాక్స్ 9 రకం విమానాలనూ పక్కన పెడుతున్నట్టు ప్రకటించారు. తనిఖీలకు పూర్తిగా సహకరిస్తామని బోయింగ్ సంస్థ ప్రకటించింది. ఈ ఉదంతంపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ విచారణ జరుపుతోంది.

– పోర్ట్‌ల్యాండ్ (అమెరికా)

తొలిసారి కాదు..

బోయింగ్ 737 మాక్స్ రకం విమానాలు ప్రమాదాల బారిన పడటం ఇది తొలిసారేమీ కాదు. 2018, 2019ల్లో ఈ రకానికి చెందిన రెండు విమానాలు కూలిపోయి వాటిలో ఉన్నవారంతా దుర్మరణం పాలయ్యారు. దాంతో ప్రపంచమంతటా ఈ విమానాల వాడకాన్ని ఏడాదిన్నర పాటు నిలిపేశారు. కానీ వాటితో పోలిస్తే తాజా ప్రమాదం చాలా భిన్నమైనదని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1,300కు పైగా బోయింగ్ 737 మాక్స్ రకం విమానాలు వాడకంలో ఉన్నాయి. వీటిలో మాక్స్ 9 అత్యాధునిక విమానాలు. భారత్‌లోనూ ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు 40కి పైగా బోయింగ్ 737 మాక్స్ 8 రకం విమానాలను దేశీయ రూట్లలో నడుపుతున్నాయి. అమెరికా విమాన ప్రమాదం నేపథ్యంలో వాటన్నింట్లనూ తక్షణం క్షుణ్నంగా భద్రతా తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది.

అయిదేళ్ల చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ

- మెలకువ స్థితిలో ఉండగానే విజయవంతంగా పూర్తి
- ప్రపంచంలోనే మొదటిసారిగా ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల ఘనత

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్య నిపుణులు అరుదైన ఘనత సాధించారు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న అయిదేళ్ల బాలికకు విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశారు. అయిదేళ్ల చిన్నారి మెలకువ స్థితిలో ఉండగానే ఇలా ఆపరేషన్ చేయడం ప్రపంచంలోనే మొట్టమొదటిసారని చెప్పారు. ఒకటో తరగతి చదువుకునే అక్షిత అనే అయిదేళ్ల చిన్నారి మూర్ఛలతో బాధపడుతోంది. పరిశీలించిన ఎయిమ్స్ వైద్యులు ఆమెకు ఎంఆర్ఐ స్కాన్ చేయించి మెదడులో మాట/భాషను నియంత్రించే చోట కణితి(ట్యూమర్) ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 4న న్యూరో సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ గుప్తా సారథ్యంలోని న్యూరోసర్జన్ల బృందం శస్త్రచికిత్సకు ఉపక్రమించింది. చిన్నారి మెలకువ స్థితిలోనే ఉంచింది. దీనిద్వారా కణితిలను పూర్తిగా తొలగించేందుకు, నరాల సంబంధిత లోపాలను తగ్గించడానికి తోడ్పడుతుందని డాక్టర్ గుప్తా చెప్పారు. నొప్పి కూడా కనీస స్థాయిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. చిన్నారికి ప్రత్యేక నిపుణులు మత్తు మందు ఇవ్వడం సహా సర్జరీకి ప్రక్రియకు దాదాపు 3 గంటలు పట్టింది. సర్జరీ సమయంలో తాము చూపిన ప్రధాని మోదీ ఫొటోను చిన్నారి గుర్తు పట్టిందన్నారు. శస్త్రచికిత్స ఆసాంతం పూర్తయ్యేదాకా అక్షిత మెలకువ స్థితిలోనే ఉందన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని, సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేస్తామని డాక్టర్ దీపక్ గుప్తా చెప్పారు. మెలకువగా ఉన్న పరిస్థితుల్లో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ చేయించుకున్న ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా అక్షిత పేరు ఉంటుందని డాక్టర్ గుప్తా తెలిపారు.



భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగో విడుదల చేస్తున్న ఖర్గే, కేసీ వేణుగోపాల్

ప్రజాన్యాయం కోసం..

- రాహుల్ యాత్రపై ఖర్గే వ్యాఖ్య
- యాత్ర లోగో విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలను ఎత్తిచూపకుండా ప్రభుత్వం అడ్డుకున్నందుకే ఆ సమస్యలను ప్రజాక్షేత్రంలో ఎలుగెత్తి చాటేందుకు భారత్ జోడో న్యాయ్ యాత్రను మొదలుపెట్టామని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. భారత రాజ్యాంగ పీఠికలో మూల స్తంభాలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పునస్థాపన చేసే దిశగా దేశ ప్రజలకు న్యాయం జరిగేలా భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. యాత్ర దేశంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై దృష్టి సారిస్తుందని వెల్లడించారు. శనివారం ఆయన ఇక్కడి ఏఐసీసీ కార్యాలయంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగో, న్యాయ్ కా హక్ మిల్నే తక్(న్యాయంగా హక్కు దక్కేదాకా)' అనే ట్యాగ్‌లైన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

మహాపురుషుడికి టైమ్ లేదా?

బీచ్‌లలో, నిర్మాణంలో ఉన్న ఆలయాల వద్ద ఫొటో షూట్‌లకు చాలా సమయం వెచ్చిస్తున్న మహాపురుషుడు మోదీకి ఘర్షణలకు నిలయమైన మణిపూర్‌లో పర్యటించడానికి సమయం లేదా అని ఖర్గే ప్రశ్నించారు. ఎంతటి అవినీతిపరులైనా బీజేపీలో చేరితే క్లీన్ చిట్ పొంది స్వచ్ఛమైన నేతలవుతారంటూ ఎద్దేవా చేశారు. రాజ్యాంగంపై ప్రధానికి నమ్మకం లేదని, ఆర్ఎస్ఎస్ భావజాలమైన 'నాగ్‌పూర్' రాజ్యాంగాన్నే పాటిస్తారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి కన్వీనర్ తదితర పదవులపై 15 రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

లగ్రాంజ్ పాయింట్‌లోకి ఆదిత్య

ప్రశంసలు కురిపించిన రాష్ట్రపతి, ప్రధాని

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యునిపై సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్ తదితర విషయాలను అధ్యయనం చేసేందుకు ఇస్రో గత ఏడాది ప్రయోగించిన సోలార్ అబ్జర్వేటరీ వ్యోమనౌక ఆదిత్య ఎల్1 ఎట్టకేలకు తన తుది కక్ష్యలోకి చేరుకుంది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు వ్యోమనౌక తన గమ్యస్థానాన్ని చేరుకోవడంతో ఇస్రో తన అంతరిక్ష ప్రయోగాల్లో మరో మైలురాయిని దాటింది. భూమి నుంచి సూర్యునివైపుగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని కక్ష్య(ఎల్1 పాయింట్)లోకి శనివారం ఆదిత్య వ్యోమనౌక చేరుకుందని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. గ్రహణాల వంటి సందర్భాల్లోనూ ఎలాంటి అడ్డులేకుండా నిరంతరంగా సూర్యుడిని చూసేలా అనువైన ఎల్1 పాయింట్‌లో ఉంటూ ఆదిత్య ఎల్1 అధ్యయనం చేయనుంది. చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్–3 సాఫ్ట్‌ల్యాండింగ్ విజయవంతమైన కొద్దినెలలకే సూర్యుడి సంబంధ ప్రయోగంలోనూ భారత్ ఘన విజయం సాధించడం విశేషం. భూమికి సూర్యునికి మధ్య దూరం 15 కోట్ల కిలోమీటర్లుకాగా అందులో ఒక శాతం అంటే 15 లక్షల కిలోమీటర్ల దూరాన్ని లగ్రాంజ్ పాయింట్(ఎల్1)గా గణిస్తున్నారు. ఈ పాయింట్ ఉన్న హాలో కక్ష్యలో వ్యోమనౌక ఉంటే సూర్యగ్రహణం వంటి సందర్భాల్లోనూ నిరంతరంగా శూన్యంలో అంతరిక్ష వాతావరణంలో సూర్య సంబంధ శోధన చేసే సువర్ణావకాశం చిక్కుతుంది.

మూన్‌వాక్ నుంచి సన్‌డ్యాన్స్ దాకా..

'' భారత్ మరో మైలురాయిని చేరుకుంది. భారత తొలి సోలార్ అబ్జర్వేటరీ తన కక్ష్యను చేరుకుంది. సంక్లిష్టమైన అంతరిక్ష ప్రయోగాలను సఫలం చేస్తూ మన శాస్త్రవేత్తలు అంకితభావానికి ఈ సంఘటనే చక్కని తార్కాణం. వీరి అసాధారణ ప్రతిభకు దేశం గర్విస్తోంది. మానవాళి సంక్షేమం కోసం నూతన శాస్త్రీయ పరిశోధనలు ఇకమీదటా ఇలాగే కొనసాగాలి'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ట్వీట్ చేశారు. ''ఇస్రో మరో ఘనత సాధించింది. ఈ మిషన్‌తో యావత్ మానవాళికి ఎంతో మేలు చేకూరుతుంది. ఈ మిషన్‌తో సూర్యుడు–భూమి మధ్య మనకున్న జ్ఞానాన్ని మరింత పెంచుతుంది. గొప్ప విజయం సాధించిన భారత శాస్త్రవేత్తలకు నా అభినందనలు'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇస్రో శాస్త్రవేత్తలను ప్రశంసించారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ సైతం ఆనందం వ్యక్తంచేశారు. ''మూన్ వాక్ నుంచి సన్ డ్యాన్స్ వరకు..!. భారత్‌కు ఎంతటి ఉజ్వల సంవత్సరమిది'' అని ట్వీట్‌చేశారు. '' అంతరిక్షంలోనూ భారత జైత్రయాత్ర కొనసాగుతోంది' అని హోం మంత్రి అమిత్ షా ట్వీట్‌చేశారు.



- గత ఏడాది సెప్టెంబర్ రెండో తేదీన ఆదిత్యను మోస్తూ పీఎస్ఎల్‌వీ–సీ57 రాకెట్ శ్రీహరికోట ప్రయోగ కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది.
- దాదాపు 63 నిమిషాల తర్వాత 235 X 19,500 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. తర్వాత దాని కక్ష్యలను ఇస్రో పలుమార్లు మార్చుతూ చివరకు శనివారం తుదికక్ష్యలోకి చేర్చింది.
- దీని బరువు దాదాపు 1500 కేజీలు. విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్, సోలార్ అల్ట్రావాయిలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్ లో ఎనర్జీ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్–1 ఆర్బిటింగ్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, మ్యాగ్నెటోమీటర్ అనే పేలోడ్‌లను ఈ ఉపగ్రహంలో అమర్చారు.

అమెరికా రక్షణ మంత్రికి అనారోగ్యం

వాషింగ్టన్: అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్(70) అనారోగ్యంతో గత సోమవారం నుంచి విధులకు దూరంగా ఉన్నట్లు సమాచారం. ఆయన వాల్టర్ రీడ్ నేషనల్ మిలటరీ మెడికల్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నట్లు పెంటగాన్ తెలిపింది. స్వల్ప శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం సమస్యలు తలెత్తడంతో సోమవారం ఆయన్ను మెడికల్ సెంటర్‌లో చేర్పించినట్లు పెంటగాన్ ప్రతినిధి ఎయిర్ ఫోర్స్ మేజర్ జనరల్ ప్యాట్ రైడర్ శుక్రవారం(స్థానిక కాలమానం ప్రకారం) చెప్పారు. ఆయన కోలుకుంటున్నారని, ఈ రోజే ఆయన విధుల్లో చేరే అవకాశాలున్నాయని తెలిపారు. వ్యక్తిగత గోప్యత, వైద్యపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఆస్టిన్ ఆస్పత్రిలో చేరిన విషయాన్ని బయటకు వెల్లడించలేదని తెలిపారు. అవసరమైన పక్షంలో సహాయ మంత్రి కాథ్లీన్ హిక్స్ ఆయన స్థానంలో బాధ్యతలు కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు.

నడుస్తున్న రైలులో చలి మంట

అలీగఢ్: చలి తీవ్రతను తాళలేక కొందరు ప్రయాణికులు నడుస్తున్న రైలు బోగీలోనే చలి మంట వేశారు. గేట్ మ్యాన్ అప్రమత్తం చేయడంతో భద్రతా సిబ్బంది రైలును ఆపి, మంటలను ఆర్పి వేశారు. ఈ ఘటన అస్సాం నుంచి న్యూఢిల్లీ వైపు వస్తున్న సంపర్క్ క్రాంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ నెల 3వ తేదీ రాత్రి చోటుచేసుకుంది. రైలు బర్హాన్ రైల్వే స్టేషన్ దాటున్న సమయంలో గేట్‌మ్యాన్ ఓ బోగీ నుంచి మంటలు, పొగ వస్తున్నట్లు గమనించి, పై అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు ఆ రైలును తర్వాతి చమ్రౌలా స్టేషన్‌లో ఆపు చేయించారు. జనరల్ బోగీలో పిడకలతో మంట వేసుకుని, చలి కాగుతున్న 16 మందిని గుర్తించారు. వెంటనే మంటలను ఆర్పి వేసి, పెను ప్రమాదాన్ని నివారించారు. రైలు అలీగఢ్ స్టేషన్‌లో ఆగిన సమయంలో ఆ 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఫరీదాబాద్‌కు చెందిన చందన్, దేవేంద్రలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తీవ్రంగా ఉన్న చలిని తట్టుకోలేకనే చలిమంట వేసినట్లు వారు తెలిపారు. మిగతా 14 మంది సహ ప్రయాణికులను హెచ్చరించి వదిలేశారు.

కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న ఎమ్మెల్యే

పుణె: మహారాష్ట్రకు చెందిన బీజేపీ శాసనసభ్యుడు సునిల్ కాంబ్లే విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నారు. శుక్రవారం పుణె కంటోన్మెంట్‌లోని ససూన్ జనరల్ ఆస్పత్రిలో ఓ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ఎమ్మెల్యే సునిల్ కాంబ్లే హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మెట్లు దిగి వస్తున్న ఎమ్మెల్యే కాంబ్లేకి కానిస్టేబుల్ ఎదురయ్యారు. దీంతో, ఎమ్మెల్యే ఆగ్రహంతో కానిస్టేబుల్ చెంప చెల్లుమనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. శనివారం బాధిత కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై ఐపీసీ సెక్షన్ 353 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే కాంబ్లే ఘటనపై స్పందిస్తూ.. నేను ఎవరిపైనా దాడి చేయలేదు. మెట్లుదిగి వస్తుండగా అడ్డుగా వచ్చిన ఒక వ్యక్తిని పక్కకు తోసేసి, ముందుకు వెళ్లానంతే'అని చెప్పారు.

ఇజ్రాయెల్‌పైకి హెజ్బొల్లా రాకెట్లు

బీరుట్: లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్లు శనివారం ఇజ్రాయెల్‌పైకి పదుల సంఖ్యలో రాకెట్లను ప్రయోగించారు. బీరుట్‌లో ఉన్న హమాస్ అగ్ర నేత సలెహ్ అరోరీని చంపినందుకు ప్రతీకారం తప్పదంటూ శుక్రవారం హెజ్బొల్లా నేత సయ్యద్ హస్సన్ నస్రల్లా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే శనివారం 62 రాకెట్లను ఇజ్రాయెల్‌లోని మౌంట్ మెరోన్‌లో ఉన్న గగనతల నిఘా కేంద్రంపైకి ప్రయోగించినట్లు హెజ్బొల్లా తెలిపింది. ఇవి ఆ కేంద్రాన్ని నేరుగా తాకాయని పేర్కొంది. మెరోన్ వైపు 40 రాకెట్లు దూసుకొచ్చినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. అయితే, నష్టం గురించి ప్రస్తావించలేదు. ఇలా ఉండగా, 24 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ ఆర్మీ గాజాపై జరిపిన దాడుల్లో 122 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో, ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు చనిపోయిన వారి సంఖ్య 22,722కు చేరుకుందని పేర్కొంది. మృతుల్లో మూడింట రెండొంతుల మంది చిన్నారులు, మహిళలేనని వెల్లడించింది. మరో 58,166 మంది క్షతగాత్రులుగా మిగిలారని పేర్కొంది.

టీఎంసీ నేత కోసం లుకౌట్ నోటీస్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌కు చెందిన టీఎంసీ నేత షాజహాన్ షేక్ ఆచూకీ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)శనివారం లుకౌట్ నోటీస్ జారీ చేసింది. రేషన్ పంపిణీ కుంభకోణానికి సంబంధించి దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఉత్తర 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖలిలో షాజహాన్ షేక్ ఇంట్లో సోదాలు జరుపుతున్న ఈడీ బృందంపై అతడి అనుచరులు దాడికి దిగిన విషయం తెలిసిందే. ఘటనలో ముగ్గురు అధికారులు గాయపడ్డారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి జాడ తెలియకుండా పోయిన షాజహాన్ షేక్ బహుశా దేశం విడిచి వెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. అతడి గురించి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాలకు సమాచారం ఇచ్చినట్లు ఈడీ అధికారి ఒకరు పీటీఐకి చెప్పారు.

జమిలి ఎన్నికలపై సూచనలివ్వండి

ప్రజలను కోరిన కోవింద్ కమిటీ

న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి సూచనలివ్వాలంటూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' కమిటీ ప్రజలను కోరింది. దేశంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరపడానికి చట్ట పరమైన పరిపాలనా ఫ్రేమ్‌వర్క్‌లో చేపట్టాల్సిన మార్పులను తెలపాలని పిలుపునిచ్చింది. జనవరి 15వ తేదీలోగా అందిన సూచనలను పరిశీలనకు పరిగణిస్తామని ఒక నోటీసులో తెలిపింది. సూచనలను onoe.gov.in వెబ్‌సైట్‌లో పోస్టు చేయాలని సూచించింది. లేదా sc&hlc@gov.inకి మెయిల్ చేయవచ్చని వివరించింది. ఈ నోటీసును ఆరు జాతీయ పార్టీలకు, 33 రాష్ట్ర పార్టీలు, ఏడు గుర్తింపు పొందని రిజిస్టర్డ్ పార్టీలకు పంపినట్లు తెలిపింది. ఇదే అంశంపై లా కమిషన్ అభిప్రాయాలు కూడా తెలుసుకుంటామంది.

హిందూ కార్యకర్త పూజారికి బెయిల్

హుబ్బళ్లి: మూడు దశాబ్దాల క్రితం నాటి రామాలయ ఉద్యమ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న హిందూ కార్యకర్త శ్రీకాంత్ పూజారి శనివారం బెయిల్‌పై విడుదలయ్యాడు. పెండింగ్ కేసులను పరిష్కరిస్తున్న క్రమంలో 2023 డిసెంబర్‌లో పూజారి కేసు బయటకు వచ్చింది. 1992లో రామాలయం ఉద్యమంలో పాలుపంచుకున్న అతడిపై అక్రమ మద్యం విక్రయం తదితర 16 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. రెండు పోలీస్ స్టేషన్లలో అతడిపై రౌడీషీట్ కూడా ఉంది. పోలీసులు తనను మార్కెట్‌కు వెళదామంటూ తీసుకొచ్చి, కటకటాల వెనుక పడేసినట్లు పూజారి ఆరోపించాడు. తనపై ఎటువంటి కేసులు లేవన్నాడు. బెయిల్‌పై తన విడుదలకు సహకరించిన హిందూ సంస్థలకు రుణపడి ఉంటానని అన్నాడు. రామాలయం కోసం పోరాడిన తను తిరిగి అయోధ్యకే వెళతానని చెప్పాడు.

జైల్లోనే చావాలనుంది!

వ్యాధులు బాధిస్తున్నాయి: 'జెట్ ఎయిర్‌వేస్' గోయల్ ఆవేదన

నా భార్యను క్యాన్సర్ తినేస్తోంది • ఆమెను మిస్సవుతున్నా
బతుకుపై ఆశలు అడుగంటాయి • కోర్టు హాల్లో భావోద్వేగం



ముంబై: ''నాలో బతకాలన్న ఆశలన్నీ పూర్తిగా అడుగంటాయి. క్యాన్సర్ ముదిరి నా భార్య అనిత మంచాన పడింది. ఆమెను ఎంతగానో మిస్సవుతున్నా. నా ఒక్కగానొక్క కూతురుకూ ఒంట్లో బాగుండటం లేదు. నా ఆరోగ్యం కూడా పూర్తిగా దిగజారింది. మోకాళ్ల మొదలుకుని మూత్ర సంబంధిత వ్యాధుల దాకా తీవ్రంగా వేధిస్తున్నాయి. ఒళ్లంతా స్వాధీనం తప్పి వణుకుతోంది. నొప్పుల బాధను తట్టుకోలేకపోతున్నా. ఇలాంటి పరిస్థితుల్లో దైన్యంగా బతుకీడ్చడం కంటే జైల్లోనే చనిపోతే బాగుండనిపిస్తోంది'' అంటూ జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ (74) భావోద్వేగానికి లోనయ్యారు. రూ.538 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసులో నిందితుడైన ఆయనను ఈడీ గత సెప్టెంబర్ 1న అరెస్టు చేసింది. నాటి నుంచీ జైల్లో ఉన్న ఆయన శనివారం ముంబై ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరయ్యారు. కాసేపు వ్యక్తిగతంగా విచారించాలని కోరగా జడ్జి అనుమతించారు. ఈ సందర్భంగా చేతులు జోడించి తన దైన్యం గురించి చెప్పుకుంటూ కంటతడి పెట్టారు. మాట్లాడుతున్నంత సేపూ గోయల్ వణుకుతూనే ఉన్నారని జడ్జి తెలిపారు. ఆయన గత డిసెంబర్‌లో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.


ద్వారకాధీశ్ ఆలయంలో పూజలు చేస్తున్న జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు

టెక్నాలజీతో న్యాయం మరింత చేరువ: సీజేఐ

రాజ్‌కోట్: ఆధునిక సాంకేతికత సాయంతో న్యాయాన్ని అందరికీ ప్రజాస్వామ్యయుతంగా చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడించారు. శనివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నూతన జిల్లా కోర్టు భవనాన్ని ఆయన ప్రారంభించారు. కృత్రిమ మేధతో పని చేసే టెక్స్ టు స్పీచ్ 'కాల్–బాట్' సిస్టమ్‌ను, ఈ–ఫైలింగ్ 3.0 ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. జిల్లా కోర్టుల ఆవశ్యకతను ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. న్యాయం కోసం ముందుగా అక్కడికే వస్తారని గుర్తు చేశారు. పౌరుల హక్కుల సాధనకు జిల్లా కోర్టులే పునాదిరాళ్లన్నారు. ''ద్వారకలోని సోమ్‌నాథ్ ఆలయం, పూరీలోని జగన్నాథాలయంపై ఉండే ధ్వజం న్యాయవాదులు, న్యాయమూర్తులు, పౌరులందరినీ కలిపి ఉంచే మానవత్వానికి ప్రతీక. అలాంటి మానవత్వానికి రాజ్యాంగమే రక్ష'' అని సీజేఐ వ్యాఖ్యానించారు.

బంగ్లాదేశ్‌లో నేడు ఎన్నికలు


ప్రధాని హసీనా నాలుగోసారి ఎన్నికయ్యేందుకు అవకాశం

ఢాకా: పొరుగు దేశం బంగ్లాదేశ్ నేడు జరిగే సాధారణ ఎన్నికలకు సిద్ధమైంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించాలంటూ 48 గంటల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 300 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. 436 మంది స్వతంత్రులు సహా 27 రాజకీయ పార్టీలకు చెందిన 1,500 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సుమారు 11.96 కోట్ల మంది ఓటర్లు 42 వేల పోలింగ్ స్టేషన్లలో ఓటు వేయనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగుతుంది. భారత్‌కు చెందిన ముగ్గురు సహా వంద మందికి పైగా విదేశీ పరిశీలకులు పోలింగ్ నిర్వహణ తీరును పరిశీలిస్తారు. ఈ నెల 8వ తేదీన ఫలితాలు వెల్లడవుతాయని భావిస్తున్నారు. అవామీ లీగ్ చీఫ్ అయిన ప్రధాన మంత్రి షేక్ హసీనా వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు. మాజీ ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నేత ఖలీదా జియా అవినీతి ఆరోపణలపై జైలులో ఉన్నారు. ఆ పార్టీ ఈ ఆదివారం జరిగే ఎన్నికలను బహిష్కరించాలంటూ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. బీఎన్‌పీ కార్యకర్తలు నాలుగు పోలింగ్ బూత్‌లపై బాంబు దాడులకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఢాకాలో రైలుకు దుండగులు నిప్పుపెట్టడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

బిల్కిస్ బానో కేసు.. రేపు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబంలోని ఏడుగురి దారుణహత్య ఘటనల్లో దోషులకు శిక్ష తగ్గింపును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు సోమవారం వెలువరించనుంది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం పిటిషన్లపై 11 రోజులపాటు వాదనలను వింది. తీర్పును రిజర్వులో ఉంచుతున్నట్లు గత ఏడాది అక్టోబర్ 12న ప్రకటించింది. అక్టోబర్ 16వ తేదీ కల్లా శిక్ష తగ్గింపు నిర్ణయానికి సంబంధించిన ఫైళ్లను తమ ముందు ఉంచాలని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలను ఆదేశించింది. బిల్కిస్ బానో కేసులో మొత్తం 11 మంది దోషులకు శిక్షను తగ్గించి, 2022 ఆగస్టు 15న గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

కోవిడ్ కొత్త కేసులు 774



న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 774 కోవిడ్ కేసులు నమోదైనట్లు కేంద్రం తెలిపింది. అదే సమయంలో, యాక్టివ్ కేసుల సంఖ్య 4,187గా ఉందని తెలిపింది. ఒక్క రోజు వ్యవధిలో తమిళనాడు, గుజరాత్‌లలో ఒక్కరేసి చొప్పున బాధితులు చనిపోయారని పేర్కొంది. శీతల వాతావరణం, కోవిడ్–19 వేరియంట్ జేఎన్.1 వ్యాప్తి కారణంగా కేసులు వేగంగా పెరుగుదల నమోదవుతోందని తెలిపింది.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 7 । జనవరి । 2024

నేడు జస్టిస్ వేణుగోపాల్ రాక

కరీంనగర్ క్రైం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్ ఆదివారం కరీంనగర్ రానున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు స్థానిక మంకమ్మతోటలోని తన స్వగృహానికి చేరుకోనున్నారు. సాయంత్రం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ బైపాస్ రోడ్డులో గల టీవీ గార్డెన్‌లో విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం రాత్రి హైదరాబాద్ వెళ్లనున్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): ఆదివారం ఉదయం 10 గంటల–మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టర్ కాంప్లెక్స్, ప్రతిమ మల్టీప్లెక్స్, బస్టాండ్, ఎల్ఐసీ ఆఫీస్, వన్‌టౌన్ ఠాణా, సిక్‌వాడీ, మార్వాడీ దేవాలయం, కలెక్టర్ కాంప్లెక్స్ ముందు భాగం, ట్రినిటి బాలికల కళాశాల, ఆంధ్రాబ్యాంక్ జోనల్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
30.2/16.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.



-10లో▸

మన పబ్లిక్ సర్వెంట్

ఎలాగైనా ఐఏఎస్ కావాలని అనుకున్నారు.. కష్టపడి, లక్ష్యాన్ని సాధించారు. ఐఏఎస్‌గా మధ్యప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తూ సొంత రాష్ట్రం తెలంగాణలో సమాజసేవ చేస్తున్నారు. ఆయనే సీనియర్ ఐఏఎస్ అధికారి, బసంత్‌నగర్‌కు చెందిన పరికిపండ్ల నరహరి.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

టీచర్లే బోధనేతరులు

- రికార్డు అసిస్టెంట్లుగా మారిన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతా వారిపైనే..
- తొలిమెట్టు, ఉన్నతి, ఎఫ్ఆర్ఎస్‌ఏలతో ఇబ్బందులు
- మధ్యాహ్న భోజనం, పరీక్షలు, హాజరు నమోదు నివేదికలతో సతమతం
- విద్యాబోధనకు దొరకని సమయం



‘పాఠశాలల్లో విద్యాబోధన చేయాల్సిన టీచర్లు రికార్డు అసిస్టెంట్లుగా మారుతున్నారు. చదువు చెప్పడం కన్నా బోధనేతర పనులకే అంకితమవుతున్నారు. మధ్యాహ్న భోజనం లెక్కల దగ్గరి నుంచి విద్యార్థి సామర్థ్యం దాకా పలు రికార్డులు రాయడంతోపాటు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను మోస్తున్నారు. సమయమంతా ఇలాంటి పనులకే పోతోంది. విద్యార్థులకు చదువు చెప్పేందుకే సమయం దొరకని పరిస్థితి నెలకొంటోంది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన సర్కారు టీఆర్‌టీ నియమాకాలు చేపట్టకుండా, బదిలీలు, పదోన్నతులు నిర్వహించకుండా, పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయకుండా బోధనేతర పనులకే ఉపాధ్యాయులను అంకితం చేస్తోందని విద్యాభిమానులు మండిపడుతున్నారు.’

కరీంనగర్: పాఠశాల సమయంలో.. ఏ టీచర్‌నైనా ఏం చేస్తున్నారు? అని అడిగితే వారి నుంచి మొదటగా ‘రికార్డులు రాస్తున్నా’ అనే సమాధానమే వస్తోంది. క్లాసులో ఉన్నాననో, పాఠాలు చెబుతున్నాననో చెప్పాల్సిన ఉపాధ్యాయులు రికార్డులతో వేగలేక, విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు సమయం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీసీఈ విధానం, తొలిమెట్టు, ఉన్నతి, ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్‌ఏ), మన ఊరు–మన బడి లాంటి కార్యక్రమాలు వారికి తలకు మించిన భారంగా మారాయి. దీనికితోడు మూడేళ్ల క్రితం స్కావెంజర్లు, స్వీపర్లను తొలగించడంతో పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

సుమారు 20 రికార్డులు..

ప్రభుత్వ బడుల్లో రికార్డుల నమోదుకు రికార్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆ బాధ్యతను ఉపాధ్యాయులే మోయాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం లెక్కలు, పరీక్షల మార్కులు, విద్యార్థుల హాజరు, సామర్థ్యాలు ఇలా అనేక అంశాలపై ఎప్పటికప్పుడు నివేదిక తయారు చేయాలి. వాటిని ప్రతినెలా ఉన్నతాధికారులకు పంపించాలి. ఇలా ప్రతీ స్కూల్లో సుమారు 20 వరకు రికార్డులు రాయాల్సి ఉంటుంది. అలాగే, తమ క్లాసులోని విద్యార్థులకు సంబంధించిన, సబ్జెక్టుల వారీగా కూడా వివరాలు నమోదు చేయాలి.

రెండు, మూడు పీరియడ్‌లు వాటికే..

పాఠశాలలో ప్రతిరోజూ 8 పీరియడ్‌లు ఉంటుండగా .. కనీసం 2, 3 పీరియడ్‌ల సమయం రికార్డుల నమోదుకే పోతోంది. మిగిలిన వాటిలో రెండు లేదా మూడు కంప్యూటర్ క్లాసులకు, కల్చరల్, ఇతర క్లాసులకు పోతాయి. దీంతో విద్యార్థులకు పాఠాలు ఎప్పుడు చెప్పేదని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇవి చాలవన్నట్లు ఊరిలో ఆరోగ్య టీకాలు, స్వచ్ఛత వంటి కార్యక్రమాలకు ర్యాలీలు తీయడంతోపాటు దగ్గరుండి వాటిని పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, జిల్లాస్థాయిలో నిర్వహించే సమావేశాలకు, శిక్షణ తరగతులకు టీచర్లు హాజరు కావాల్సి ఉంటుందని, ఇలా బోధనేతర కార్యక్రమాలు ఎక్కువ కావడంతో విద్యార్థులకు నష్టం జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డీఈవోల పదోన్నతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న సీనియర్ హెచ్ఎంలకే అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రెండు బాధ్యతలను నిర్వర్తించలేక వారు కూడా ఇబ్బంది పడుతున్నారు.

సమయం వృథా, ఒత్తిడి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్, ఎఫ్ఆర్ఎస్‌ఏ లాంటి కార్యక్రమాలతో సమయం వృథాతోపాటు టీచర్లపై ఒత్తిడి పెరుగుతోంది. సిలబస్ పూర్తవట్లేదు. ఒక పాఠ్యాంశానికి ఒక టీచింగ్ పీరియడ్, ఒక ప్రాక్టీసు పీరియడ్ కేటాయించడం వల్ల రెట్టింపు పీరియడ్‌లవుతున్నాయి. ప్రతినెలా ఒక మదింపు పరీక్ష నిర్వహించడం కత్తిమీద సాములా తయారైంది.

– కట్టా రాజేశ్వర్, తపస్ జిల్లా అధ్యక్షుడు

బోధనేతర పనులొద్దు



రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం టీచర్లను నియమించాలి. బోధనేతర పనుల నుంచి మినహాయించి, విద్యావ్యవస్థ పటిష్టతకు ఉపాధ్యాయులను ఉపయోగించుకోవాలి. సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలి.

– కరివేద మహిపాల్‌రెడ్డి, ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

3.12 లక్షల నివాసాలు.. | 3.54 లక్షల దరఖాస్తులు



మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలో చివరి రోజు అర్జీలు ఇచ్చేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

- వీటిలో ఆరు గ్యారంటీలకు వచ్చినవి 3.22 లక్షలు
- ముగిసిన ప్రజాపాలన
- జిల్లాలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

కరీంనగర్ అర్బన్: జిల్లాలో ఉన్న నివాసాల సంఖ్య కన్నా ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులే ఎక్కువ. అధికారిక లెక్కల ప్రకారం.. నివాసాల సంఖ్య 3,12,186 కాగా, వచ్చిన అర్జీలు 3,54,363. అంటే ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకోవడమే కాకుండా కొత్తగా పెళ్లయిన జంటలు ప్రజాపాలనను ఆశ్రయించాయి. గత నెల 28 నుంచి అర్జీల స్వీకరణ ప్రారంభం కాగా శనివారంతో ముగిసింది. చివరి రోజు 9 గ్రామాలు, 9 వార్డుల్లో సభలు నిర్వహించగా ఆరు గ్యారంటీలకు సంబంధించి 34,881 అర్జీలు రాగా, ఇతరాలకు 5,616 వచ్చాయి. మొత్తంగా 8 రోజుల్లో 3,54,363 దరఖాస్తులు స్వీకరించగా వీటిలో ఆరు గ్యారంటీలకు సంబంధించినవి 3,22,264 ఉన్నాయి. అర్జీదారుల వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ శుక్రవారమే ప్రారంభమైంది. ఈ ప్రక్రియ త్వరగా ముగించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

313 గ్రామాలు.. 5 మున్సిపాలిటీలు

జిల్లాలో 313 గ్రామాలు, 5 మున్సిపాలిటీలు ఉన్నాయి. చాలా కాలంగా రేషన్‌కార్డుల దరఖాస్తులు స్వీకరించలేదు. గత నాలుగేళ్లలో కుటుంబాల సంఖ్య 32,099 చేరిందని అధికారిక గణాంకాలు చాటుతున్నాయి. చిగురుమామిడి మండలంలో 13,226 నివాసాలుండగా 14,046 అర్జీలు వచ్చాయి. చొప్పదండిలో 9,743కు 11,866, ఇల్లందకుంటలో 8,374కు 10,849, గంగాధరలో 12,794కు 17,260, గన్నేరువరంలో 5,972కు 7,658, హుజూరాబాద్‌లో 11,500కు 14,380, జమ్మికుంటలో 9,064కు 11,392, కరీంనగర్ రూరల్‌లో 14,875కు 14807, కొత్తపల్లిలో 11,431కి 11,270, మానకొండూర్‌లో 16,289కి 22,573, రామడుగులో 12,237కు 16,459, శంకరపట్నంలో 11,064కు 15,124, తిమ్మాపూర్‌లో 10,685కు 14,565, సైదాపూర్‌లో 13,028కి 14,329, వీణవంకలో 14,697కు 17,628 దరఖాస్తులు వచ్చాయి. కొత్తపల్లి మున్సిపాలిటీలో 4,015 నివాసాలకు గాను 3,715 అర్జీలు, చొప్పదండిలో 5,293కు 5,302, హుజూరాబాద్‌లో 9,868కి 9823, జమ్మికుంటలో 14,914కు 11,616, కరీంనగర్‌లో 1,03,117కు 77,602 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో ఆరు గ్యారంటీలకు కాకుండా ఇతరాలకు 6,068 అర్జీలు వచ్చాయి.

రేషన్ కార్డు లేనివారికీ అవకాశం

రేషన్ కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీరి కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

17లోగా ఆన్‌లైన్

ప్రజాపాలన దరఖాస్తుల్లోని వివరాలను తప్పుల్లేకుండా ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ప్రత్యేక బృందాలను నియమించారు. ఆపరేటర్లకు లక్ష్యాలను విధించారు. ఒక్కొక్కరు రోజుకు 750 అర్జీలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. మండలాల వారీగా ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పని చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



-8లో▸

కరీంనగర్ పద్మనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి అట్టహాసంగా సాగింది. విద్యార్థులు కళ్లు చెదిరే నృత్యాలు, పాటలు, నాటికలతో సందడి చేశారు. ఓ విద్యార్థిని తన అభినయంతో ఆకట్టుకుంది.

– కొత్తపల్లి(కరీంగనర్)



-8లో▸

గాజులే జీవనం..

ఎములాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులే ఆధారంగా పలు కుటుంబాలు బతుకుతున్నాయి. ఈ కోవకు చెందిన వారే గాజులు అమ్మే మహిళలు. అనాదిగా వేములవాడలో దాదాపు 50 మంది గాజులు విక్రయిస్తున్నారు.

– వేములవాడ అర్బన్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- లంబాడిపల్లిలో నూతన జీపీ భవనం ప్రారంభం

చిగురుమామిడి: పల్లెల్లో సమస్యలు పరిష్కారమైతేనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లిలో ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన జీపీ భవనాన్ని శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాక చాలా మంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయని, తమ ప్రభుత్వంలో అలా జరగదని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తాను ఒక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సాగు, తాగునీటి ఇతర సౌకర్యాలకు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, ఎంపీడీవో నర్సయ్య, తహసీల్దార్ నరేందర్, సర్పంచ్ వకుళ, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, డీఈఈలు రవిప్రసాద్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల వినతి..

చిగురుమామిడి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రెండో ఏఎన్ఎంలు తమను పర్మనెంట్ చేయడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి పొన్నంకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పీఆర్‌టీయూ–2024 క్యాలెండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆవిష్కరించారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు లింగారెడ్డి, రాష్ట్ర బాధ్యులు దుబ్బాక బాల్‌రెడ్డి, బుక్క సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ వీఆర్‌ఏల నిరీక్షణకు తెర

- గుర్తింపు కార్డుల జారీకి ప్రభుత్వం ఆదేశం
- ట్రెజరీకి చేరిన పెండింగ్ వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో 2,147 మందికి పదోన్నతి
- 61 ఏళ్లు దాటినవారి విషయంలో రాని స్పష్టత

కరీంనగర్ అర్బన్: వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్‌ఏల నిరీక్షణకు తెర పడింది. గుర్తింపు కార్డులు, జీతాలు లేక అధికారులు, పాలకుల చుట్టూ తిరగగా తాజా ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఐడీ కార్డులతోపాటు ఆయా శాఖల ద్వారా వేతనాలు చెల్లించాలని ఆదేశించింది. ఇప్పటికే ఐడీ కార్డుల జారీ చేపడుతుండగా వారం రోజుల్లో ప్రక్రియ పూర్తవనుంది. వేతనాలు ట్రెజరీకి చేరగా త్వరలో ఉద్యోగుల ఖాతాలో జమ కానున్నాయి.

తాత్కాలిక రిజిస్టర్‌లోనే సంతకాలు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2,147 మంది వీఆర్‌ఏలకు పదోన్నతి ఇచ్చి, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల్లో జూనియర్, రికార్డు అసిస్టెంట్లుగా సర్దుబాటు చేయగా కొందరిని ఇతర జిల్లాలకు పంపించారు. వీరు కరీంనగర్ జిల్లాలో 658, జగిత్యాల జిల్లాలో 592, పెద్దపల్లి జిల్లాలో 512, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 345 మంది ఉన్నారు. ఇది జరిగి 5 నెలలు గడుస్తోంది. అయినప్పటికీ వీరు పని చేసే ఆయా కార్యాలయాల్లో తాత్కాలిక రిజిస్టర్‌లోనే సంతకాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఎంప్లాయి ఐడీలు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పూర్వ వీఆర్‌ఏలు తమ దరఖాస్తులను మండలాల వారీగా ఇస్తున్నారు. ట్రెజరీ అధికారులు ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు.

ఆయా శాఖల నుంచే వేతనాలు

వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొందరిని వివిధ శాఖలకు బదిలీ చేయగా, మరికొందరికి రెవెన్యూ శాఖలోనే విధులు అప్పగించింది. గతేడాది ఆగస్టులో వీరిని క్రమబద్ధీకరించగా.. అప్పటి నుంచి వేతనాల ఇవ్వడం లేదు. దీంతో తమ జీవితం దుర్భరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వ వీఆర్‌ఏలకు వేతనాలు చెల్లించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల్లో పని చేస్తున్నవారికి ఉపశమనం కలిగింది. జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న పూర్వ వీఆర్‌ఏలకు రూ.24,280, రికార్డ్ అసిస్టెంట్లుగా చేస్తున్నవారికి రూ.22,150, సబార్డినేట్లుగా ఉన్నవారికి రూ.19 వేల చొప్పున జీతాలు ఖరారు చేశారు. కానీ, 5 నెలలుగా అందకపోవడంతో ధర్నాలు చేపట్టారు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆలస్యమైంది. తాజాగా వారి వినతికి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏ శాఖలో పని చేస్తున్న వారికి ఆ శాఖ నుంచే వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు.



ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

61 ఏళ్లు దాటినవారు 400 మందికి పైనే

61 ఏళ్లు పైబడిన పూర్వ వీఆర్‌ఏల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వీరు ఉమ్మడి జిల్లాలో 400 మందికి పైగా ఉండగా కొందరు మరణించారు. ఇంకొందరు మంచంపట్టారు. ఈ నేపథ్యంలో వారి వారసులు విధులు నిర్వహించగా గత ప్రభుత్వం వారసులకు ఉద్యోగాలను ఇస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటివరకు దీనిపై ప్రకటన లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

వేతనాలు జమ చేయాలి



మేము 5 నెలలుగా దుర్భర జీవితం గడుపుతున్నాం. అప్పులు చేసి, కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగమని సంతోషపడితే నెలల తరబడి జీతం లేకుంటే బతికేదెలా? ప్రభుత్వం వేతనాలను త్వరగా జమ చేయాలి.

– నలువాల సాయికిశోర్, వార్డు ఆఫీసర్, కొత్తపల్లి

లైన్ బ్రేకప్‌పై దృష్టి పెట్టండి

- నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలి
- కష్టపడే ఉద్యోగికి అందలం.. పనిచేయని వారికి పనిష్‌మెంట్
- టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
- తొలిసారి కరీంనగర్ సర్కిల్ ఆఫీసు సందర్శన



స్టోర్స్ నిర్వహణపై సూచనలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, లైన్ బ్రేకప్‌పై దృష్టి పెట్టి.. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. సంస్థను కాపాడుకునేందుకు ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలన్నారు. కష్టపడ్డ ఉద్యోగిని అందలమెక్కిస్తామని.. పనిచేయని వారికి పనిష్మెంట్ తప్పదని హెచ్చరించారు. నూతన టెక్నాలజీని వాడుకుంటూ విద్యుత్ బిల్లుల చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. సీఎండీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి కరీంనగర్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సీఎండీకి ఘన స్వాగతం పలికారు. ఆఫీస్‌లో పలు విభాగాలను పరిశీలించారు. విద్యుత్ సర్క్యూట్ పరిశీలనకు అదనపు పరికరం కేటాయిస్తూ ఆదేశాలిచ్చారు. సంస్థ డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, మోహన్‌రెడ్డి, సంధ్యారాణి, గణపతి, సీజీఎంలు అశోక్, ప్రభాకర్, వేణుబాబు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అత్యున్నత హోదా

- ప్రతీరోజు 1,000 మెట్రిక్ టన్నుల చెత్త బయోమైనింగ్ చేస్తున్నాం
- మేయర్ సునీల్‌రావు



కార్మికులకు స్వీట్ తినిపిస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజలు, పారిశుధ్య కార్మికుల సహకారంతోనే నగరపాలక సంస్థకు దేశంలోనే అత్యున్నత హోదా లభించిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచామన్నారు. 36 ఎంఎల్‌డీ కెపాసిటీ గల ఎస్టీపీలో మురుగు నీటిని శుద్ధి కరించడంతోపాటు ప్రత్యేక ల్యాబ్ సహాయంతో నీటిని పరీక్షించి, నగరంలో మొక్కలకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు విని యోగిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ పరిశుభ్రత కోసం కార్మికులను కాకుండా పూర్తిస్థాయిలో యంత్రాలను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. 14420 అనే టోల్ ఫ్రీ నంబర్ ద్వారా నగరంలో అన్ని సెప్టిక్ ట్యాంకులను యంత్రాలతో శుద్ధి చేస్తున్నామన్నారు. ఇలా అన్ని రకాల చర్యల వల్లే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వాటర్ ప్లస్ హోదా ప్రకటించిందని తెలిపారు. దీనికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, అప్పటి కలెక్టర్, అదనపు కలెక్టర్ సహకారం ఉందన్నారు. బయోమైనింగ్ కోసం అదనపు స్థలం ఇస్తే డంపింగ్‌యార్డు త్వరగా క్లియర్ చేస్తామన్నారు. ప్రతీరోజు 1,000 మెట్రిక్ టన్నుల చెత్త బయోమైనింగ్ చేస్తుంటే, కొత్తగా 200 మెట్రిక్ టన్నుల చెత్త వచ్చి చేరుతోందన్నారు. తొలుత హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో 24 గంటలు తాగునీటి సరఫరా అమలు చేసి, తర్వాత దశలవారీగా నగరమంతా విస్తరిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, బుచ్చిరెడ్డి, దిండిగాల మహేశ్, బోనాల శ్రీకాంత్, ఎదుల్ల రాజశేఖర్, వేణు, భూమాగౌడ్, తిరుపతి, నర్మద, గందె మహేశ్, బాలయ్య, రవీందర్, పవన్, వేణు, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్, పర్యావరణ ఇంజినీర్ స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో విప్‌ లక్ష్మణ్‌



కోడె మొక్కులు చెల్లిస్తున్న విప్‌ లక్ష్మణ్‌

వేములవాడ: వేములవాడ రాజన్నను ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ శనివారం దర్శించుకున్నారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని సుమారు ఐదువేల మంది దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌, సూపరింటిండెంట్‌ సునీల్‌, లక్ష్మారెడ్డి, ధర్మేందర్‌, లక్ష్మిరాజం పర్యవేక్షించారు.

గాజులే జీవనం.. గుడిమెట్లే ఆధారం

రాజన్న భక్తులే ఆధారంగా చిరు వ్యాపారం

- ఇక్కడి నుంచి గాజులు తీసుకెళ్లడం ఆనవాయితీ..
- గాజులు విక్రయించి ఉపాధి పొందుతున్న 50 మంది మహిళలు
- దక్షిణ ద్వారం వద్ద విక్రయాలు
- అద్దె ఇంట్లో ఉంటూ.. కుటుంబాలకు అండగా నిలుస్తూ..



ఎములాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల ఆధారంగా పలు కుటుంబాలు బతుకుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కడ జాతరలో పలు వస్తువులు కొంటుంటారు. ఇలా భక్తుల కోసం దుకాణాలు పెట్టుకున్న వారు వ్యా పారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇలాంటి కోవలోకే వస్తారు గాజులు అమ్మే మహిళలు. అనాదిగా జీవనోపాధిగా వస్తున్న వ్యాపారాన్ని నమ్ముకొని వేములవాడలో దాదాపు 50 మంది వరకు మహిళలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి గాజులు విక్రయిస్తున్నారు. తమ కుటుంబాలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

వేములవాడ అర్బన్‌: వేములవాడ రాజన్న ఆలయ దక్షిణ ద్వారం మెట్ల వద్ద దాదాపు 50 మంది మహిళలు గాజుల గంపలతో కూర్చొని కనిపిస్తారు. వీరంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. వేములవాడ స్థానికులు పది మంది వరకు ఉంటే.. మిగతా వారంతా వరంగల్‌, పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల నుంచి వచ్చిన వారు. వారంతా ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంటూ గాజులు విక్రయిస్తున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు గాజులు విక్రయిస్తూ కుటుంబాలను సాదుకుంటున్నారు.

గాజులు కొనడం ఆనవాయితీ

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులలో చాలా మంది తమ బంధువులు, ఇంటి చుట్టుపక్కల వారి కోసం ఇక్కడి నుంచి గాజులు తీసుకెళ్లడం ఆనవాయితీ. భక్తుల నమ్మకమే వ్యాపారంగా వీరు ముందుకెళ్తున్నారు. గతంలో గాజుల విక్రయానికి గంపనెత్తిన పెట్టుకొని పల్లెల్లో తిరిగేవారు. ఇప్పుడు అందరూ పట్టణాల్లోని లేడీస్‌ ఎంపోరియంలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో పల్లెల్లో గిరాకీ ఉండడం లేదని ఎవరూ గాజుల వ్యాపారులు వెళ్లడం లేదు.

ఆది, సోమవారాల్లో గిరాకీ ఎక్కువ

రాజన్న ఆలయానికి ఆది, సోమవారాల్లో భక్తులు అధికంగా వస్తుంటారు. గాజుల గిరాకీ బాగా ఉంటుంది. ఆ రెండు రోజుల్లో దాదాపు రూ.1000 నుంచి రూ.1200 వస్తుంటాయని మహిళా వ్యాపారులు తెలిపారు. మిగతా రోజుల్లో రూ.400 నుంచి రూ.500 వస్తుంటాయని అంటున్నారు.

రాజన్నను నమ్ముకున్నం



బతుకుదెరువు కోసం రాజన్న ఆలయం గుడి మెట్ల వద్ద గాజులు అమ్ముతున్న. రాజన్నను నమ్ముకొని గాజుల వ్యాపారం చేస్తున్నాం. – కృష్ణవేణి, నగునూర్‌

రోజూ ఇక్కడే ఉంటాం



బతుకమ్మ, దసరాకు గాజులు అమ్ముకునేందుకు ఊళ్లలోకి వెళ్తాను. మిగతా ఏడాది మొత్తం రాజన్న ఆలయ దక్షిణ ద్వారం మెట్ల వద్దనే గాజులు అమ్ముతాను. – విజయ, వేములవాడ

పన్నెండేళ్లుగా ఇక్కడే..



వేములవాడకు వచ్చి పన్నెండేళ్లు అవుతుంది. రాజన్న మెట్ల వద్దనే గాజులు అమ్ముతున్నా. కుటుంబంతో వచ్చి ఇక్కడే అద్దె ఇంట్లోనే ఉంటున్నాము. పండుగలకు మాత్రం సొంతూరికి వెళ్తాం. – భాగ్యలక్ష్మి, హుజూరాబాద్‌

ఆది, సోమవారాల్లో గిరాకీ



రాజన్న ఆలయం వద్ద గాజులకు ఆది, సోమవారాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఈ రోజుల్లోనే భక్తులు అధి కంగా వస్తుంటారు. భక్తుల రద్దీ పెరిగితే మాకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. – స్వప్న, పెద్దపల్లి

జాతీయ పోటీలకు 'మానేరు' విద్యార్థి



అమన్‌ను అభినందిస్తున్న సునీతారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్‌: పంజాబ్‌లోని లూథియానలో నేటినుంచి జరిగే 67వ జాతీయస్థాయి పాఠశాలల అండర్‌–17 జూడో చాంపియన్‌షిప్‌ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థి అమన్‌రెడ్డి ఎంపికయ్యాడని పీఈటీ సిలివేరి మహేందర్‌ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అమన్‌రెడ్డి రాణించాడు. శనివారం అమన్‌రెడ్డిని పాఠశాల డైరెక్టర్‌ కడారి సునీతరెడ్డి, విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి, ప్రిన్సి పాల్‌ సరితారెడ్డి, పీఈటీలు జహదా అభినందించారు.

కేసు నమోదు

చందుర్తి (వేములవాడ): చందుర్తి మండలం రామన్నపేటలో ఓ యువకుడు విద్యుత్‌ కంచె తగిలి గాయపడగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన ఓ రైతు కూరగాయాల పంటరక్షణ కోసం విద్యుత్‌ కంచె ఏర్పాటు చేశాడు. గత నెల 25న ఇదే గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి కంచె తగిలి గాయపడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సదరు రైతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌ వివరించారు.

జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌
- కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్‌

కరీంనగర్‌: కరీంనగర్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం అందజేసిన జర్నలిస్టుల నివేశన స్థలాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఇళ్ల స్థలాల పనులు నిలిపివేతపై స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే గంగుల కలెక్టర్‌ పమేలా సత్పతితో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్‌తో చర్చించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో అర్హులైన జర్నలిస్టులకు అందజేయడం జరిగిందని.. వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేసి జర్నలిస్టులు ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాము ఎల్లప్పుడూ జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపాటుడతామని.. వారికి అండగా ఉంటానని జర్నలిస్టులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్‌ పమేలా సత్పతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి బొకే అందజేశారు. ఆయన వెంట మేయర్‌ సునీల్‌రావు, బీఆర్‌ఎస్‌ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్‌ తదితరులున్నారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు



గాయపడిన బాలుడు

కాల్వశ్రీరాంపూర్‌: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌ మండలం మొట్లపల్లిలో శనివారం పిచ్చికుక్క పలువురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన దొమ్మటి రవి, బొల్లమల్ల శివ, దుర్గం రాఘవ, పోగుల కౌశిక్‌ గాయపడ్డారు. వీరికి కాల్వశ్రీరాంపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. పిచ్చికుక్కల బెడదతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అవిశ్వాసంపై హైకోర్టు స్టే

రామడుగు: రామడుగు ఎంపీపీ కలిగేటి కవితపై పదిమంది ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే ఇచ్చింది. డిసెంబర్‌ 19న పదిమంది ఎంపీటీసీలు ఆర్డీవోను కలిసి నోటీసులు అందజేశారు. అధికారులు ఈ నెల 8న బలనిరూపణ కోసం నోటీసులు ఇచ్చారు. దీనిపై ఎంపీపీ కలిగేటి కవిత హైకోర్టును ఆశ్రయించడంతో 10వ తేదీ వరకు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ కాపీలను ఎంపీపీ కలెక్టర్‌, ఆర్డీవో, జెడ్పీ సీఈవోకు అందించారు.

నూతన నియామకం

కరీంనగర్‌కల్చరల్‌: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా కో– ఆర్డినేటర్‌గా సర్దార్‌ నాగేందర్‌ సింగ్‌ను నియమించినట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్‌ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి, ముఖ్య సమన్వయకర్త మహమ్మద్‌ ఫయాజ్‌ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు నియామకం చేసినట్లు వెల్లడించారు.

'శాతవాహన' భూమి ఆక్రమణకు యత్నం

- వన్‌టౌన్‌లో కేసు నమోదు

కరీంనగర్‌క్రైం: మానేరు డ్యాం సమీపంలోని శాతవాహనయూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు చెందిన భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ పోలీసులు తెలిపారు. పోలీసులు, వీసీ మల్లేశం వివరాల ప్రకారం అలకాపురి కాలనీకి చెందిన కొత్త వీరారెడ్డి, మరికొంత మంది ఈనెల 3న ఫార్మసీ కళాశాలలోకి వచ్చారు. జేసీబీతో క్యాంపస్‌లోని ఓ షెడ్డు, మొక్కలను కూల్చేసి, స్థలాన్ని చదును చేశారు. ఈ విషయమై అధికారుల ఫిర్యాదుతో ఈ నెల 5న కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు శనివారం ఫార్మసీ కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. కళాశాల భూములు కాపాడాలని డిమాండ్‌ చేశారు. ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు వారిపై వన్‌టౌన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. టౌన్‌ ఏసీపీ నరేందర్‌, వర్సిటీ వీసీ మల్లేశం కబ్జాకు గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. భూ కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీసీ ఏసీపీని కోరారు.

'కళాశాల భూమి కబ్జా చేయాలని చూస్తే ఊరుకోం'

కరీంనగర్‌ సిటీ: శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల భూమిని కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోమని, క్రిమినల్‌ కేసులు నమోదు చేయిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ సంకసాల మల్లేశ్‌ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం కళాశాల పక్కనే ఉన్న భూమికి చెందిన వీరారెడ్డి తన స్థలంలో పని చేసుకుంటామని వచ్చి, ప్రిన్సిపాల్‌ ఏఆర్‌ కిశోర్‌ వద్ద అనుమతి తీసుకున్నాడని తెలిపారు. కానీ, కళాశాల భూమిలో నుంచి రోడ్డు వేసేందుకు చదును చేయగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఏసీపీ వచ్చి, సంఘటన స్థలాన్ని పరిశీలించారని, వీరారెడ్డి మనుషులను అక్కడి నుంచి పంపించారని పేర్కొన్నారు. జేసీబీలు, బెడ్‌ బండ్లను సీజ్‌ చేసి, అతన్ని అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఫార్మసీ కళాశాల భూమిని ఇకపై ఎవరూ కబ్జా చేయకుండా చుట్టూ ఫెన్సింగ్‌ వేయిస్తున్నామని తెలిపారు.

గంజాయి కేసుల్లో ఏడుగురి బైండోవర్‌



నిందితులను బైండోవర్‌ చేస్తున్న పోలీసులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో గతంలో గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న ఏడుగురిని శనివారం పోలీసులు బైండోవర్‌ చేశారు. స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు గోదావరిఖని వన్‌టౌన్‌, మంచిర్యాల, బెల్లంపల్లి వన్‌టౌన్‌, చెన్నూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న ఎల్పుల సాయి చందర్‌, ఎస్‌కే.జమీర్‌, జాడి సాయిపవన్‌, ఎండీ.అన్వర్‌, గుజ్జుల సాయితేజ, భీముల అలియాస్‌ బేబుల అంజితోపాటు మరొకరిని బైండోవర్‌ చేశారు. మరోసారి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే జైలుశిక్ష ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

10వ తేదీ వరకే పెండింగ్‌ చలాన్ల రాయితీకి గడువు

కోల్‌సిటీ: వాహనదారులకు పెండింగ్‌ చలాన్ల చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీ గడువు ఈనెల 10వ తేదీ వరకే ఉంటుందని, 11వ తేదీ నుంచి పూర్తిస్థాయి డబ్బులను చెల్లించాల్సి ఉంటుందని రామగుండం ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం వహించిన వారు 11వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో చలాన్లకు డబ్బులు చెల్లించడమే కాకుండా, పోలీసులు తనిఖీ చేసే సమయంలో ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

'అల్ఫోర్స్‌'లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



విద్యార్థులతో చైర్మన్‌ డా.నరేందర్‌ రెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లి అల్ఫోర్స్‌ ఇ టెక్నో స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహాగణపతి, గౌరీమాత విగ్రహాలకు అల్ఫోర్స్‌ విద్యా సంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 400మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. అదే విధంగా రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్‌ పాఠశాలలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

జాతీయ మాస్టర్‌ అథ్లెటిక్స్‌కు జమ్మికుంట వాసి



పతకాలు అందుకుంటున్న అంబాల ప్రభాకర్‌

జమ్మికుంట: జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్‌ మహారాష్ట్రలోని పూణేలో ఫిబ్రవరి 13 నుంచి 17వ తేదీ వరకు వరకు నిర్వహించే జాతీయస్థాయి మాస్టర్‌ అథ్లెటిక్స్‌ ఎంపికయ్యాడని మాస్టర్‌ గేమ్స్‌ అసోసియేషన్‌ తెలంగాణ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి రామారావు తెలిపారు. మాస్టర్స్‌ గేమ్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జింకానాగ్రౌండ్‌లో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రోలో బంగారుపతకం, హైమార్‌త్రోలో వెండి పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు.

బతుకు పోరులో ఆగిన ఊపిరి

- సౌదీలో దమ్మన్నపేట వాసి మృతి
- మృతదేహం కోసం ఎదురుచూపులు



రాజన్న(ఫైల్‌)

ధర్మపురి: బతుకుపోరులో ఎడారిదేశం వెళ్లిన వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడు. కొద్ది రోజులు చికిత్స పొంది స్వదేశానికి వస్తుండగా.. అక్కడి ఎయిర్‌పోర్టు అధికారులు అనుమతించలేదు. దీంతో తోటి కార్మికుల గదిలో ఆశ్రయం పొందాడు. అక్కడ సరైన వైద్యం అందక ఈనెల 4న చనిపోయాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న(50) 11ఏళ్లుగా ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్తున్నాడు. అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఏడాదికోసారి ఇంటికొచ్చి వెళ్తుండేవాడు. రెండుమాసాల క్రితం గది నుంచి డ్యూటీకి వెళ్తుండగా పక్షవాతంతో రోడ్డుపై పడిపోయాడు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆరుగంటలు కొట్టుమిట్టాడు. అక్కడే ఉంటున్న రాజన్న తమ్ముడు తిరుపతి విషయం తెలుసుకుని ఆస్పత్రికి తరలించాడు. కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోగా.. ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రివారు డిశ్చార్జీ చేశారు. దీంతో తన గదికి తీసుకెళ్లిన తిరుపతి రాజన్న భార్య, ఇద్దరు పిల్లలకు సమాచారం ఇచ్చాడు. వారు స్వగ్రామానికి తీసుకురావాలని సూచించగా.. డిసెంబర్‌ 22న బయల్దేరారు. సౌదీ ఎయిర్‌పోర్టులో పరీక్షలు చేసిన అధికారులు బీపీ, షుగర్‌ అధికంగా ఉందని ప్రయాణానికి అనుమతించలేదు. దీంతో రాజన్నను తిరిగి గదికి చేర్చారు. సరైన వైద్యం అందకపోవడంతో ఈనెల 4న మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు తిరుపతి, అక్కడి తెలుగువాళ్లు ప్రయత్నిస్తున్నారు. రాజన్నకు 11ఏళ్ల బీమా, లీగల్‌ డబ్బులు కంపెనీ చెల్లించాలని కోరుతూ టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్‌ కన్వీనర్‌ షేక్‌ చాంద్‌పాషా విదేశీ వ్యవహారాలశాఖకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యం



వినయ్‌

జమ్మికుంట: కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయల్దేరిన విద్యార్థి అదృశ్యం అయ్యాడు. ఎస్సై శ్రీధర్‌ వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఉయ్యాల వినయ్‌ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజినీరింగ్‌ కళాశాలలో చదువుతున్నాడు. గత నెల 31న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయల్దేరి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌ పేర్కొన్నారు.

పథకాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్‌

కరీంనగర్‌కల్చరల్‌: పేదరిక నిర్మూలనకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి కె.వెంకటేశ్‌ అన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం కరీంనగర్‌–4 ను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. బాలబాలికలకు భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, విద్యార్థులకు ఉపయోగపడే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చక్కగా చదువుకొని, క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ మహేశ్‌, వసతి గృహం నిర్వాహకురాలు పద్మజ పాల్గొన్నారు.

లక్షలు పోసినా.. దక్కని ప్రాణం

- అనారోగ్యంతో యువకుడి మృతి



సతీశ్‌(ఫైల్‌)

ధర్మపురి: ఆడుతూ.. పాడుతూ ఆనందంగా ఉన్న కొడుకు ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించి లక్షలు వెచ్చించినా ప్రాణం దక్కలేదు. నాడు భర్త.. నేడు కొడుకు మృతితో ఆ తల్లి కన్నీరుమున్నీరవుతోంది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన దూడ శంకరమ్మ భర్త 2012లో అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి కూలీపని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లు, కొడుకు సతీశ్‌(20)ను పోషిస్తోంది. డిగ్రీ చదువుతూనే జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో ఎంఎల్‌టీగా పనిచేస్తున్న సతీశ్‌ ఈనెల 1న జ్వరంతో జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు కిడ్నీ, లివర్‌ చెడిపోయాయని తెలిపారు. కొడుకును బతికించుకోవడం కోసం శంకరమ్మ రూ.3లక్షల వరకు అప్పుచేసింది. ఐదు రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందిన సతీశ్‌ శుక్రవారం ఆస్పత్రిలో చనిపోయాడు. 'తండ్రి లేని తమకు అండగా ఉంటాడని అనుకుంటే నువ్వూ అక్కడికే వెళ్లావా' అంటూ కుటుంబసభ్యులు రోదించిన తీరు కన్నీరు పెట్టించింది. శనివారం సతీశ్‌ అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు.

అలరించిన 'టైంలెస్‌ వోయేజ్‌'

- ఆకట్టుకున్న నృత్యాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రసాదరావు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాలలో 'టైంలెస్‌ వోయేజ్‌' పేరుతో శనివారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పారమిత, ఎక్స్‌ప్లోరికా విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ ఇ.ప్రసాద్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అద్భుత ప్రదర్శనతో విద్యార్థులు అలరించారు. ఈ విద్యాసంవత్సరంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను నగదు, జ్ఞాపికలతో సత్కరించారు. పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్‌ ప్రసాద్‌, ప్రాచీ, ప్రసాద్‌, ప్రధానోపాధ్యాయులు రితేష్‌ మెహత, ప్రోగ్రామ్‌ హెడ్‌ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రాము, రబీంద్ర పాత్రో, హరిప్రియ, సరిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగరంలోని 18వ డివిజన్ రేకుర్తి కొత్తవాడ కాలనీ, విజయపురి, శాతవాహనకాలనీలో అయోధ్య రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ద్వారా వచ్చిన అక్షింతలను శనివారం అమృతేశ్వర ఆలయం నుంచి తీసుకవచ్చి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, చంద్రగిరి వేణు, అస్తపురం వినేశ్, లింగయ్య, సుజాత, కవిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్‌లో..

నగరంలోని జ్యోతినగర్ హనుమాన్, సంతోష్‌మాత ఆలయంలో అయోధ్య రాముని అక్షింతల పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం 59వ డివిజన్లో గడపగడపకూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని 23వ డివిజన్ ఆదర్శనగర్‌లో అక్రమంగా చేపడుతున్న వైన్స్ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ శనివారం నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణికి ఫిర్యాదు చేశారు. ఆదర్శనగర్ బోర్డు చౌరస్తా వద్ద గతంలో నిర్మించిన వైన్స్, కొత్తగా నిర్మిస్తున్న వైన్స్‌లు అక్రమంగా నిర్మించారన్నారు. జనావాసాల మధ్య, శివాలయం, సీతారామాంజనేయ ఆలయాలు, హాస్పిటల్స్‌కు అతి సమీపంలో వైన్స్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలు మీరి ఏర్పాటు చేస్తున్న వైన్స్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

కరీంనగర్‌సిటీ: అసత్య ఆరోపణలు చేసేవారు రాబోయే ఎంపీ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు వారికి తగిన విధంగా ఓటుతో బుద్ధి చెబుతారని బీఆర్‌ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామని గ్రహించి బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, బోయినపల్లి వినోద్ కుమార్‌పై దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ ఎంపీగా పార్లమెంట్‌లో కరీంనగర్ సమస్యల గురించి ఎన్నిసార్లు గళమెత్తారో, ఎన్ని ప్రశ్నలు వేసి సమస్యలు పరిష్కరించారో గుర్తుందా అని ప్రశ్నించారు. దుష్ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని ఎక్కడికక్కడ వారిని తరిమికొడతాం అని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, ఎస్సారార్ కళాశాల అధ్యక్షుడు దేవునూరి విక్రమ్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చింపిన ఘటనపై విచారణ చేపట్టాలి


సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నగరంలోని డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లు చింపినవారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ కోరింది. ఈ మేరకు శనివారం టూటౌన్ సీఐ వెంకటేశ్‌కు మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ ఫిర్యాదు చేశాడు. నగరంలోని 60 డివిజన్‌లలో ప్రజాపాలన కేంద్రాల వద్ద కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. పలుచోట్ల ఫ్లెక్సీలను కొంతమంది చింపి వేశారని, ఇందులో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్ల హస్తం ఉందని ఆరోపించారు. నగరంలోని 30,5,6,14,23,27,45 డివిజన్‌లలో ఫ్లెక్సీలను చింపివేసినట్లు వివరించారు. 45వ డివిజన్‌లో రెండు సార్లు చింపారని, స్థానిక కార్పొరేటర్ భర్తపై అనుమానం ఉందన్నారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎండీ లాయక్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, సయ్యద్ లాయక్, ఎండీ కలీం తదితరులు పాల్గొన్నారు.

బల్దియా అర్జీలు 83,670

- ప్రశాంతంగా ముగిసిన ప్రజాపాలన


దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ పరిధిలో ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కేంద్రాల్లో 83,670 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారంటీ పథకాల అమలుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. నగరంలోని 60 డివిజన్‌లలో గత నెల 28వ తేదీన ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమానికి ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి 77,602 దరఖాస్తులు రాగా, ఇతర దరఖాస్తులు 6,068.. మొత్తంగా 83,670 దరఖాస్తులు వచ్చాయి. శనివారం చివరిరోజు నగర వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో కలిపి 10,097 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఆన్‌లైన్ చేసే ప్రక్రియను బల్దియా అధికారులు చేపట్టారు. కాగా ప్రజాపాలన కేంద్రాలను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి దేవసేనతో పాటు కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ పర్యవేక్షించారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రత్యక్షంగా పలు డివిజన్‌లలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

అర్హులకు పథకాలు అందాల్సిందే: మేయర్ సునీల్‌రావు

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హులకు ఆరుగ్యారంటీ పథకాలు అందాల్సిందేనని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శనివారం నగరంలోని 14,47 డివిజన్‌లలో ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, షర్ఫొద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలంలో 15,261 దరఖాస్తులు


బొమ్మకల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ శనివారంతో ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాల అమలుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు అభయహస్తం ప్రజాపాలన పేరిట కరీంనగర్ మండలంలో గత నెల 28నుంచి ఈ నెల 4 వరకు గ్రామసభలు నిర్వహించింది. మొత్తం 17 గ్రామపంచాయతీల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే గ్రామసభల్లో వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోనివారికి సంబంధిత పంచాయతీల్లో శుక్ర, శనివారాల్లో దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మండల పరిధిలో మొత్తం నివాస గృహాలు 14,510 ఉండగా 15,261 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 454 రేషన్‌కార్డులు, మిగతావి ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించినవి ఉన్నాయి. శుక్రవారం నుంచి తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, ఎంపీడీవో ఎస్.దివ్యదర్శన్‌రావు ఆధ్వర్యంలో గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

కరీంనగర్ మండల పరిధిలో గ్రామాలవారీగా గృహాలు, దరఖాస్తులు

గ్రామం	గృహాలు	దరఖాస్తులు	గ్రామం	గృహాలు	దరఖాస్తులు
బొమ్మకల్	3,951	4,080	గోపాల్‌పూర్	1,065	1,150
చామనపల్లి	918	1,063	ఇరుకుల్ల	461	459
చెర్లభూత్కూర్	1,022	1,170	జూబ్లీనగర్	507	476
నగునూరు	1,906	1,720	మందులపల్లి	145	248
దుబ్బపల్లి	233	252	మొగ్ధుంపూర్	1,176	1,139
దుర్శేడ్	1,333	1,325	బహుదూర్‌ఖాన్‌పేట	224	316
ఎలబోతారం	520	581	చేగుర్తి	541	666
ఫకీర్‌పేట	213	198	నల్లగుంటపల్లి	155	235
			తాహెర్‌కొండాపూర్	140	183

కరీంనగర్ ఎంపీ టికెట్‌ను బీసీలకు ప్రకటించాలి


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కరీంనగర్‌టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి అన్నారు. శనివారం ప్రెస్‌భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక శాతం బీసీలు ఉన్నందున కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఆలోచించి జనాభా దామాషా ప్రకారం టికెట్ కేటాయించాలని కోరారు. అలాగైతేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల ఆంజనేయగౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, బీసీ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కాస రాజు, విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు బోయిని ప్రశాంత్ , బియ్యం తిరుపతి, గుమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ


స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న దేవసేన

కరీంనగర్‌టౌన్: స్థానిక శ్రీనగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరహరి సత్యనారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ హనుమండ్లు రాజారెడ్డి, రమణారెడ్డి, కోమల్‌రెడ్డి, కరుణాకర్, కరివేద మహిపాల్ రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

‘ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు’


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

కరీంనగర్‌టౌన్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండుమూడు రోజుల నుంచి బీఆర్‌ఎస్ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికలపై కేటీఆర్ సమీక్షిస్తూ ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీలను గెలిపించాలని కోరుతున్నారని, అయితే పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజలకు ఏం లాభం చేశారని ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేయాలని అడుగుతున్నారని ప్రశ్నించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో 15 ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గతంలో జరిగిన అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ విసిరిన సవాల్‌కు ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎవరి హయాంలో కరీంనగర్ పార్లమెంటులో అభివృద్ధి జరిగిందో చర్చించిన తర్వాతే పోటీకి రావాలన్నారు. సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, శ్రీధర్, బాపురెడ్డి, సతీశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు ‘అద్దం నా చిరునామా కాదు’ ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: రచయిత్రి తోట నిర్మలారాణి రచించిన ‘అద్దం నా చిరునామా కాదు’ పుస్తకావిష్కరణ సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని జగిత్యాలరోడ్‌లో విద్యుత్ ఇంజినీర్ల సంఘం భవనంలో నిర్వహించనున్నట్లు తెరవే అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అఖిల భారత తెరవే అధ్యక్షుడు జూకంటి జగన్నాథం హాజరు కానుండగా, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు బి.ప్రసేన్, రచయితలు అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం హాజరవుతారని తెలిపారు. కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్లూ బెల్స్‌లో అలరించిన ‘టెక్కీ క్లౌడ్’


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న సునీతారెడ్డి

సప్తగిరికాలనీ: స్థానిక హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన యూ లో టెక్కీ క్లౌడ్ కోడింగ్ ప్రోగ్రాం ఆకట్టుకుంది. యూ లెట్ ఎక్కీ ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో సీబీఎస్ఈ కరిక్యులంలో భాగంగా కంప్యూటర్ సైన్స్‌ను పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు కోడింగ్ ఏ విధంగా చేయాలో నేర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన సుమారు 350 మంది విద్యార్థులు కంప్యూటర్‌లతో అద్భుతమైన ప్రదర్శనలు చేశారు. పాఠశాల ఆవరణను కంప్యూటర్‌కు సంబంధించిన నమూనాలు, చార్ట్‌లు, బెలూన్లతో అలంకరించారు. అంతకుముందు కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ కాసర్ల ఆనంద్‌కుమార్, సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతామనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నర్సింహ్ ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 45 మందిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా ఒక వ్యక్తికి 10 రోజులు, ఒకరికి ఐదు రోజులు, ఐదుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు, రూ.14,500 జరిమానా విధించగా మిగితా 38 మందికి కలిపి రూ.66 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ భూములు కబ్జాకు గురవుతున్నాయని వెంటనే కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పుసాల విష్ణు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల భూమిని భూ బకాసురులు చదును చేసి, విశ్వవిద్యాలయంలోకి చొచ్చుకు రావడం జరిగిందన్నారు. దీనిపై విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, కానీ ఒక కాంట్రాక్ట్ అధ్యాపకునితో ఫిర్యాదు చేయించడం, అతడిని బాధ్యుడిని చేసే ప్రయత్నం చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో నాయకుల అండదండలతో ఉపకులపతి, ఆయన అనుకూల వర్గం ఏం చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన శాతవాహన విశ్వవిద్యాలయ అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యుడు అంజన్న, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు, లా ఫోరం కన్వీనర్ ప్రమోద్, శ్రీ వర్ధన్, సాయి, రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన భూములను రక్షించాలి

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ భూములను కాపాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి శనివారం ప్రకటనలో అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కాలేజీ భూమిని భూ బకాసూరులు చదును చూసి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ భూమిని కాపాడాల్సిన అధికారులు చూసీచూడనట్లు ఉండటం వల్లే తరుచూ కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఫార్మసీ కాలేజీ మొత్తం విస్తీర్ణం 42.14 ఎకరాలు అని ప్రస్తుతం ఎంత భూమి ఉందో మొత్తం సర్వే చేసి రిపోర్ట్ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, వీసీ, రిజిస్ట్రార్, యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా కళాశాల భూములను కాపాడాలని, కబ్జా చేసేవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి శుభాకాంక్షలు


సీఎండీకి మొక్క అందజేస్తున్న 327 నాయకులు, మహిళా ఉద్యోగులు


మొక్క అందజేస్తున్న టీఆర్‌వీకేఎస్ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కరీంనగర్ పర్యటనకు వచ్చిన కర్నాటి వరుణ్‌రెడ్డికి విద్యుత్ ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్‌తో పాటు డీఈలు విజయేందర్ రెడ్డి, చంద్రమౌళి, కాళిదాసు, లక్ష్మారెడ్డి, ఏవో రాజేశం, ఏఏవోలు, ఏడీఈలు, ఏఈలు, వివిధ అసోసియేషన్ల నాయకులు పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌టౌన్: ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు వెళ్లాలంటే వారి ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం కరీంనగర్ నగరంలోని కార్ఖానగడ్డలో గల అంబేద్కర్ మెమోరియల్ క్లబ్‌లో జేకేఏఐ షోటోఖాన్ కరాటే అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అతిథులు మాట్లాడారు. కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు వారిని వారు రక్షించుకునే విధంగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్, కరాటే మాస్టర్ డి.భానుతేజ, దెంచనోజు సత్యనారాయణ–వెంకటలక్ష్మి, సీనియర్ కరాటే మాస్టర్ బొల్లి ఐలయ్య, బండారిపల్లి రమేశ్, రవితేజ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యార్థికి అభినందన


అభిరామ్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి అభిరామ్ లక్ష్యద్వీప్‌లో నిర్వహించిన ఎస్ఎన్ఐసీ శిక్షణ పూర్తి చేసుకున్నట్లు కళాశాల ఎన్‌సీసీ కెప్టెన్ కిరణ్‌జ్యోతి తెలిపారు. ఎన్‌సీసీ కెడెట్ పి.అభిరామ్ గత నెల 22 నుంచి ఈనెల 2 వరకు ఎస్ఎన్ఐసీ లక్ష్యద్వీప్ క్యాంప్‌లో పాల్గొని స్కూబా డ్రైవింగ్, క్యాకింగ్, మిర్రర్ బోట్, డిబెట్, క్విజ్ పోటీల్లో అత్యంత ప్రతిభచూపి ప్రశంసలు అందుకున్నాడు. ఈ సందర్భంగా అభిరామ్‌ను ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్, ఏసీవో సంపత్‌కుమార్, ఎంవో శ్రావణ్‌కుమార్, రామేశ్వర్‌రావు ప్రత్యేకంగా అభినందించారు.

‘బోయినపల్లి’పై అసత్య ప్రచారం తగదు


పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్: కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌పై బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుల అసత్య ప్రచారం తగదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. అసత్య ప్రచారం చేసి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం టూటౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ మాట్లాడుతూ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న వినోద్‌కుమార్‌పై కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే కొందరు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని బోయినపల్లి వినోద్‌కుమార్ అన్న కూతురుకు విద్యుత్‌శాఖలో ఉద్యోగం ఇప్పించుకుని ఇంట్లో ఉంచి ఒక లక్ష యాభైవేల వేతనం ఇప్పిస్తున్నారు అని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. వాస్తవానికి వినోద్‌కుమార్ అన్నదమ్ములు ఎవరూ లేరని, వారు చెబుతున్నటువంటి పేరు వారి దగ్గర బంధువులలో కూడా ఎవరూ లేరన్నారు. సోషల్‌మీడియా వేదికగా అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు కులదీప్‌వర్మ, సాయికృష్ణ, సాజిత్‌అలీ, చందు, తదితరులున్నారు. అలాగే బోయినపల్లి వినోద్‌కుమార్‌పై చేస్తున్న ఆరోపణలు అబద్ధమని, సత్తా ఉంటే ఎన్నికల్లో గెలుపొందాలే తప్ప అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమాసారం సమ్మయ్య వేర్వేరు ప్రకటనలో హెచ్చరించారు.

‘మానేరు’లో ముందస్తు సంక్రాంతి వేడుకలు


మాట్లాడుతున్న విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

సప్తగిరికాలనీ: కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను మామిడి తోరణాలు, బంతిపూలతో అలంకరించారు. గొబ్బెమ్మలను తయారు చేసి ఇంటి ఎదుట అలంకరించినట్లుగానే అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన బసవన్నల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం భోగి మంటలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్(పై చిత్రం), తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ శనివారం దర్శించుకున్నారు.



దరిగాం అడవుల్లో పులి హతం?

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్ నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో శనివారం పులి హతమైనట్లు తెలిసింది. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడపులి మృతిచెందినట్లు తెలిసింది. దరిగాం అటవీ ప్రాంతం దట్టంగానూ, ఆవాసానికి అనుకూలంగానూ ఉండడంతో ఇక్కడ పులుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే పోటీ తత్వంతో రెండు పులుల మధ్య ఘర్షణ జరిగినట్లు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయమై వివరాలు వెల్లడించే విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్నారు.

పొద్దుపొద్దునే ప్రయాణాలొద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసులు తెలిపారు.

- 25 డిసెంబర్, 2023న నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడు వద్ద రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 ఏండ్ల యువకుడు రమావత్ శివనాయక్ ద్విచక్రవాహనంతో 55 ఏండ్ల బల్లూరి సైదులు అనే వ్యక్తిని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మృతుడు శివనాయక్ బంధువులు టాటాఏస్ వాహనంలో ప్రమాద ఘటన స్థలానికి బయలుదేరారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ నిడమనూరు మండలం 3వ నంబర్ కెనాల్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. దట్టమైన పొగమంచు కారణంగానే ఈ వరుస ప్రమాదాలు జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు.
- డిసెంబర్ 31న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు, డీసీఎం ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ చనిపోగా, ఆర్టీసీ బస్ డ్రైవర్‌తోపాటు ఆ బస్సులోని మరో 10మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పొగమంచుతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్టు తెలిపారు.
- డిసెంబర్ 25న హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా అనంతగిరి ఔటింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న మిత్రుల బృందం కారు పొగమంచు కారణంగా రోడ్డు పక్కన ఉన్న శివారెడ్డిపేట్ చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఒకరు గల్లంతు కాగా, మిగిలిన నలుగురిని స్థానికులు కాపాడారు.

ప్రయాణం తప్పనిసరైతే ఇవి మరవొద్దు

- పొగమంచు కురుస్తున్నప్పుడు మీకు కేటాయించిన లేన్‌లోనే వాహనం నడపాలి. వీలైనంత వరకు ఓవర్‌టేక్ చేయకపోవడమే ఉత్తమం.
- సింగిల్ రోడ్డులో వాహనం నడపాల్సి వస్తే.. వీలైనంత వరకు మీ వాహనం ఎడమవైపు ఉండేలా చూసుకోవాలి.
- డ్రైవింగ్ సమయంలో ఏ సంశయం ఉన్నా.. రోడ్డు పూర్తిగా కనిపించకపోయినా మీ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలపడమే ఉత్తమం. మీరు వాహనాన్ని పార్క్ చేసినట్టుగా సూచిస్తూ పార్కింగ్ లైట్లు వేయాలి.
- పొగమంచు వాతావరణం ఉన్నప్పుడు వాహన వేగాన్ని వీలైనంత వరకు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎదుటి వాహనం కనిపించని పరిస్థితుల్లో వేగంగా వెళితే వాహనాన్ని కంట్రోల్ చేయడం కష్టం. అదేవిధంగా ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది.
- పొగమంచు కురుస్తున్నప్పుడు డ్రైవర్లు సాధారణంగా హైబీంలో లైట్లు పెడతారు. ఇలా చేయడం వల్ల రిఫ్లెక్షన్ వల్ల డ్రైవర్‌కు సరిగా కనిపించదు. విజిబిలిటి 100 మీటర్లలోపు ఉన్నట్లయితే హెడ్‌లైట్లు లోబీంలో ఉంచాలి. మీ వాహనానికి ఫాగ్ ల్యాంప్‌లు ఉంటే వాటిని తప్పక ఆన్ చేయాలి.
- ఎదుటి వాహనదారుడిని అప్రమత్తం చేసేలా మీ వాహనానికి ఇండికేటర్లు వేసు కుని వెళ్లడం ఉత్తమం.
- మీ వాహన అద్దాలు వీలైనంత వరకు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మీ కారులోని డీఫాగర్‌ను ఆన్ చేసుకోవాలి.
- వీలైనంత వరకు ఎదురుగా ఉన్న రోడ్డు స్పష్టంగా కనిపించేలా అవసరం మేరకు డ్రైవింగ్ సీట్‌ను సర్దుబాటు చేసుకోవాలి.
- పొగమంచు ఉన్నప్పుడు వాహనం ఒక్క క్షణం అదుపు తప్పి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి డ్రైవింగ్‌పైనే దృష్టి పెట్టాలి. నిద్రమత్తు లేకుండా జాగ్రత్త పడాలి.
- వాహనం పూర్తి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి. టైర్లు, బ్రేక్‌లు ముందుగానే చెక్ చేసుకోవాలి. మీ కారులోని హీటర్ ఆన్ చేయాలి. దీనివల్ల బయటి పొగమంచుతో అద్దంపై ప్రభావం లేకుండా ఉంటుంది.
- లేన్ మారుతున్నప్పుడు, మూల మలుపుల వద్ద తప్పకుండా హారన్ మోగించాలి.
- మొబైల్ ఫోన్ వాడడం, రేడియోలో ఎఫ్ఎం వినడం, పాటలు వింటూ డ్రైవ్ చేయవద్దు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరడం వెనుక
చంద్రబాబు కుట్ర

- అధికారం ఇక కలే అని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- దింపుడుకళ్లం ఆశలతో రకరకాల కుట్రలు
- సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు
- ఉనికిలోలేని కాంగ్రెస్‌లో ఎవరు చేరినా మాకేమీ నష్టం లేదు
- వైఎస్సార్‌సీపీని ఆదిలోనే తుంచేయడానికి కాంగ్రెస్, టీడీపీ కుట్ర
- అప్పుడే ఏం చేయలేని వారు.. ఇప్పుడేం చేస్తారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: కాంగ్రెస్‌లో షర్మిలమ్మ చేరడం వెనుక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుట్ర ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇక అధికారం కలే అని గ్రహించిన చంద్రబాబు.. దింపుడుకళ్లం ఆశలతో ఈ కుట్రకు పాల్పడ్డారని మండిపడ్డారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను చేతిలో పెట్టుకున్న చంద్రబాబు.. తన మనుషుల ద్వారా ఒక వైపు కాంగ్రెస్‌ను.. మరో వైపు బీజేపీని మేనేజ్ చేస్తున్నారని, మీడియా ద్వారా ప్రజల దృష్టి మళ్లించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మంచి ఏమీ లేకపోవడంతో ఇప్పుడేమీ చెప్పుకోలేక ఇప్పుడు రకరకాల కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆ కుట్రలో భాగంగానే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరికన్నారు. షర్మిలమ్మ సీఎం రమేశ్ విమానంలో వెళ్లడం.. టీడీపీ నేత బీటెక్ రవిని బ్రదర్ అనిల్ కలవడం యాదృశ్చికమని తాము అనుకోవడం లేదన్నారు. క్రిస్టియన్ ఓట్లను ప్రభావితం చేయడానికి కుట్రలు చేస్తున్నారంటూ గతంలో ఇదే టీడీపీ నేతలు బ్రదర్ అనిల్‌పై ఏ స్థాయిలో దుమ్మెత్తిపోశారో అందరికీ గుర్తుందన్నారు. టీడీపీ నేత బీటెక్ రవిని ఎయిర్‌పోర్ట్‌లో బ్రదర్ అనిల్ మర్యాదపూర్వకంగా కలవడం వంటి వాటన్నింటినీ పరిశీలిస్తే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరడం వెనుక చంద్రబాబు కుట్ర ఉందన్నది అర్థమవుతోందన్నారు.

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా నష్టం లేదు..

రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి, పార్టీ పెట్టి, తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా ఆపార్టీలో చేరడం షర్మిలమ్మ ఇష్టమని సజ్జల అన్నారు. అండమాన్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ఎక్కడైనా పనిచేస్తానని ఆమె అన్నారని, రాష్ట్రంలోనే రాజకీయం చేస్తానని ప్రకటించలేదన్నారు. ఒకవేళ రాష్ట్రానికి వస్తే కాంగ్రెస్ నాయకురాలిగానే తాము చూస్తామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయని.. అలాంటి పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదన్నారు. రాష్ట్రంలో ఉనికేలేని కాంగ్రెస్ పార్టీలో ఎవరు చేరినా తమకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు.

అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ కలసి కుట్ర..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై కాంగ్రెస్‌కు సంబంధించి తమకు అనుమానాలు ఉన్నాయని సజ్జల పునరుద్ఘాటించారు. వైఎస్ మరణం తర్వాత అప్పట్లో కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం టీడీపీ కుమ్మక్కై జగన్‌పై తప్పుడు కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీని స్థాపించాక కడప లోక్‌సభ, పులివెందుల శాసనసభ ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను, వైఎస్ విజయమ్మను ఓడించటం ద్వారా పార్టీని మొగ్గలోనే తుంచేయడానికి అప్పటి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష టీడీపీ కుమ్మక్కై కుట్ర చేశాయన్నారు. పులివెందుల ఉపఎన్నికలో వైఎస్ విజయమ్మపై వైఎస్ వివేకాను పోటీకి పెట్టారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్ విజయమ్మ 80 శాతం ఓట్లు సాధించి ఘనవిజయం సాధిస్తే.. కడప లోక్‌సభ స్థానం నుంచి జగన్ రికార్డు మెజార్టీతో విజయం సాధించారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వైఎస్సార్‌సీపీపై కుట్ర చేసి బొక్కబోర్లా పడ్డ చంద్రబాబు, కాంగ్రెస్ ఇప్పుడు ఏమీ చేయలేరని స్పష్టం చేశారు.

ఆది నుంచి కాంగ్రెస్‌తోనే చంద్రబాబు..

మహానేత వైఎస్ మరణించినప్పటి నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెరవెనుక కాంగ్రెస్‌తో సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారని సజ్జల ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని.. ఆ కుట్రలో భాగంగానే షర్మిల చేరికని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో జరగబోయే డ్రామా అంతా చంద్రబాబు ఆధ్వర్యంలోనే జరగనుందన్నారు. ప్రజా సమస్యలపై కాకుండా.. ప్రజలకు సంబంధం లేని సంచలనాలు సృష్టించడమే చంద్రబాబు నైజమన్నారు.

అభ్యర్థుల మార్పు సహజమే..

ఎన్నికల్లో అభ్యర్థుల మార్పుపై అన్ని పార్టీల్లోనూ సహజ ప్రక్రియేనని సజ్జల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమన్వయకర్తలను మారుస్తున్నారని చెప్పారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయం, ప్రజల ఆకాంక్షలు, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని.. అందరితో చర్చించే అవసరమైన చోట్ల సమన్వయకర్తలను మార్చుతున్నామని చెప్పారు. సీఎం జగన్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారని.. వ్యక్తిగత కారణాలతోనే కొందరు పార్టీని వీడుతున్నారని స్పష్టం చేశారు.

టీడీపీని వదిలేస్తున్నా..

విజయవాడ ఎంపీ కేశినేని నాని

- దొంగే.. దొంగ.. దొంగ.. అన్నట్లుగా చంద్రబాబు తీరు
- ఆ పార్టీకి ఎంతో సేవ చేశా.. నన్ను పొమ్మంటున్నారు
- ఆ పార్టీలో కొనసాగడంలో అర్థం లేదు
- ఇతర పార్టీల నేతలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటే తప్పా?
- ముందుగా ఎంపీ పదవికి రాజీనామా.. ఆ తరువాత టీడీపీకి రాజీనామా
- అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి



సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'దొంగే.. దొంగ.. దొంగ..' అన్నట్లుగా ఉంది చంద్రబాబు తీరు. ఇక తెలుగుదేశం పార్టీలో ఉండను. ఆ పార్టీని వదిలేస్తున్నా' అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) సంచలన ప్రకటన చేశారు. రెండుసార్లు ఎంపీగా చేసి, పార్టీకి ఎంతో సేవ చేసిన తనను చంద్రబాబు పొమ్మన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నాననే సాకుతో తనను పార్టీ నుంచి దూరంగా పెట్టారని వాపోయారు. ఎంపీ నాని శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాని మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు తాను కొనసాగిన టీడీపీని వదిలేస్తున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ''నేను టీడీపీని వదిలేస్తున్నా. ఆ పార్టీకి నా అవసరం లేనప్పుడు.. నేను అందులో కొనసాగడంలో అర్థం లేదు. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నా. ముందుగా ఢిల్లీ వెళ్లి ఎంపీ పదవికి రాజీనామా లెటర్ స్పీకర్‌కు ఇచ్చి, ఆమోదింపజేయించుకుని వస్తా. ఆ వెంటనే తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తా' అని చెప్పారు. ప్రజా అభివృద్ధి పనుల్లో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొంటే తప్పేమిటని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీని కలుసుకున్న వైనాన్ని ఉదహరిస్తూ.. 'ప్రధానిని కలుసుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ నాయకుడు అయిపోతాడా? ఒక పార్టీ నాయకులు మరో పార్టీ నాయకులతో కలిసి పర్యటించకూడదని రాజ్యాంగంలో రాసుందా?' అంటూ బాబును ప్రశ్నించారు.

పార్టీ మార్పు నిర్ణయాధికారం అభిమానులదే

భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ, ఏ పార్టీలోకి వెళ్లాలో తన అభిమానులకే వదిలేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తనకు అభిమానులున్నారని, తనపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని అన్నారు. ఎంపీ పదవితో రాజకీయాలను వదిలేసి విశ్రాంతి తీసుకుందామనుకున్న తన తన నిర్ణయాన్ని అభిమానులు వ్యతిరేకించారన్నారు. ముందుగా టీడీపీకి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తానని చెప్పారు. అభిమానులు ఏ పార్టీకి జై కొడితే అదే పార్టీలో చేరతానని స్పష్టం చేశారు.

ఈనాడు వార్తలు సరైనవి కావు

రాజకీయాలంటే త్యాగమని ఎంపీ నాని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నానని ఇటీవల ఈనాడు పత్రికలో రాశారని, అలాంటి వార్తలు సరైనవి కావని అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు రోడ్డు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చానని, ఎమ్మెల్యేతో కలిసి పాల్గొంటే తప్పేమిటని అన్నారు. ఎవరితో కలిసి పాల్గొనాలో ఈనాడే నిర్ణయిస్తుందా అని ప్రశ్నించారు.

'ఐఎస్ఎల్'కు సన్నద్ధం

- ఉమ్మడి జిల్లాలోనే తొలిసారిగా..
- ఈ నెల 17 నుంచి క్రీడా పోటీలు ప్రారంభం
- సిద్ధమవుతున్న విద్యార్థులు
- ఏర్పాట్లలో అధికారులు



పోటీలకు సిద్ధమవుతున్న ఐటీడీఏ క్రీడా పాఠశాల విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోనే తొలిసారిగా నిర్వహించనున్న ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్) క్రీడా పోటీలకు ఉట్నూర్ వేదిక కానుంది. స్థానిక కుమురంభీం ప్రాంగణంలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించే పోటీలకు గాను అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏడు సొసైటీలు..3,199 మంది విద్యార్థులు

రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ఏకలవ్య, మోడల్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఒక్కో సొసైటీ నుంచి 219 బాలురు, 193 బాలికల చొప్పున హాజరుకానున్నారు. మొత్తం 3,199 మంది పాల్గొంటారని అధికారులు వెల్లడించారు. పోటీల నిర్వహణకు 360 మంది రెఫరీలను నియమించినట్లు తెలిపారు.

ఈ విభాగాల్లోనే..

కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, హాకీ, ఫుట్‌బాల్, ఆర్చరీ, చెస్, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బాక్సింగ్, చెస్, క్యారంతో పాటు తైక్వాండో డెమో గేమ్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన మైదానాలను సిద్ధం చేస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా సాధన..

మండల కేంద్రంలోని ఐటీడీఏ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు గెలుపే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. కోచ్‌లు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మెలకువలు నేర్పుతూ పోటీల్లో అత్యుత్తమంగా రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..

ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించే ఐఎస్ఎల్ క్రీడా పోటీల విజయవంతానికి గాను పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచనలతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఇతర జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులు, పీడీలు, కోచ్‌లకు భోజన, వసతి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. అలాగే క్రీడలకు సంబంధించిన మైదానాలను సిద్ధం చేస్తున్నాం.

– దిలీప్‌కుమార్, డీడీ, ఐటీడీఏ ఉట్నూర్

ఉమ్మడి జిల్లాలోనే తొలిసారిగా..

ఉమ్మడి జిల్లాలో ఐఎస్ఎల్ క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి. అట్టహాసంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నాం. అలాగే జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో అత్యుత్తమంగా రాణించేలా తీర్చిదిద్దుతున్నాం.

– పార్థసారథి, జిల్లా క్రీడల అధికారి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



క్రీడాకారులకు సూచనలిస్తున్న జిల్లా క్రీడల అధికారి పార్థసారథి

మన పబ్లిక్ సర్వెంట్

సండే స్పెషల్

- సర్కారు బడిలో చదివి, ఐఏఎస్ అయిన పరికిపండ్ల నరహరి
- మధ్యప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈ కార్యదర్శిగా విధులు
- రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదలకు సేవలు
- ఆలయ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు
- ఆయన పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌వాసి



కృత్రిమ అవయవాలు అందిస్తున్న ఐఏఎస్ నరహరి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఐదుగురు పిల్లల్లో అతను మధ్యవాడు. తండ్రి చిన్నపాటి టైలర్. రోజంతా కష్టపడితే తప్ప పూట గడవని దిగువ మధ్య తరగతి కుటుంబం. విద్య గొప్పతనం తల్లిదండ్రుల నుంచి తెలుసుకున్న ఆ కుర్రాడు తాను ఎలాగైనా ఐఏఎస్ కావాలని నిర్ణయించుకున్నాడు. ఆరోజు నుంచి మొక్కవోని దీక్షతో తన కలను నెరవేర్చుకునేందుకు రాత్రీపగలు శ్రమించాడు. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముందు ఉద్యోగం చేయాలనుకున్నాడు. ఆ కసితోనే పలు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేశాడు. దాంతో ఒకే ఏడాది ఏడు ఉద్యోగాలు రావడం ఆయన ప్రతిభకు నిదర్శనం. అయినా, సంతృప్తి చెందక కొన్ని నెలల్లోనే ఐఏఎస్ సాధించి, చివరికి తన జీవిత గమ్యాన్ని చేరుకున్నారు. ఐఏఎస్‌గా మధ్యప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తూ సమర్థ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సొంత రాష్ట్రం తెలంగాణలో బాల్యంలో తాను ఎదుర్కొన్న కష్టాలు ఇతరులు పడకూడదని భావించి, ఐఏఎస్‌గా ఉంటూనే తన వంతుగా సమాజసేవ చేస్తున్నారు. ఆయనే సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి.

2007లో ఫౌండేషన్ స్థాపన

సమాజంలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదలకు సేవలందించాలన్న ఆశయంతో నరహరి తన మిత్రులతో కలిసి 2007లో ఆలయ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో తొలుత రక్తదాన శిబిరాలతో సేవా కార్యక్రమాలు మొదలయ్యాయి. తలసేమియా రోగులకు నిరంతరం రక్తం అందించేందుకు కృషి చేస్తున్నారు. దివ్యాంగులకు వీల్‌చైర్స్, ట్రైసైకిళ్లు అందిస్తున్నారు. కాళ్లు, చేతులు కోల్పోయిన అభాగ్యులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, కొలతలు తీసుకుంటారు. తర్వాత జైపూర్ నుంచి అవయవాలు తీసుకువచ్చి బాధితులకు అమర్చుతారు. కోవిడ్ సమయంలోనూ వెంటిలేటర్స్, మాస్కులు, ఆక్సిజన్ సిలిండర్లు అందించారు. నరహరి సొంత ఊరు పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లో తన తండ్రి సత్యనారాయణ పేరిట కంటి ఆస్పత్రిని ప్రారంభించారు. ఇక్కడ వైద్య పరీక్షలతోపాటు టెలీ మెడిసిన్ సదుపాయం ద్వారా లక్షలాది మందికి సేవలందించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు నైపుణ్యం పెంచేందుకు స్వర్ణ భారత్ ట్రస్టుతో కలిసి పనిచేస్తున్నారు. ఆయన చొరవను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా పలుమార్లు అభినందించారు.

మధ్యప్రదేశ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ఇటీవల తెలంగాణ ఆవిర్భావ వేడుకలను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో నిర్వహించడంలో ఎంఎస్ఎంఈ కార్యదర్శి నరహరి కీలకపాత్ర పోషించారు. తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ వేడుకలు, చారిత్రక విశిష్టత తెలియజెప్పేలా మధ్యప్రదేశ్ మంత్రుల ఎదుట 1,200 మంది కళాకారులతో పలు కళారూపాలు ప్రదర్శించేలా చూశారు. జూన్ 2న తెలంగాణ, ఢిల్లీ తర్వాత ఈ వేడుకలు ఘనంగా జరిగిన రాష్ట్రంగా మధ్యప్రదేశ్ గుర్తింపు పొందింది. అక్కడి ప్రభుత్వం ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం.. అక్కడే స్థిరపడిన తెలంగాణ ప్రజల మనసు గెలుచుకుంది.



దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ (ఫైల్)

అప్పటి కలెక్టర్ భన్వర్‌లాల్ స్ఫూర్తి



బాల్యంలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో అనేక కష్టాలు అనుభవించాను. స్కూల్ రోజుల్లో కరీంనగర్ కలెక్టర్‌గా భన్వర్‌లాల్ నుంచి ఎంతో స్ఫూర్తి పొందాను. ఆయనలా ఐఏఎస్ కావాలనుకున్నా. ఇంటర్ వరకు సర్కారు చదువే. ఇంజినీరింగ్ హైదరాబాద్ వాసవి కాలేజీలో చదివాను. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. ట్యూషన్లు, పార్ట్‌టైం ఇన్విజిలేటర్‌గా పని చేసేవాడిని. కోటిలో సెకండ్ హ్యాండ్ పుస్తకాలు కొనుక్కొని సివిల్స్ ప్రిపేరయ్యా. 2000లో సివిల్స్ రాసినా ఫెయిలయ్యాను. 2001లో మాత్రం విజయం సాధించా. విద్యతో సాధించలేనిది ఏదీ లేదు. అందుకే, నాలాంటి ఇబ్బందులెవరూ పడకూడదని మిత్రుల సహకారంతో ఆలయ ఫౌండేషన్ ప్రారంభించి, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదలకు సాయపడుతున్నా.

– నరహరి, ఐఏఎస్

అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో నిర్మల్ వాసి

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ పద్యకవి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, సంస్కృతభాషా ప్రచార సమితి, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.వెంకట్ 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు–2024లో పాల్గొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6 తేదీలలో తెలుగు మహాసభలు నిర్వహించారు. వెంకట్ తెలుగు భాషావైభవం శోభాయాత్రలో పాల్గొన్నారు. కథాపఠనంలోపాల్గొని, ఆధ్యాత్మిక, సామాజిక, మానవీయ మూలాలపై ఆసక్తికర కథలు వినిపించారు. మహా కవిసమ్మేళనంలో పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి వైభవంపై పద్యాలను ఆలపించారు. కార్యక్రమ సమన్వయకర్తలు ఎస్సారెస్.కొల్లూరి, కేటీ.పద్మజ, కొత్తగూడెం రాజేశ్, ఎంబీడీ.శ్యామల, శాసనమండలి మాజీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్, జానపద అకాడమీ మాజీ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ, బాలల సంక్షేమ సమితి చైర్మన్ నల్లాని రాజేశ్వరి చేతుల మీదుగా సాహితీపురస్కారం, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న పద్యకవి వెంకట్

కేసీఆర్‌ను కాపాడేదే బీజేపీ

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: మాజీ సీఎం కేసీఆర్, ఆయన కూతురు కవితను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కాపాడుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా రాయికల్‌లో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ చేస్తున్న అవినీతిపై ప్రధాని నరేంద్ర మోదీ ఏనాడూ సీబీఐ విచారణ చేపట్టలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అనుమతులు పరిశీలించి నిధులు ఇవ్వాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో అనుమతులు లేని ప్రాజెక్టుకు నిధులు ఎలా సమకూర్చారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపాలపై పారదర్శకంగా వాస్తవాలను వెలికితీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ విచారణ చేపడుతుందన్నారు. లిక్కర్ స్కామ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆప్ నేత సిసోడియా మొదలు.. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వరకు విచారణ చేపట్టిందని, ఎమ్మెల్సీ కవిత విషయంలో అన్ని ఆధారాలున్నా విచారణ చేపట్టడం లేదని, ఇదే లోపాయికార ఒప్పందానికి నిదర్శనమని తెలిపారు.



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి




వైరల్

టిపు టిపు బర్సా పానీ వానై కురిసింది మనీ

దేశాలకు సరిహద్దులు ఉండవచ్చుగానీ పాటలకు ఉండవు. ఒక పాట సూపర్ డూపర్ హిట్ అయితే అది ఏ దేశం పాట అయినా 'ఇది మన పాటే' అన్నట్లుగా జనాలు ఇష్టపడతారు. దీనికి తాజా ఉదాహరణ ఈ వీడియో. అప్పుడెప్పుడో వచ్చిన అక్షయ్ కుమార్, రవీనా టాండన్ సినిమా 'మొహ్రా'లోని 'టిపు టిపు బర్సా పానీ' పాట ఎంత హిట్టో తెలిసిందే. ఇప్పటికీ ఫంక్షన్‌లలో, పెళ్లి ఊరేగింపులలో ఈ పాట వినిపిస్తూనే ఉంటుంది. ఈ సూపర్ హిట్ సాంగ్‌ను పాకిస్థాన్‌లోని ఒక బృందం డోలక్ వాయిస్తూ పాడుతున్న వీడియో వైరల్ అయింది. పాట పాడుతున్నంత సేపు కాసుల వర్షం కురుస్తూనే ఉంది!



గుడుగుడుమనీ గుర్రమెక్కి నేనొత్త పా నేనొత్త పా

ఫుడ్ డెలివరీ బాయ్ అనగానే బైక్ మీద సర్రున దూసుకుపోయే కుర్రాళ్ల దృశ్యమే కళ్ల ముందు ఉంటుంది. గుర్రం మీద వెళ్లి ఫుడ్ డెలివరీ చేసే దృశ్యం ఊహకు కూడా అందదు. ట్రక్కు డ్రైవర్ల సమ్మె, పెట్రోల్ బంక్‌ల ముందు 'నో స్టాక్'లు కనిపిస్తున్న నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితులలో హైదరాబాద్‌లో జొమాటో బాయ్ ఒకరు హార్స్ రైడింగ్ చేస్తూ ఫుడ్ డెలివరీ చేశాడు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్‌గా మారింది. 'దిస్ ఈజ్ అన్‌బిలీవబుల్... ఇట్స్ జస్ట్ సూపర్బ్' 'అలనాటి రవాణా వ్యవస్థను గుర్తుతెస్తోంది. కాలుష్య నివారణకు ఇది తిరుగులేని మార్గం'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

ప్రౌడ్ మూమెంట్

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల వర్చువల్‌గా ప్రారంభించిన జాల్నా–ముంబై వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు లోకో–పైలట్ అయిన కల్పన ధనవత్ సోషల్ మీడియా అట్రాక్షన్‌గా మారింది. 27 సంవత్సరాల కల్పన ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత అసిస్టెంట్ లోకో–పైలట్‌గా చేరింది. ట్రైన్ ప్రారంభోత్సవ సమయంలో కల్పన సెలబ్రిటీగా మారింది. సెల్‌ఫోన్‌లో ఆమె ఫొటోలు తీసుకోవడానికి ప్రయాణికులు పోటీ పడ్డారు. 'ప్రౌడ్ మూమెంట్: గర్ల్ ఫ్రమ్ ఫూలంబ్రీ బికమ్స్ ది ఫస్ట్ ఉమన్ లోకో–పైలట్ ఆఫ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్' క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. మరోవైపు 'ఎక్స్‌చేంజింగ్ ఆఫ్ సిగ్నల్స్ బిట్వీన్ లోకో– పైలట్ అండ్ అసిస్టెంట్ లోకో – పైలట్ ఆఫ్ జాల్నా–ముంబై ఎక్స్‌ప్రెస్' క్యాప్షన్‌తో రైల్వేశాఖ పోస్ట్ చేసిన కదులుతున్న ట్రైన్ వీడియో కూడా ఆకట్టుకుంటోంది.



ష్... సైలెన్స్ డ్యాన్స్

పెళ్లి బరాత్ (ఊరేగింపు) అనగానే చెవులు చిల్లులు పడే భయానక సౌండ్స్, చుట్టుపక్కల వాళ్లకు కలిగే డిస్ట్రబెన్స్ గుర్తుకు వస్తాయి. అసలు సౌండ్ లేకుండా బరాత్ ఉంటే ఎలా ఉంటుంది? 'అదెలా సాధ్యమండీ?' అనే వాళ్లకు ఈ పెళ్లి బరాతే సమాధానం. ఈ పెళ్లి బరాత్‌లో పాటలు ఉన్నాయి. ధూమ్ ధామ్ డ్యాన్స్‌లు ఉన్నాయి. అయితే అన్నీ సైలెంట్‌గానే. 'డ్యాన్సులంటే సైలెంట్‌గా



చేయవచ్చు. మరి పాటలను ఎలా సైలెంట్‌గా ప్లే చేస్తారు?' అనే డౌట్ రావచ్చు. అసలు విషయమేమిటంటే బరాత్‌లో పాల్గొన్న వారికి హెడ్‌ఫోన్‌లు అందించారు. దీంతో ఎవరి పాటలకు వారు డ్యాన్స్ చేస్తూ ఎంజాయ్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియో వైరల్‌గా మారింది. ఈ సైలెంట్ డిస్కోకు ప్రేరణ హిందీ సినిమా 'ఏ దిల్ హై ముష్కిల్' లోని బ్రేకప్ సాంగ్. 'శబ్ద కాలుష్యంతో భయపెట్టే బరాత్‌లను గుర్తు తెచ్చుకున్నప్పుడు... ఈ వీడియో చూస్తుంటే హాయిగా అనిపించింది. నైస్ ఐడియా' అంటూ నెటిజనులు స్పందించారు.

జమల్ జమలు కుదు... యానిమలు!

'యానిమల్' సినిమాలో బాబీ డియోల్ ఎంట్రీ సాంగ్ 'జమల్ జమలు కుదు' సూపర్‌హిట్ అయింది. ఈ పాటలో ఒక్క ముక్క అర్థం కాకపోయినా యూత్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ పాట యూత్ ఫ్రేవరెట్ రింగ్ టోన్‌గా మారింది. 'జమల్ జమలు కుదు' అనేది 1950 నాటి ఇరానీ పాట. ఇరానీ కవి బిజన్ స్మందర్ ఈ పాట రాశారు. ఖటరెహ్ మ్యూజిక్ గ్రూప్ ట్యూన్ కంపోజ్ చేసింది. తొలిసారిగా 1950లో టెహ్రాన్‌లోని ఖరజెమీ హైస్కూల్‌లో పాడారు. 'జమల్ జమలు కుదు' అంటే ఆంగ్లంలో 'ఓ మై లవ్, మై స్వీట్ లవ్' అని అర్థం. ఈ పాటలో కనిపించిన తనాజ్ దావూది సోషల్ మీడియాలో వైరల్ గర్ల్‌గా మారింది. టెహ్రాన్‌లో పుట్టి పెరిగిన తనాజ్ డ్యాన్సర్, మోడల్. 'యానిమల్' షూటింగ్ సమయంలో తనాజ్ ముంబైలో ఉంది. ఈ పాటకు సంబంధించిన ఓల్డ్ వెర్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'యానిమల్ సినిమాలోని పాట కంటే ఓల్డ్ వెర్షన్ బాగా ఎంజాయ్ చేసే విధంగా ఉంది' అంటూ స్పందిస్తున్నారు నెట్‌లోకవాసులు.




ప్చ్... ఒక్కరూ గుర్తుపట్టలేదు!

సినిమా లేదా టీవీలో నటించే చిన్న ఆర్టిస్ట్ కనిపించినా జనాలు చుట్టుముట్టి ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటారు. అలాంటిది ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉన్న ఆర్టిస్ట్ కనిపిస్తే? 'జనాలను అదుపు చేయడం కష్టం' అనుకుంటాం గానీ పాప్ సెన్సేషన్ దువా లిపా విషయంలో మాత్రం అలా జరగలేదు. సాధారణ పర్యాటకురాలిగా దువా ఇటీవల రాజస్థాన్‌కు వచ్చింది. సాదాసీదాగా రోడ్లమీద నడుచుకుంటూ వెళుతున్న దువా లిపాను ఒక్కరు కూడా గుర్తు పట్టలేదు. తాను రాజస్థాన్‌లో ఉన్నప్పటి ఫొటోలను ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేస్తే వైరల్ అయ్యాయి. 'ఎంత మిస్ అయ్యాను. విషయం ముందే తెలిస్తే రెక్కలు కట్టుకొని అక్కడ వాలేవాళ్లం' అంటూ అభిమానులు భారీగా స్పందించారు. గ్రామీ అవార్డ్–విన్నింగ్ ఆర్టిస్ట్, గ్లోబల్ స్టార్ స్టేటస్ ఉన్న దువా లిపా మాత్రం తనను ఎవరూ గుర్తించకపోవడాన్ని పెద్ద విషయం అనుకోవడం లేదు.



ముగ్గు ముచ్చట

29 చుక్కలు, 1 వచ్చే వరకు, సరి చుక్క





అరుణమ్మ
తాండూర్, వికారాబాద్





ఎం. పద్మావతి
కొత్తపేట, తెనాలి

15 చుక్కలు, 15 వరుసలు



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

హెల్త్



చిన్నపిల్లల చర్మం చాలా కోమలంగా ఉంటుంది. చలికాలంలో వారి చర్మం పొడిబారడంతో అనేక సమస్యలు వస్తాయి. మొదటే మృదువైన చర్మం. దానికి తోడు చలికాలంలో పొడిబారి పగలడం, చిట్లడం వంటి అనర్థాలు చోటు చేసుకుంటాయి. వైద్యపరిభాషలో ఈ సమస్యను 'అటోపిక్ డర్మటైటిస్' అంటారు. ఈ సీజన్‌లో నెలల పిల్లలు మొదలు... ఎదిగిన పిల్లల్లోనూ అనేక వయసు చిన్నారులలో కనిపించే అటోపిక్ డర్మటైటిస్ సమస్యలు, వాటికి పరిష్కారాలను తెలిపే కథనమిది.

అటోపిక్ డర్మటైటిస్
చిన్నారుల చర్మ రక్షణ ఇలా!

అటోపిక్ డర్మటైటిస్‌లో మొదట్లో చర్మం పొడిబారి, దురదతో ఎర్రగా మారుతుంది. పిల్లలు ఆ ప్రాంతంలో పదే పదే గీరుతుండటంతో చర్మం కాస్త మందంగా మారుతుంది. ఇలా కావడాన్ని 'లైకెనిఫికేషన్' అంటారు. ఇది జరిగాక దురద ఇంకా పెరుగుతుంది. దాంతో మరీ ఎక్కువగా గీరడం, దేనికైనా రాస్తుండటంతో చర్మం మరింత మందమవుతుంది. ఈ ప్రక్రియలు ఒకదాని తర్వాత మరొకటి ఒక సైకిల్‌లా (ఇచ్ అండ్ స్క్రాచ్ సైకిల్) సాగుతుంటాయి. కొందరిలో ఇదొక దీర్ఘకాలిక సమస్య (క్రానిక్)గా కూడా మారవచ్చు.

ఎందుకిలా జరుగుతుందంటే... చలికాలంలో చెమ్మ (తేమ) ఇగిరిపోతూ ఉండటంతో చర్మం పొడిబారడం అందరికీ అనుభవంలోకి వచ్చే విషయమే. ఇలాంటప్పుడు చర్మం పొడిబారి, ఎర్రబారుతుంది. కుటుంబ ఆరోగ్య చరిత్రలో ఆస్తమా, డస్ట్ అలర్జీలు ఉండేవారిలో అటోపిక్ డర్మటైటిస్ సమస్య ఎక్కువ.

వివిధ వయసుల పిల్లల్లో అటోపిక్ డర్మటైటిస్ తీవ్రత ఇలా...

రోజుల పిల్లల నుంచి 12 నెలల వరకు... ఈ వయసు పిల్లల్లో చర్మం ఎర్రబారడం ప్రధానంగా ముఖం పైన, మెడ దగ్గర కనిపిస్తుంటుంది. అయితే కొందరిలో దేహంలోని ఏ ప్రాంతంలోనైనా ఇలా జరిగే అవకాశముంది. ఉదాహరణకు పాకే పిల్లల్లో వాళ్ల మోకాళ్లు నేలకు ఒరుసుకుపోతుండటం వల్ల మోకాళ్ల దగ్గర ఎటోపిక్ డర్మటైటిస్ కనిపిస్తుంటుంది.

ఏడాది నుంచి రెండేళ్ల పిల్లల్లో... ఈ వయసు పిల్లల్లో అటోపిక్ డర్మటైటిస్‌తో చర్మం ప్రభావితం కావడమన్నది చర్మం ముడతలు పడే ప్రాంతాల్లో ఎక్కువ. అంటే... మోచేతులు, మోకాళ్ల వెనక భాగం, మెడ పక్క భాగాలు, ముంజేయి, పిడికిలి, మడమ వంటి ప్రాంతాల్లో అన్నమాట.

ఈ వయసు పిల్లల్లో చర్మం ముడుత వద్ద ఒక గీతలా (స్కిన్‌లైన్) ఉన్నచోట్ల దురద వచ్చి, అది పగులు బారుతున్నట్లవుతుంది.

రెండు నుంచి ఆరేళ్ల పిల్లల్లో... ఈ వయసు పిల్లల్లో చర్మం పొడిబారడం కాస్త ఎక్కువ. పైగా ఈ పొడిబారడమన్నది మోకాళ్ల కింది భాగంలో ఎక్కువ. అందుకే ఈ వయసు పిల్లల కాళ్లు... పొడిబారినప్పుడు బయట ఆడి వచ్చినట్లుగా తెల్లగా కనిపిస్తుంటాయి. ముఖం పెద్దగా పగలదు. కానీ... పెదవులు పొడిబారి, పగుళ్లలాగా వస్తుంది. పెదవుల చుట్టూ చర్మమంతా పగుళ్లుబారి ఓ సరిహద్దులా స్పష్టంగా కనిపిస్తూ, ఆ భాగం మంట పుడుతుంటుంది. దీన్ని 'పెరీ–ఓరల్ దర్మటైటిస్' అంటారు.

ఏడు నుంచి పద్నాలుగేళ్ల పిల్లల్లో... ఏడేళ్ల వయసు నుంచి (అంతకంటే తక్కువ వయసు పిల్లలతో పోలిస్తే) పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి క్రమంగా పెరుగుతూ పోతుంటుంది. కాబట్టి ఈ వయసునుంచి లక్షణాల తీవ్రత క్రమంగా తగ్గుతూ పోతుంది. అయితే ఈ వయసు పిల్లల్లోనూ చర్మం పొడిబారుతుంది. ఈ సమస్యలతో పాటు కొందరిలో సైనసైటిస్ కూడా ఉండవచ్చు.

లక్షణాలు...

- చర్మం పొడిబారి దురదలు వచ్చాక గుల్లలు, నీటిగుల్లలూ రావచ్చు.
- ఎర్రబారినచోట చర్మం పొట్టు కట్టినట్లు అవుతుంది. మందంగానూ (లైకెనిఫికేషన్) మారుతుంది.
- కొన్నిసార్లు కాస్తంత పొట్టు రాలడంతోపాటు అక్కడ గాటు కూడా పడవచ్చు.
- మందంగా తెట్టుకట్టిన చర్మం పైపొర లేచిపోయినప్పుడు అక్కడ ద్రవం ఊరుతుండవచ్చు (ఊజింగ్).
- ఈ దశలోనూ చికిత్స అందకపోతే సెకండరీ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశముంది.

చికిత్స / మేనేజ్‌మెంట్

- **తొలి దశ చికిత్స (ఫస్ట్ లైన్ ట్రీట్‌మెంట్):** అటోపిక్ డర్మటైటిస్ ఉన్న పిల్లలకు తొలి దశల్లో చికిత్స చాలా తేలిక. చర్మంపై పొడిదనాన్ని తగ్గించడానికి వైట్ పెట్రోలియమ్ జెల్లీ, లిక్విడ్ పారఫీన్ ఆయిల్ వంటివి రాస్తే చేస్తే చాలు. పగుళ్లు, దురద, పొడిదనం తగ్గుతాయి. దాంతో గీరుకోవడం తగ్గుతుంది. రాత్రి నిద్రపడుతుంది.
- **అలర్జీని ప్రేరేపించే అంశాలను నివారించడం :** సబ్బులు, డిటర్జెంట్లు... అలర్జీని ప్రేరేపిస్తున్నాయా అన్నది చూసుకోవాలి. అలా జరుగుతుంటే... సబ్బులను, డిటర్జెంట్లను మార్చాలి.
- ఘాటైన సబ్బులకు బదులు మైల్డ్‌గా ఉండే క్లెన్సర్స్‌తో శుభ్రం చేసుకోవాలి.
- పిల్లల్ని పెంపుడు జంతువులకు దూరంగా ఉంచాలి.
- పిల్లల్లో అలర్జీ కలిగించే ఆహారాన్ని గుర్తించి (ముఖ్యంగా నట్స్, సీ ఫుడ్), ఒకవేళ ఆ ఆహారాలతో అలర్జీ వస్తుంటే వాటి నుంచి దూరంగా ఉంచాలి.

వెట్ ర్యాప్ టెక్నిక్...

అటోపిక్ డర్మటైటిస్ తీవ్రత ఎక్కువగా ఉంటే 'వెట్ ర్యాప్ టెక్నిక్'తో మంచి ఫలితాలుంటాయి. చర్మమంతా పగుళ్లు ఉన్న పిల్లలకు మొదట ఎమోలియెంట్స్ పూయాలి. ఆ తర్వాత ఒంటిపైన బ్యాండేజ్‌ను ఒక పొరలా కట్టి, దాన్ని గోరువెచ్చని నీటితో తడపాలి. దానిపైన మరో పొరలా పొడి బ్యాండేజ్ వేయాలి. ఇలా వేసిన బ్యాండేజీని ప్రతి పన్నెండు గంటలకు ఒకమారు మార్చాలి. దీన్నే వెట్... ర్యాప్ టెక్నిక్ అంటారు. దీంతో అటోపిక్ డర్మటైటిస్ తీవ్రతను తగ్గించవచ్చు.

- **పూత మందులతో చికిత్స :** పిల్లలకు ఎమోలియెంట్స్ అని పిలిచే... లిక్విడ్ పారఫీన్, గ్లిజరిన్, మినరల్ ఆయిల్ వంటివి పూయడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. స్నానం చేయించిన వెంటనే ఎమోలియెంట్స్ పూయాలి.
- తీవ్రత ఎక్కువగా ఉన్న పిల్లల్లో ఎమోలియెంట్స్ పూశాక వాటిపైన పూతమందుగా వాడే స్టెరాయిడ్స్ కూడా వాడవచ్చు. పైపూతగా వాడే స్టెరాయిడ్స్‌ను ఎక్కువ రోజులు వాడకుండా ఉండేందుకు టాపికల్ క్యాల్సిన్యూరిన్ ఇన్హిబిటర్ క్రీమ్ వాడవచ్చు.
- డాక్టర్ల సలహా మేరకు పైపూత యాంటీబయాటిక్, స్టెరాయిడ్ కాంబినేషన్స్‌ను వాడవచ్చు.
- **నోటిద్వారా తీసుకోవాల్సిన మందులు:**
- నిద్రకు ముందు డాక్టర్ సలహా మేరకు నాన్ సెడెటివ్ యాంటీహిస్టమైన్స్ కూడా ఇవ్వాల్సి రావచ్చు.
- ఇన్ఫెక్షన్ ఎక్కువగా ఉంటే యాంటీబయాటిక్స్ కూడా ఇవ్వాల్సి రావచ్చు.
- **రెండో దశ చికిత్స :** మొదటిదశ చికిత్స (ఫస్ట్‌లైన్ ట్రీట్‌మెంట్)తో అంతగా ఫలితం లేనప్పుడు స్టెరాయిడ్ డోస్ పెంచడమూ, అప్పటికీ గుణం కనిపించకపోతే ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాల్సి రావచ్చు.

అల్ట్రా వయొలెట్ రేడియేషన్ చికిత్స : కొంతమంది పిల్లలకు అల్ట్రావయొలెట్ బి–కిరణాలతో చికిత్సతో మంచి ఫలితాలు వస్తాయి.

- **మూడో దశ చికిత్స (థర్డ్ లైన్ ట్రీట్‌మెంట్):** నోటిద్వారా కార్టికోస్టెరాయిడ్స్ ఇవ్వడం లాంటి ఈ థర్డ్ లైన్ ట్రీట్‌మెంట్ అంతా పూర్తిగా డాక్టర్ సలహా మేరకు మాత్రమే జరగాలి.



డా॥ స్వప్నప్రియ,
సీనియర్ డర్మటాలజిస్ట్

టినైటస్‌తో చెవిలో హోరు !

చెవి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నట్టుగా చెవిలోనో లేదా తలలోనో గుయ్‌య్‌య్ మంటూ హోరు. ఇలా గుయ్‌మంటూ శబ్దం వినిపించడాన్ని వైద్య పరిభాషలో దీన్ని 'టినైటస్' అంటారు. ప్రజల్లో ఇదెంత సాధారణమంటే... ప్రపంచవ్యాప్తంగా జనాభాలో 16 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. మనదేశంలోనూ 'టినైటస్' బాధించే జనాల సంఖ్య తక్కువేమీ కాదు. అన్ని వయసుల వారినీ వేధిస్తూ లక్షలాది మందిని బాధించే ఈ సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం.



టినైటస్‌తో చెవిలో లేదా తలలో హోరున శబ్దం అదేపనిగా వినిపిస్తున్నప్పుడు నొప్పి కంటే... దాన్ని విడిపించుకోలేకపోవడంతో విసుగుతో కూడిన నిస్పృహ వేధిస్తుంది. కొందరిలో ఇది గర్జన అంతటి తీవ్రంగా కూడా వినిపిస్తుండవచ్చు. కొందరిలో ఎడతెగకుండా వినిపిస్తున్నప్పటికీ... మరికొందరిలో మాత్రం వస్తూ, పోతూ ఉండవచ్చు. ఇలా వస్తూపోతూ వినిపిస్తుండే హోరును 'పల్సేటింగ్ టినైటస్' అంటారు. దీని వల్ల ప్రాణాపాయం లేకపోయినప్పటికీ.. దేనిమీద ఏకాగ్రతా, దృష్టీ నిలపలేకపోవడం, నిద్రపట్టకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. దాంతో నిరాశా నిస్పృహలకూ, తీవ్రమైన యాంగ్జైటీకి గురయ్యే అవకాశముంది.

ఎందుకిలా జరుగుతుందంటే...

ఈ కింది అంశాలు టినైటస్‌కు దోహదపడవచ్చు లేదా అవి ఈ సమస్యను తీవ్రతరం చేసే అవకాశమూ ఉంది. అవి...

- చెవిలో పేరుకుపోయే గులివి లేదా చెవిలో ఇన్ఫెక్షన్
- దీర్ఘకాలంపాటు బయట ఏదైనా హోరుకు అదేపనిగా ఎక్స్‌పోజ్ కావడం
- వినికిడి తగ్గడం / వినికిడి సమస్యలు
- ఇంకేమైనా మందులు తీసుకుంటూ ఉండటంతో వాటి దుష్ప్రభావంగా.
- తలలో లేదా మెదభాగంలో ఎక్కడైనా గాయాలు కావడం.
- దీర్ఘకాలపు అనీమియా, డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలు, మైగ్రేన్ వంటి తలనొప్పులు.

ముప్పుగా పరిణమించే అంశాలు...

సాధారణంగా టినైటస్ ప్రాణాపాయం కాకపోయినా, కొన్ని సందర్భాల్లో అది తీవ్రమైన ముప్పు తెచ్చిపెట్టే అంశంగా పరిణమించే ప్రమాదం ఉంది. ఆ ముప్పులేమిటంటే...

- నిటారుగా నిల్చోలేక, ఎటో ఓ పక్కకు తూలిపోయే బ్యాలెన్సింగ్ సమస్య రావడం.
- వినికిడి సమస్యలు వస్తూపోతూ ఉన్నప్పుడు లేదా తీవ్రమైన వినికిడి సమస్య ఉత్పన్నమైనప్పుడు.

ఇలాంటి సందర్భాల్లో వెంటనే ఈఎన్‌టీ నిపుణులను కలిసి, తమకు మీనియర్స్ డిసీజ్ (కళ్లు తిరుగుతుండే లక్షణాలతో కూడిన లోపలి చెవిని ప్రభావితం చేసే వర్టిగో లాంటి వైద్య సమస్య), అకాస్టిక్ న్యూరోమా (ఒక రకం నరాల సమస్య) వంటి జబ్బులేవీ లేవని నిర్ధారణ చేసుకోవడం అవసరం.

నిర్ధారణ.. దీని లక్షణాలు కొన్ని ఇతర సమస్యలతోనూ పోలుతున్నందువల్ల దీన్ని జాగ్రత్తగా, ఖచ్చితంగా నిర్ధారణ చేయడమన్నది చాలా కీలక అంశం. టినైటస్ నిర్ధారణకు ఈఎన్‌టీ నిపుణులు రకరకాల పరీక్షలు చేస్తుంటారు. వాటిలో కొన్ని...

- **బాధితుల వైద్య చరిత్ర :** వీరి మెడికల్ హిస్టరీని సునిశితంగా పరిశీలించడం. అంటే వారికి వినిపిస్తున్న శబ్దాలు ఎలాంటివి, మునుపు తల, మెడ వంటి చోట్ల ఏమైనా గాయాలయ్యాయా, ఇతరత్రా ఏమైనా వైద్యసమస్యలున్నాయా వంటి అంశాలని పరిశీలిస్తారు.
- **వినికిడి పరీక్షలు :** వినికిడి లోపం ఏదైనా ఉందా, ఉంటే ఏమేరకు వినికిడి కోల్పోయారు వంటి అంశాలు.
- **ఇమేజింగ్ పరీక్షలు :** కొన్ని సందర్భాల్లో ఎమ్మారై, సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలు నిర్వహించి, చెవిలో లేదా మెదడులో ఏమైనా మార్పులు వచ్చాయా అని పరిశీలించడం.

చికిత్స / మేనేజ్‌మెంట్...

అన్ని రకాల వైద్యపరీక్షల తర్వాత... ఒకవేళ చెవిలో గులివి లేదా చెవి ఇన్ఫెక్షన్‌తో ఈ సమస్య వచ్చినట్టు గుర్తిస్తే ఆ మేరకు గులివిని క్లీన్ చేయడం లేదా చెవి ఇన్ఫెక్షన్ తగ్గించేందుకు అవసరమైన మందులు వాడాలి. ● ఎమ్మారై / సీటీ స్కాన్ వంటి పరీక్షల్లో మెదడులోగానీ, చెవిలోగాని గడ్డలు లేవని తేలితే... అక్కడ టినైటస్‌కు ఉన్న కారణాలనూ, బాధితులపై ప్రభావాలను బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది. అంటే ఉదాహరణకు బాధితుల్లో తీవ్రమైన యాంగ్జైటీ ఉన్నప్పుడు టినైటస్‌ను తగ్గించే మందులతో పాటు, యాంటీ యాంగ్జైటీ మందుల్ని వాడాలి. కొన్నిసార్లు ఓరల్ స్టెరాయిడ్స్ లేదా అవసరాన్ని బట్టి ఇంట్రా టింపానిక్ స్టెరాయిడ్ ఇంజెక్షన్‌లూ, కొన్ని రకాల హియరింగ్ ఎయిడ్స్ వంటివి వాడాల్సి రావచ్చు.



డా॥ సంపూర్ణ ఘోష్,
కన్సల్టెంట్
ఈఎన్‌టీ సర్జన్

పిల్లల్లో ఆస్తమా నివారణకు...

ఇప్పుడున్న చలి వాతావరణం కొందరు పిల్లల్లో ఆస్తమాను ప్రేరేపించవచ్చు. చిన్నవయసులోనే నివారిస్తే, పెద్దయ్యాక ఆస్తమా బారినపడే అవకాశం తగ్గుతుంది. అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివే...

- పిల్లలకు ఇచ్చే ఆహారంలో వరి అన్నంతో పాటు పాలకూర, కాకరకాయ, గుమ్మడికాయ, కూర అరటి వంటి వెజిటబుల్స్‌తో వండిన కూరలూ... అలాగే మొలకెత్తిన గింజలు, రాగులు, సజ్జలు వంటి పొట్టుతో ఉన్న చిరుధాన్యాలతో చేసిన తిరుతిండ్లు తప్పక తినిపించాలి
- వంటలో వెల్లుల్లి, ఉల్లి, ఆలివ్ ఆయిల్ వంటివి వాడాలి.
- ధనియాలు, లవంగం, దాల్చిన చెక్క, ఏలకులు, జీలకర్ర, అల్లం, పసుపు, అల్లం, మిరియాల పొడి వంటి సహజ మసాలా దినుసుల్లో ఆస్తమానూ, దాని తీవ్రతను తగ్గించే గుణం ఉంటుంది కాబట్టి వాటిని తగినంతగా వాడుతుండాలి.
- కిస్‌మిస్, బాదం, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ తినిపిస్తుండాలి.
- పండ్లలో బెర్రీ పండ్లు, బొప్పాయి, ఆపిల్ వంటివి ఇస్తుండాలి.
- తీసుకోకూడని వాటి విషయానికి వస్తే... ఆహారంలోని కృత్రిమ రంగులు, ప్రిజర్వేటివ్స్, బ్రెడ్స్, కూల్‌డ్రింక్స్‌లలో వాడే పలు పదార్థాలు ఆస్తమాను ప్రేరేపిస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటమే మేలు.





స్పిన్ పిచ్‌లే సిద్ధం చేస్తే...

ఇంగ్లండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం భారత జట్టు అన్నీ స్పిన్ పిచ్‌లే తయారు చేస్తుందని భావించడం లేదని ఆ జట్టు సీనియర్ ఆటగాడు జానీ బెయిర్‌స్టో అభిప్రాయ పడ్డాడు. ప్రస్తుతం భారత పేస్ బౌలింగ్‌దళం చాలా పటిష్టంగా ఉందని, అన్నీ స్పిన్ పిచ్‌లే ఉంటే వారి ప్రభావం తగ్గిపోతుందని అతను అన్నాడు. భారత్‌లో జరిగిన గత సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లలో బెయిర్‌స్టో మూడు సార్లు డకౌటయ్యాడు. సిరీస్‌లో మాకు వేర్వేరు తరహాలో పిచ్‌లు ఎదురవడం ఖాయం. అయితే అన్నీ టర్న్ కాకపోవచ్చు. వారి పేస్ బౌలింగ్ ఇటీవల ఎలా ఉందో మేం చూస్తున్నాం. ఇప్పుడు పేస్ కూడా వారి బలం కాబట్టి తొలి రోజునుంచే టర్న్ అయ్యే పిచ్‌లు తయారు చేయకపోవచ్చు. అయితే ఎలా ఉన్నా పరిస్థితులకు తగినట్లుగా మా బ్యాటింగ్‌ను మార్చుకునేందుకు మేం సిద్ధంగా ఉండాలి. అశ్విన్, జడేజా, అక్షర్... ఇలా బౌలర్ ఎవరైనా కావచ్చు, మేం అతిగా ఆలోచించడం లేదు. గత సిరీస్‌లో చెన్నైలో మేం కూడా టెస్టు మ్యాచ్ గెలిచామనే సంగతి మరచిపోవద్దు' అని బెయిర్‌స్టో చెప్పాడు. 2021లో జరిగిన సిరీస్‌ను భారత్ 3-1తో సొంతం చేసుకుంది.



వార్నర్ గుడ్ బై

ఘనంగా వీడ్కోలు

- టెస్టు క్రికెట్‌నుంచి తప్పుకున్న ఓపెనర్
- చివరి టెస్టులో 8 వికెట్లతో ఓడిన పాక్
- 3-0తో సిరీస్ ఆసీస్ సొంతం

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై పాకిస్తాన్ పరాజయం పరిపూర్ణమైంది. పేలవమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన పాక్ మూడో టెస్టులోనూ ఓటమిపాలైంది. శనివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌నుంచి తప్పుకున్న ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన సొంత మైదానంలో కుటుంబ సభ్యుల మధ్య విజయంతో వీడ్కోలు పలికాడు. ఓవర్‌నైట్ స్కోరు 68/7తో నాలుగో రోజు ఆట కొనసాగించిన పాకిస్తాన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 115 పరుగులకు ఆలౌటైంది. రిజ్వాన్ (28) కొద్ది సేపు పోరాడాడు. ఆసీస్ బౌలర్లలో హాజల్‌వుడ్ 4, లయన్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 130 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 25.5 ఓవర్లలో విజయాన్ని అందుకుంది. 2 వికెట్లు కోల్పోయి ఆ జట్టు 130 పరుగులు చేసింది. లబుషేన్ (62 నాటౌట్), డేవిడ్ వార్నర్ (57 నాటౌట్) అర్ధ సెంచరీ సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 119 పరుగులు జత చేశారు. పాక్ పేసర్ ఆమిర్ జమాల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవగా...ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. ఆస్ట్రేలియాపై పాక్ జట్టుకు టెస్టుల్లో ఇది వరుసగా 17వ ఓటమి కావడం విశేషం! 1999నుంచి ఇక్కడ ఆడిన అన్ని టెస్టుల్లోనూ ఆ జట్టు ఓడింది. తాజా గెలుపుతో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (56.25 పాయింట్ల శాతం)తో మళ్లీ అగ్రస్థానానికి చేరుకోగా, భారత్ (54.16 పాయింట్ల శాతం) రెండో స్థానానికి పడిపోయింది.

టెస్టు నంబర్ 2020... వార్నర్ తొలి మ్యాచ్ ఇది. టి20 స్పెషలిస్ట్‌గా వెలుగులోకి వచ్చి ఆ తర్వాత ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ టెస్టు ఓపెనర్లలో ఒకడిగా కెరీర్‌ను ముగించిన ఘనత వార్నర్ సొంతం. దేశవాళీలో దూకుడైన ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకొని ఒక్క ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడకుండానే జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్లేయర్‌గా వార్నర్ పరిచయమయ్యాడు. టి20 శైలితో టెస్టులు ఆడి వార్నర్ ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 8 వేలకు పైగా పరుగులు సాధించిన బ్యాటర్లను చూస్తే స్ట్రయిక్‌రేట్‌లో సెహ్వాగ్ తర్వాత వార్నర్‌దే రెండో స్థానం. ఆస్ట్రేలియా తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసినవారిలో వార్నర్ ఐదో స్థానంలో నిలవగా, ఓపెనర్ల జాబితాలో అతనిదే అగ్రస్థానం కావడం విశేషం. 13 మంది వేర్వేరు భాగస్వాములతో కలిసి ఓపెనింగ్ చేసిన వార్నర్ తమ జట్టుకు శుభారంభం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. తన తొలి టెస్టునుంచి వరుసగా ఏడేళ్ల పాటు వార్నర్ బెస్ట్ ఓపెనర్‌గా ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. 2018లో వచ్చిన బాల్ టాంపరింగ్ వివాదం అతని కెరీర్‌లో పెద్ద మరక. అయితే ఏడాది నిషేధం తర్వాత పునరాగమనంలోనూ సత్తా చాటి తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. పాకిస్తాన్‌పై చేసిన 335 పరుగులు ఆసీస్ తరఫున రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు. కెరీర్ చివర్లో వరుస వైఫల్యాలతో టీమ్‌లో చోటు దక్కించుకుంటాడో లేదో అనిపించినా...అతని సాధించిన ఘనతలను దృష్టిలో ఉంచుకొని ఆసీస్ బోర్డు వార్నర్ కోరిక ప్రకారం సొంత మైదానంలో రిటైర్మెంట్‌కు అవకాశం కల్పించింది. ఇప్పుడు విజయంతో ఘనంగా అతను టెస్టులకు వీడ్కోలు పలికాడు.

టెస్టు కెరీర్: 112 మ్యాచ్‌లలో 44.59 సగటుతో 8786 పరుగులు – 26 సెంచరీలు, 37 అర్ధసెంచరీలు.

కెప్టెన్‌గా ఇబ్రహీమ్ జద్రాన్

భారత్‌తో సిరీస్‌కు అఫ్గన్ టి20 జట్టు



ముంబై: భారత్‌తో తొలి ద్వైపాక్షిక టి20 సిరీస్‌లో పాల్గొనే తమ జట్టును అఫ్గనిస్తాన్ ప్రకటించింది. 19 మంది సభ్యుల ఈ టీమ్‌కు ఇబ్రహీమ్ జద్రాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రెగ్యులర్ టి20 కెప్టెన్, స్టార్ బౌలర్ రషీద్ ఖాన్‌ను కూడా ఈ జట్టులోకి ఎంపిక చేశారు. అయితే వెన్నుగాయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రషీద్ కనీసం మరో పది రోజుల తర్వాత గానీ బౌలింగ్ చేసే అవకాశం కనిపించడం లేదు. భారత్, అఫ్గన్ మధ్య ఈ నెల 11, 14, 17 తేదీల్లో మొహాలి, ఇండోర్, బెంగళూరులలో 3 టి20లు మ్యాచ్‌లు జరుగుతాయి.

జట్టు వివరాలు: ఇబ్రహీమ్ జద్రాన్ (కెప్టెన్), హజ్రతుల్లా, గుర్బాజ్, రహ్మత్, నజీబుల్లా, ఇక్రామ్, నబీ, అజ్మతుల్లా, కరీమ్, గుల్బదిన్, షరాపుద్దీన్, ముజీబ్, రషీద్, నూర్, ఖైస్, ఫారుఖీ, నవీన్, సలీమ్, ఫరీద్.

సెమీస్‌లో ఓడిన యూకీ జోడి

బ్రిస్బేన్: ఏటీపీ టోర్నమెంట్ బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. యూకీ (భారత్) – రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జంట సెమీస్‌లో 3-6, 7-6, 9-11 స్కోరుతో లాయిడ్ గ్లాస్‌పూల్ (ఇంగ్లండ్) – జీన్ జూలియాన్ (నెదర్లాండ్స్) ద్వయం చేతిలో ఓటమిపాలైంది. గంటా 40 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ యూకీ-హాస్ రెండో సెట్ గెలిచినా...చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయారు.



హర్మన్

టిటాస్

సిరీస్ విజయమే లక్ష్యంగా...

- రెండో టి20 బరిలో భారత మహిళలు
- నేడు ఆస్ట్రేలియాతో పోరు
- సా.గం.7.00 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్షప్రసారం

ముంబై: వన్డే సిరీస్ వైఫల్యాన్ని అధిగమించి తొలి టి20లో ఆస్ట్రేలియా మహిళలపై ఘన విజయం సాధించిన భారత జట్టు ఇప్పుడే అదే ఊపులో సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది. గత మ్యాచ్ ఇచ్చిన ఉత్సాహంతో హర్మన్‌ప్రీత్ సేన బరిలోకి దిగుతోంది. మరో వైపు సాధారణ బ్యాటింగ్‌తో ఓటమిని ఆహ్వానించిన ఆస్ట్రేలియా కోలుకొని సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. యువ పేసర్ టిటాస్ సాధు అద్భుత బౌలింగ్ ప్రదర్శన తొలి మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. 19 ఏళ్ల ఈ బెంగాలీ పేసర్ మరోసారి తన జోరును ప్రదర్శిస్తే ఆసీస్‌కు కష్టాలు తప్పవు. శ్రేయాంక, దీప్తిల ఆటతో డీవై పాటిల్ స్టేడియంలో స్పిన్నర్ల ప్రభావం కూడా బాగా కనిపించింది. పేసర్లు రేణుక, పూజ కూడా ఆకట్టుకున్నారు. బ్యాటింగ్‌లో షఫాలీ, స్మృతి మరో బ్యాటర్‌కు అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించారు. ఫామ్ కోల్పోయి చివరి రెండు వన్డేల్లో తుది జట్టులో అవకాశం లభించని షఫాలీ తాను ఎంత కీలకమో తొలి టి20 పోరులో చూపించింది. స్మృతి కూడా చాలా కాలం తర్వాత తన స్థాయికి తగ్గ ఆటతీరుతో అలరించింది. జెమీమా, హర్మన్ కూడా చెలరేగితే బ్యాటింగ్‌లో తిరుగుండదు. జట్టుపరంగా చూస్తే ముఖ్యంగా వన్డేలతో పోలిస్తే ఫీల్డింగ్ జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మరో వైపు ఆస్ట్రేలియా జట్టు అనూహ్య రీతిలో తడబడింది. టి20ల్లో దాదాపు నాలుగేళ్ల తర్వాత ఆ జట్టు ఆలౌట్ కావడం భారత బౌలర్ల పైచేయిని చూపించింది. సీనియర్ బ్యాటర్లు ఉన్న టాప్-5లో పెరీ మినహా అంతా విఫలమయ్యారు. అయితే హీలీ, మూనీ, తహీలా, గార్డ్‌నర్ రాణిస్తే జట్టు భారీ స్కోరు చేయగలుగుతుంది. వన్డే సిరీస్‌లో అద్భుత ఆటను చూపించిన లిచ్‌ఫీల్డ్ టి20 మ్యాచ్‌లో కూడా సత్తా చాటడం ఆసీస్‌కు సానుకూలాంశం. ఆమె ఆడిన కొన్ని చక్కటి షాట్లు లిచ్‌ఫీల్డ్ సామర్థ్యాన్ని చూపించాయి. గత మ్యాచ్‌లో పూర్తిగా కట్టు తప్పిన ఆసీస్ బౌలింగ్ ఈ సారి ఎంత ప్రభావం చూపిస్తుందనేది ఆసక్తికరం.

టైటాన్స్‌కు తొమ్మిదో ఓటమి



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పేలవ ప్రదర్శన ఇంకా కొనసాగుతూనే ఉంది. పది మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు శనివారం తొమ్మిదో పరాజయాన్ని మూటగట్టుకుంది. గుజరాత్ జెయింట్స్ 37-30 పాయింట్ల తేడాతో టైటాన్స్‌ను ఓడించింది. టైటాన్స్ తరఫున పవన్ సెహ్రావత్ 8, సంజీవి 7 పాయింట్లు సాధించగా...గుజరాత్ ఆటగాళ్లలో రాకేశ్ 10, దీపక్ సింగ్ 9 పాయింట్లు నమోదు చేశారు. అంతకు ముందు జరిగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 41-31 స్కోరుతో యు ముంబాపై గెలుపొందింది. జైపూర్ ఆటగాళ్లలో అర్జున్ దేశ్వాల్ 17 పాయింట్లతో స్టార్‌గా నిలవగా...అజిత్ 6, అంకుశ్ 5 పాయింట్లు సాధించారు. ముంబా తరఫున గుమాన్ సింగ్ 13 పాయింట్లు రాబట్టడం విశేషం.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	9	8	1	0	41
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
దబంగ్ ఢిల్లీ	10	6	3	1	35
యు ముంబా	9	6	3	0	31
పట్నా పైరేట్స్	10	5	5	0	28
హరియాణా స్టీలర్స్	9	5	4	0	26
బెంగళూరు బుల్స్	11	4	7	0	26
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	10	1	9	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

లంక, జింబాబ్వే వన్డే రద్దు

కొలంబో: శ్రీలంక, జింబాబ్వే మధ్య శనివారం జరిగిన తొలి వన్డే వర్షం కారణంగా రద్దయింది. ముందుగా లంక 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. చరిత్ అసలంక (95 బంతుల్లో 101; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించగా...కుశాల్ మెండిస్ (46), సమరవిక్రమ (41) రాణించారు. అనంతరం జింబాబ్వే 4 ఓవర్లలో 2 వికెట్లకు 12 పరుగులు చేసింది. వర్షం రాగా మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.

హైదరాబాద్ ఘన విజయం

దీమాపూర్: రంజీ ట్రోఫీ సీజన్‌ను హైదరాబాద్ భారీ విజయంతో మొదలు పెట్టింది. 'ప్లేట్' గ్రూప్‌లో రెండో రోజే ముగిసిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్, 194 పరుగుల తేడాతో నాగాలాండ్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 35/1తో ఆట కొనసాగించిన నాగాలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులకే ఆలౌటైంది. ఆర్ఎస్ జగన్నాథ్ శ్రీనివాస్ (49) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (5/43) ఐదు వికెట్లతో చెలరేగగా...సీవీ మిలింద్, కార్తికేయ చెరో 2 వికెట్లు తీశారు. దాంతో హైదరాబాద్‌కు 321 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం 'ఫాలో ఆన్'లో రెండో ఇన్నింగ్స్ ఆడిన నాగాలాండ్ మళ్లీ పేలవ బ్యాటింగ్‌లో 127 పరుగులకే కుప్పకూలింది. సుమిత్ కుమార్ (62) అర్ధ సెంచరీ సాధించాడు. సీవీ మిలింద్ 4 వికెట్లు పడగొట్టగా, తనయ్ త్యాగరాజన్‌కు 3 వికెట్లు దక్కాయి.



తనయ్

ఇన్నింగ్స్, 194 పరుగులతో నాగాలాండ్ చిత్తు

ఆంధ్ర 119/3

విశాఖ స్పోర్ట్స్: బెంగాల్‌తో జరుగుతున్న 'ఎలైట్' డివిజన్ రంజీ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సరికి ఆంధ్ర తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 119 పరుగులు చేసింది. ప్రశాంత్ కుమార్ (41), సీఆర్ జ్ఞానేశ్వర్ (33), షేక్ రషీద్ (32) వెనుదిరగ్గా...కెప్టెన్ హనుమ విహారి (6 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 289/4తో ఆట కొనసాగించిన బెంగాల్ 409 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ పొరేల్ (70) హాఫ్ సెంచరీ చేయగా, లలిత్ మోహన్‌కు 4 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఆంధ్ర మరో 290 పరుగులు వెనుకబడి ఉంది.

సినిమా



నాగచైతన్య

ఇక రాజులమ్మ జాతరే...

'దద్దా.. గుర్తెట్టుకో.. ఈ పాలి యేట.. గురి తప్పేదెలేదేస్... ఇక రాజులమ్మ జాతరే' అంటూ ఉత్తరాంధ్ర యాసలో నాగచైతన్య చెప్పే డైలాగ్‌తో మొదలవుతుంది 'తండేల్' గ్లింప్స్. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కర్ణాటకలో జరుగుతోంది. 'ఎసెన్స్ ఆఫ్ తండేల్' అంటూ శనివారం గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. 'మా నుంచి ఊడపోసిన ఓ ముక్కా... మీకే అంతుంటే ఆ ముక్కను ముష్టి వేసిన మాకెంతుండాలి', 'తేరే పాకిస్తాన్‌కే అడ్డా మే ఘుసేకే బతా రహే హై. భారత్ మాతా కీ జై' అంటూ నాగచైతన్య చెప్పిన మరికొన్ని డైలాగ్స్ కూడా టీజర్‌లో ఉన్నాయి. ''వాస్తవ ఘటనలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. పాకిస్తాన్ తీర రక్షక దళానికి అనుకోకుండా పట్టుబడిన ఓ భారత మత్స్యకారుని కథే ఈ సినిమా ప్రధానాంశం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.



ఏఆర్ రెహమాన్

ఏడేళ్ల తర్వాత తెలుగులో...

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారనే వార్త ఎప్పట్నుంచో ఉంది. శనివారం (జనవరి 6) రెహమాన్ బర్త్ డే సందర్భంగా యూనిట్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ పాన్ ఇండియా చిత్రానికి బుచ్చిబాబు పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ ఇది'' అని చిత్ర బృందం పేర్కొంది. ఇదిలా ఉంటే నాగచైతన్య హీరోగా రూపొందిన 'సాహసం శ్వాసగా సాగిపో' (2016) తర్వాత ఏడేళ్లకు రెహమాన్ తెలుగులో సంగీతం అందిస్తున్న చిత్రం ఇదే.



విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా, సూపర్ స్టార్ రజనీకాంత్, క్రికెటర్ కపిల్ దేవ్, జీవిత రాజశేఖర్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'లాల్ సలామ్'. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకురాలు. శనివారం (జనవరి 6) కపిల్ దేవ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడింది.

కపిల్ దేవ్, రజనీకాంత్



ఆయన బయోపిక్‌లో నటించాలని ఉంది

- నవాజుద్దీన్ సిద్ధిఖీ

"కథలో నా పాత్ర ఎంత ఆసక్తికరంగా ఉంటుందన్నదే నాకు ముఖ్యం. చెప్పాలంటే కొన్నిసార్లు పాజిటివ్ రోల్స్ కంటే నెగటివ్ రోల్స్‌లో పెర్ఫార్మ్ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. 'సైంధవ్' సినిమాలో దర్శకుడు శైలేష్ నా పాత్రను వినూత్నంగా డిజైన్ చేశారు. నటనకు ఎంతో స్కోప్ ఉన్న పాత్ర" అన్నారు బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ. వెంకటేశ్ హీరోగా నటించిన 'సైంధవ్'లో నవాజుద్దీన్ నటించారు. తెలుగులో ఆయనకు తొలి చిత్రమిది. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ చెప్పిన విశేషాలు.

- తెలుగులోకి రావడానికి సరైన స్క్రిప్ట్ కోసం ఎదురు చూశాను. అది 'సైంధవ్'తో కుదిరింది. వెంకటేశ్‌గారితో కలిసి పని చేయడం ఎవరికైనా ఓ డ్రీమ్‌గానే ఉంటుంది. యాక్షన్ సీక్వెన్స్‌లో చాలావరకూ ఆయన డూప్ లేకుండా చేశారు. సెట్స్‌లో ఎప్పుడూ కూల్‌గా, చాలా సహనంతో ఉంటారు. వెంకటేశ్‌గారి నుంచి ఈ విషయాన్ని నేర్చుకోవాలి. ఆయన చేసిన ఫ్యామిలీ సబ్జెక్ట్ మూవీస్ చూశాను. వెంకటేశ్‌గారి 'అనారి' ('చంటి') చిత్రం కూడా చూశాను.
- 'సైంధవ్'లో కొంత తెలుగు, కొంత హిందీ మాట్లాడే ఓ హైదరాబాదీ పాత్ర నాది. సెట్స్‌లో నా తొలి రోజు చిత్రీకరణ యాక్షన్‌తో మొదలు కావడం కాస్త సవాల్‌గా అనిపించింది. ఇక బెస్ట్ మూమెంట్స్ అంటే.. శ్రీలంక షెడ్యూల్ మర్చిపోలేను. సముద్రంలో యాక్షన్ సీక్వెన్స్ కోసం బోట్ పై స్పీడ్‌గా వెళుతున్నాను. అకస్మాత్తుగా ఒక పెద్ద అల వచ్చింది. దాంతో ఒక్కసారి బోట్ వదిలేసి అలతో పాటు పైకి ఎగిరాను. అదృష్టవశాత్తు.. మళ్లీ బోట్లోనే ల్యాండ్ అయ్యాను (నవ్వుతూ). ఆ సీన్ సినిమాలో ఉంటుంది.

నా నటనకు మరొకరు డబ్బింగ్ చెప్పడం నాకు ఇష్టం లేదు. ఎంత కష్టమైనా డైలాగ్స్ నేర్చుకుని ఆ భాషలో డబ్బింగ్ చెప్పడమే ఇష్టం. అప్పుడే నా పాత్రలో ఉన్న ఇంటెన్స్, డెప్త్ తెలుస్తాయి.
- శైలేష్ చాలా ప్రొఫెషనల్ డైరెక్టర్. నటుడిగా నాది సుదీర్ఘమైన ప్రయాణం. శైలేష్ ఇండస్ట్రీకి వచ్చి తక్కువ సమయమే అవుతోంది. అయితే ఫిల్మ్ మేకింగ్ పరంగా అతనికి ఎంతో విషయ పరిజ్ఞానం, ఉందనిపించింది. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ ప్రొఫెషనల్ ప్రొడక్షన్ హౌస్.
- టాలీవుడ్ చాలా ప్రొఫెషనల్. ఇక రజనీకాంత్‌గారి 'పేట' (2019) సినిమా తర్వాత తమిళ, తెలుగు నుంచి నాకు అవకాశాలు వచ్చాయి.. కానీ కుదర్లేదు. అప్పుడు 'పేట'లా ఇప్పుడు 'సైంధవ్' సంక్రాంతికే విడుదలవుతుండటం హ్యాపీ. ఇక ఓషోగారి పాత్ర చేయాలన్నది నా డ్రీమ్. అవకాశం వస్తే ఆయన బయోపిక్‌లో నటిస్తాను.

నవ్విస్తూ... భయపెడుతూ..



శ్రీనివాస్ రెడ్డి, కోన వెంకట్, అంజలి, శివ తుర్లపాటి

అంజలి టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. 'గీతాంజలి' సినిమాకు ఇది సీక్వెల్. శ్రీనివాస్ రెడ్డి, 'సత్యం' రాజేశ్, 'షకలక' శంకర్, అలీ, సునీల్, సత్య ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రచయిత–నిర్మాత కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది ప్రథమార్ధంలో విడుదల కానుంది. శనివారం ఈ సినిమాలోని క్యారెక్టర్స్‌ను పరిచయం చేస్తూ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ– ''గీతాంజలి మళ్ళీ వచ్చింది' అంతా ఒక ఎత్తైతే.. క్లైమాక్స్ మరో రేంజ్‌లో ఉంటుంది. 'గీతాంజలి'ని ఫ్రాంచైజీగా చేస్తూ, కోనగారు 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' చేశారు. కోనగారి కామెడీ ట్రాక్, ఈ సినిమాను ఆయన డిజైన్ చేసిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. దర్శకుడు శివగారికి ఈ సినిమాతో పెద్ద బ్రేక్ వస్తుంది'' అన్నారు. ''గీతాంజలి మళ్ళీ వచ్చింది''ని అమెరికాలో చేద్దామనుకున్నాం. కొన్ని ప్రాక్టికల్ కారణాల వల్ల ఊటీ బ్యాక్‌డ్రాప్‌కి మార్చాం. ప్రేక్షకులు వారి అంచనాలకు మించి ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు'' అన్నారు కోన వెంకట్. ''ప్రేక్షకులను భయపెడుతూ, నవ్విస్తూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు శ్రీనివాస్ రెడ్డి. ''బ్లాక్‌బస్టర్ మూవీ 'గీతాంజలి'కి సీక్వెల్ చేసే అవకాశాన్ని కల్పించిన కోన గారికి, ఎంవీవీగారికి థ్యాంక్స్'' అన్నారు శివ తుర్లపాటి. నటుడు రవికృష్ణ, ఎడిటర్ చోటా కె. ప్రసాద్, సినిమాటోగ్రాఫర్ సుజాత సిద్ధార్థ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రవీణ్ లక్కరాజు మాట్లాడారు.

సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి


- దర్శకుడు విజయ్ బిన్నీ



''ఆర్టిస్టులు సపోర్ట్ చేస్తే ఓ సినిమాను ఎంత త్వరగా పూర్తి చేయవచ్చో ఈ చిత్రంతో నేర్చుకున్నాను. నాగార్జున, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్‌గార్లు సపోర్ట్ చేయడం వల్లే ఈ సినిమాను సంక్రాంతి రిలీజ్‌కు రెడీ చేశాం'' అన్నారు విజయ్ బిన్నీ. నాగార్జున హీరోగా 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, రుక్సార్ థిల్లాన్, మిర్నా మీనన్ ఇతర కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్లతో విజయ్ బిన్నీ పంచుకున్న విశేషాలు.

- స్నేహం ప్రధానంగా సాగే చిత్రం 'నా సామిరంగ'. 1980–1990 నేపథ్యంలో కథ సాగుతుంది. నాగార్జున, 'అల్లరి' నరేశ్‌గార్ల కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. రాజ్ తరుణ్‌ది ఓ కీలక పాత్ర. అయితే ఈ ముగ్గురి కనెక్టింగ్ పాయింట్ ఏంటి? అనేది సినిమాలో చూడాలి. నాగార్జున, అల్లరి నరేశ్, రాజ్ తరుణ్‌గార్ల సినిమాలకు కొరియోగ్రాఫర్‌గా చేశాను. సో.. నాకు వారితో కంఫర్ట్‌నెస్ ఉంది. మలయాళ హిట్ ఫిల్మ్ 'పొరింజు మరియం జోస్' సోల్‌ను మాత్రమే 'నా సామిరంగ' సినిమాకు తీసుకోవడం జరిగింది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు మార్పులు చేశాం. నాగార్జునగారు ఆయన అనుభవంతో కొన్ని సలహాలు చెప్పారు. నాగార్జునగారితో ఓ కొత్త దర్శకుడికి సినిమా అంటే అదృష్టమే. అందుకే ఈ సినిమా చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను.
- దర్శకుణ్ణి కావాలనే చిత్ర పరిశ్రమలోకి వచ్చాను. కొరియోగ్రాఫర్‌గా అయితే అన్ని క్రాఫ్ట్స్‌పై గ్రిప్ ఉండే చాన్స్ ఉందని భావించి, కొరియోగ్రాఫర్‌గా కెరీర్ ఆరంభించాను. నేను ఓ కథతో నాగార్జున గారి దగ్గరకు వెళ్లాను. కానీ ఆయన 'నా సామిరంగ' కథ చేయమని చెప్పారు. ఈ కథను ఓన్ చేసుకుని దర్శకత్వం వహించాను. కమర్షియల్ పంథాలో నా శైలిలో ఈ సినిమాను ప్రత్యేకంగా తెరకెక్కించాను. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి.
- నేను కొరియోగ్రాఫర్‌ని కాబట్టి నాకు మ్యూజిక్ సెన్స్ ఉంటుంది. కీరవాణిగారిని ఏం అడిగినా, ఏదో ఒక సెన్స్‌తో అడుగుతున్నానని భావించి, సపోర్ట్ చేశారు. ఇందుకు ఆయనకు ధన్యవాదాలు. ఓ కొరియోగ్రాఫర్‌గా విభిన్న రకాల పాటలు ఎలా చేశానో, అలానే దర్శకుడిగా విభిన్న రకాల సినిమాలు చేయాలని ఉంది.


ముఖ్య గమనిక మంచి థ్రిల్లర్ అనిపిస్తోంది - దర్శకుడు మారుతి



రాజశేఖర్, మారుతి, విరాన్, వేణు మురళీధర్

''ముఖ్య గమనిక' టీజర్ చూశాను. మంచి థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమా అనిపిస్తోంది. కానిస్టేబుల్‌గా విరాన్ క్యారెక్టర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా టీమ్ మొత్తానికి బూస్టప్ ఇస్తుందని ఆశిస్తున్నాను'' అని దర్శకుడు మారుతి అన్నారు. హీరో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తం శెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. సీనియర్ సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ శివిన్ ప్రొడక్షన్స్ పతాకంపై రాజశేఖర్, సాయికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లావణ్య హీరోయిన్. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మారుతి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా విరాన్ ముత్తంశెట్టి మాట్లాడుతూ– ''ఫిబ్రవరిలో ఈ సినిమాని రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''థ్రిల్లింగ్ అంశాలతో ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. విరాన్ చక్కగా నటించారు'' అన్నారు వేణు మురళీధర్. ''మా బేనర్ నుంచి వస్తున్న తొలి చిత్రమిది'' అన్నారు రాజశేఖర్.

రొమాంటిక్ కామెడీ షురూ



రాకేష్, గౌతమ్ రెడ్డి, వెంకటేశ్, నారా రోహిత్, సంతోష్

నారా రోహిత్, విర్తీ వాఘని జంటగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ శనివారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. నారా రోహిత్ కెరీర్‌లో ఇది 20వ చిత్రం. ఈ సినిమాను సంతోష్ చిన్నపోల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ఎం. ప్రదీప్ వర్మ కెమెరా స్విచ్చాన్ చేయగా, గౌతమ్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. విజయ్ కృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. శ్రీదేవీ విజయ్ కుమార్, నరేశ్ విజయకృష్ణ, వాసుకీ ఆనంద్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/ M.Com / C. Govt.మేనేజర్/ కెనరా బ్యాంక్/12 Lakhs. PA/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-13271]

SC హిందూ మాల/M.Tech/C.Govt. Asst. ఇంజినీర్/రైల్వే/8 Lakhs. PA/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13271]

గౌడ/ M.Tech / C.Govt. సైంటిస్ట్/ ఇస్రో/1 Lakh. PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-13271]

క్రిస్టియన్ మాల/M.Tech/Govt.Exq. ఇంజినీర్ / R&B Dept/60,000/-PM/ 5'11"ఎత్తు/28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13271]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/ Govt. గెజిటెడ్ ఆఫీసర్/ఇరిగేషన్ Dept/1 Lakh. PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-13271]

MALA/30/5'9"/ B.Tech MBA Govt. Job DRDO 15-L P/A Well Settled వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9390933661 [HA-13003]

క్రిస్టియన్ మాల/ కట్నం ప్రసక్తిలేదు/ 28/5'9"/ B.Tech/ C. Govt. రిసెర్చ్ ఆఫీసర్/1 Lakh PM అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13274]

వడ్డెర/M.Tech/ C.Govt. జూనియర్ ఇంజినీర్/ రైల్వే/ 80,000/-pm/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13274]

రజక/కట్నం ప్రసక్తిలేదు/B.Tech (సివిల్)/ Govt.AE/ ఇరిగేషన్ Dept./ 90,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-13274]

SC మాల/B.Tech/ IIT/ C.Govt. సైంటిస్ట్/ DRDO/ 1,50,000/-pm/ 5'8" ఎత్తు/ 30 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 8897389698 [HA-13274]

హిందు మాదిగ/B.Tech/ C.Govt. Jr. Asst. ఇంజినీర్/ రైల్వే/70,000/-pm/ 5'8" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7032058965 [HA-13274]

కమ్మ: 45Y/5'9"/ fair/ Business/ Builder/ 5 లక్షలు నెలకు 100Cr ప్రాపర్టీ కలిగిన వరుడికి వధువు కావలెను. Only High Profiles Cont: 8019468462, 8897213126 [H-801462]

CNB మాల క్రిస్టియన్, 46 సం. 1st మ్యారేజ్ ప్రైవేట్ సర్వేయర్ Hydలో, 4 గదుల ఇల్లు గ్రామంలో, 7ఎ. ల్యాండ్, ఎలాంటి బ్యాడ్ హ్యాబిట్స్ లేని వరుడికి వధువు కావలెను. Ph: 9948604039 [HA-13282]

కుల ప్రసక్తి లేదు, 48 సం.ల HIV పాజిటివ్ ఉండి ఆరోగ్యంగా ఉన్న వరునికి HIV పాజిటివ్ ఉండి ఆరోగ్యంగా ఉన్న వధువు కావలెను. Ph: 8019431389 [HA-13282]

SC మాల 43 ఒంటరి రెండవ బిజినెస్ / మంచి ఆస్తి ఇల్లు గల వరునికి 1వ లేదా 2వ వధువు (కుల పట్టింపు లేదు) కావలెను. ఫోన్: 8919914094. (డైరెక్ట్). [H-788498]

కుల ప్రసక్తి లేని 37 సం॥ల వయస్సు గల వరుడుకు వధువు కావలెను. వధువుకు మొదటి/ రెండవ, విడో పిల్లలు ఉన్న వారైనా సంప్రదించండి. జాతి ప్రసక్తి లేదు. Ph: 6301055248, 7396730091 [HA-30942]

SC-Mala-Hindu/ 2nd Marriage/ PG/ 5'10"/39/SWE/1,20,000/-PM/Wants Hindu Bride Only (Urgently). Ph 8187861989 No brokers [HA-992]

REDDY GROOM, 29/5'8"/ B.Tech (Civil) Govt. AE *29/5'10"/MBA Business Contact Prabhakar Reddy. Ph: 9391198332 [H-801507]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓసీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801458]

మాల/కట్నం ప్రసక్తి లేదు/49/5'7/1st మ్యారేజ్/ ప్రైవేట్ టీచర్/1.10L PM/ సొంత ఇల్లు ఉన్న వరునికి డిగ్రీ/పీజీ చదివిన 45 సం॥ 1st మ్యారేజ్ వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788245]

మాల/48/5'2"/1st మ్యారేజ్ (తెల్ల మచ్చల పూత)/ TS Govt/ 70K PM/సొంత ఇల్లు ఉన్న వరునికి ఇంటర్ చదివిన, మధ్యతరగతి వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788246]

గూగుల్‌లో పనిచేయుచున్న 27 ఏండ్ల ఫెయిర్, 5 ఫీట్ 8 అంగుళాల క్రైస్తవునికి భక్తి కలిగిన వధువు కావలెను. సంప్రదించండి. సెల్ : 8332921163 [HA-95934]

అమ్మాయి కావలెను.1వ కోమట్ల అబ్బాయి 35Y. M.Sc., M.Ed. జా॥, డిగ్రీ కాలేజీ ప్రైవేట్ లెక్చరర్, 20 వేలు, ఆస్తి 30 లక్షలు, నల్లగొండ. సంప్ర॥ 9121325068 [Y-798306]

వరుడు కావలెను



SC హిందూ మాదిగ/B.Tech/Govt. Asst. ఇంజినీర్/ట్రాన్స్‌కో/60,000/-PM / 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-13271]

వాల్మీకి బోయ/B.Tech/C.Govt. P.O/ SBI బ్యాంక్/40,000/-PM/5'5"ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-13271]

గౌడ/ఏకైక కుమార్తె / C.A / చార్టెడ్ అకౌంటెంట్ / 8 Lakhs. PA / 5'6" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9618007652 [HA-13271]

రజక/B.Tech/C.Govt. క్లర్క్ & క్యాషియర్ /SBI బ్యాంక్ /40,000/-PM / 5'5"ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-13271]

వడ్డెర/MA/Govt.గ్రూప్-I ఆఫీసర్/ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ / ICDS/ 70,000/-PM/5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-13271]

MALA/25/5'3"/ B.Tech, MBA Job SWE Sal: 12-L P/A Well Settled Family అందమైన వధువుకు వరుడు కావలెను.Ph: 9390933661 [HA-13003]

గౌడ/27/5'4"/ B.Tech MBA Job Govt. (AEE) 10-L P/A Well Settled Family వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6281925716 [HA-13003]

SC మాల/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/60,000/- pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13274]

క్రిస్టియన్ మాల/25/5'5"/ B.Tech/ C.Govt. బ్యాంక్ డిప్యూటీ మేనేజర్/ 60,000/- pm అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13274]

యాదవ/BE (ECE)/Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 85,000/- pm/ 5'4" ఎత్తు/ 28 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-13274]

కాపు/B.Tech (IT)/ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్/ 60,000/- pm/ 5'5" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9618579861 [HA-13274]

2వ పెళ్లి/54 yrs/ ఫ్యామిలీ పెన్షన్/ 40,000/-pm/ పిల్లలు లేరు/40,000/- pm, Own House & 3 Cr ప్రాపర్టీ గల వధువుకు కుల, ఆస్తి, ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9381250286 [HA-13274]

వైశ్య/58y/విడో/ 5'3"/Steel Plant లో Job/ 1L pm/ 2 సొంత ఇల్లులు/ ఫైనాన్స్ బిజినెస్/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7981958172 [H-801507]

రెడ్డి/విడో/56 సం॥, ఫ్యామిలీ పెన్షనర్, సొంత ఇల్లు, 15 ఎకరాల భూమి గల వధువుకి వరుడు కావలెను. కుల, కట్నం ప్రసక్తి లేదు. ఇల్లరికం. సంప్ర : 9392495590 [H-801507]

వైశ్య/24/5'2"/Dr.(3 Cr) *25/5'4"/SW (2 Cr) *22/5'6"/B.Tech *28/5'4"/ MBA *25/5'3"/BDS వధువులకై సం॥ M. సునిత. Ph: 9346019313 [H-801507]

రెడ్డి/విడో/46y/5'5"/ V.Fair/ Govt. Teacher/ సొంత ఇల్లు & బిజినెస్‌లు/ 25 ఎకరాల మాగాణి/ 3L pm ఏబాదరాబందీలేని వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7093717220 [H-801507]

కాపు: డైవర్సీ/29y/B.Tech/MBA/1 Lakh P/M/ Hydలో Own Plots. వెలమ/ 26y/B.E/ Only Daughter. Hydలో జాబ్ గల వధువులకు తగిన వరులు కావలెను. Ph: 6309344166 [H-787769]

రెడ్డి: 30y/M.Com & MBA/ Bank Officer/ 75K P/M డైవర్సీ/పిల్లలు లేరు. కమ్మ /25y/ SWE/50K P/M Own Plots గల అందమైన వధువులకు తగిన వరులు కావలెను. Ph: 9985746131 [H-787769]

రెండోపెళ్ళి: విడో/46y/ వెటర్నరీ & Animal Husbandary Dept/ 1 L P/M/ Own House/ పొలాలు, కోట్ల ప్రాపర్టీ గల వధువుకు కులప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 7842769928 [H-787769]

రెడ్డి: డైవర్సీ/26y/B.Tech/80K P/M/ 3ఎ॥ ఫాంల్యాండ్, యాదవ / 28y/MBA/Govt Job/65,000/- P/M, కోట్ల ప్రాపర్టీ గల వధువులకు తగిన వరులు కావలెను. Ph: 9985748142 [H-787769]

రెండవపెళ్ళి: విడో/ 38y/ Fair/ Govt Job/ Warangal/ వెల్ సెటిల్/ పిల్లలు లేని, ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/ BC వరుడు కావలెను. (పిల్లలున్నా OK) Ph: 8519803423 [H-787769]

రెడ్డి: 25y/5'4"/B.Tech/ 25 లక్షలు P/A/ 50 Cr Property/ Only Daughterకి Local/ job & Business చేయు వరుడు కావలెను. Ph: 8897213126, 8019468462 [H-801462]

రెడ్డి: 42y/5'3"/Fair/ Own Pharmacy/ 2 లక్షలు నెలకు/ 20 Acres Land/30Cr ప్రాపర్టీ కలిగిన వధువుకి బాగా స్థిరపడిన వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8019484384, 7396608019 [H-801462]

కమ్మ: 35y/5'6"/Fair/ G.Employ/ 1 లక్ష P/M / 20 Cr Property, Own Shopping Mall, Well Settled వధువుకి వరుడు కావలెను. Rich Persons Cont: 7396608019, 8019484384 [H-801462]

వైశ్య: 45y/5'3"/H Fair/ వీడో/ Own Hostel / 3 Lakhs P/M/ 50 Cr ప్రాపర్టీ Rich Ladyకి Job & Business, Settled వరుడు కావలెను. 8019484384, 7396608019 [H-801462]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం OK) Ph: 8143011223 [HA-13282]

New year, సంక్రాంతి ఫెస్టివల్ ఆఫర్. విడో, డైవర్సీ, 2వ పెళ్లి మహిళలకు రిజిస్ట్రేషన్ ఫీ 1000/- మాత్రమే. ఈ రోజే సంప్రదించండి. 8247888908 [HA-13282]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/39yrs/M.Sc/ బ్యాంక్ మేనేజర్/1 లక్ష 30 వేలు(pm) /సొంత ఇల్లు+కార్/పిల్లలు లేని 100 కోట్ల ఆస్తి గల V.ఫెయిర్ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK). 8341458870 [H-787951]

రెడ్డి/32yr/5'4"/1st మ్యారేజ్/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ M.Com/Govt.ఎంప్లాయ్/65K (PM)/ వెల్ సెటిల్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం, 1st & 2nd మ్యారేజ్ OK) సంప్ర : 8008474869 [H-787951]

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్లి/38Yr/విడో/సొంత ఇల్లులు/రెంట్స్/పిల్లలు లేరు/ సొంత ప్రాపర్టీ /ఎలాంటి బాదరబందీ లేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643. [H-787951]

SC మాదిగ/B.Tech (సివిల్) Govt/AEE ఇరిగేషన్ Dept/10 Lakhs PA/5'4"ఎత్తు/25 సం॥ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093, 9703978131 [H-787951]

బ్రాహ్మణ/24/5'3"/B.SC *27/5'4"/MBA *30/ 5'3"/B.SC *32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/పురోహితులకు మ్యారేజ్ త్వరగా కుదుర్చబడును. PH: 7842635086 [H-787951]

Reddy (Motati)/ 30yrs/5'1, LLB, LLM (Nalsar-corporate law) Working in Private co, Looking Profession Lawyer/CA/ CS/ Bank in Same Community. Ph: 9959721617 [H-787904]

వేదికలు



గంగపుత్ర/బెస్త/కులము వారికి AP+TS సంబంధములు చూడబడును. ఫాస్ట్ సెటిల్‌మెంట్ మా వద్ద SWE/ Govt./ Pvt/ మెడికో చూడబడును. Ph: 6301621607 [HA-13003]

ఫాస్ట్ సెటిల్‌మెంట్ కుల పట్టింపులేని అన్ని కులముల వారికి 1st & IInd సంబంధములు చూడబడును. Pvt/SWE/ Govt/ బిజినెస్ AP, TS ప్రాంతం వారికి సంబంధములు చూడబడును. Ph: 8897091964 [HA-13003]

శ్రీ శ్రీరస్తు శుభమస్తు. ఓల్డ్ రెడ్డీస్ గత 15 సం.లుగా అనేక జంటలు కలిపిన సంస్థ. ఇండియా అబ్రోడు సంబంధాలు కలవు. మా బ్రాంచెస్ Hyd, విజయవాడ, బెంగళూరు Ph: 9100454789 [HA-13282]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13282]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13282]

Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13282]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13282]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13282]

పెళ్లి సంబంధాలు-కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ, చౌదరి, రెడ్డి కులస్తులకు, సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ వారికి Specialగా చూడబడును, పూర్ణ మ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1983]

వాసవి విజయవాడ వారి అధ్వర్యంలో 26-1-2024వ తేదీ ఉ॥ 9 గం॥లకు 64వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయం వేదిక మరియు మ 2॥లకు 19వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలోజరుగును. ✆ 9989500130 [B-1234]

15వో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 9492033897, 9490416355, 9440785888 [B-610]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-950]

ఫ్రీ రిజిస్ట్రేషన్. ప్రత్యేకంగా పద్మశాలి, ఆర్యవైశ్య, రెడ్డి, గౌడ్, యాదవ, చౌదరి, మున్నూరు కాపు, సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, లాయర్స్, CA, NRI, USA, వెల్ సెటిల్డ్ బిజినెస్ వధూవరుల కొరకు మాత్రమే సంప్ర : 9063703566/11 [HA-3523]

కంచ ఐలయ్యకు 'మా జాతి సూర్యుడు' అవార్డు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక కురుబల సమాజం అందించే 'మాజాతి సూర్యుడు' అవార్డుకు కంచ ఐలయ్యషెఫర్డ్ ఎంపికయ్యారు. ఐలయ్య సమాజం కోసం ఎన్నో పుస్తకాలు రాసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఈ నెల 13న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతులమీదుగా ఐలయ్యకు అవార్డును ప్రదానం చేయనున్నారు. అవార్డుతోపాటు రూ.50 వేలు నగదును అందజేయనున్నారు. అవార్డును కర్ణాటకలోని కనక గురుపీఠం కలబురిగి డివిజన్ సంస్థ తింథని బ్రిడ్జి వద్ద ఇవ్వనున్నారు. కార్యక్రమంలో కనక గురుపీఠాధిపతి శ్రీనిరంజనానంద మహాస్వామి, కర్ణాటక మంత్రులు సతీశ్ జెర్కిహోలి, బైరతి సురేశ్, ప్రియాంక్ ఖర్గే పాల్గొననున్నారు.

కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే 'కాళేశ్వరం'

ప్రొఫెసర్ కోదండరామ్ ఆరోపణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణ ఏర్పడ్డాక కేవలం ఆంధ్రా కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే ఎల్లంపల్లి, ప్రాణహిత లింకు ప్రాజెక్టును గందరగోళం చేశారని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆరోపించారు. తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం కన్వీనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దొంతుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డిసెంబర్ 29వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాళేశ్వరంపై ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు కౌంటర్‌గా.. రీడిజైన్ తప్పుల కౌంటర్, రూ.లక్ష కోట్ల ప్రజాధనంపై పరిష్కారాలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయితే కృష్ణా, గోదావరి లింకు పేరుతో కొత్త ప్రణాళిక వేశాడని, దీనివల్ల పూర్తి ఆయకట్టు దెబ్బ తినడమే కాకుండా పైపుల కంపెనీవారు తిరిగి బాగుపడే వారన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. క్యాబినెట్ సమావేశమై, అసెంబ్లీలో తీర్మానించి సంబంధిత అధికారి జీవో జారీ చేస్తేనే ఏదైనా అమలవుతుందని.. కానీ కేసీఆర్ ప్రభుత్వంలో అన్నీ తానే అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంతుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 32 శాతం పూర్తయ్యిందని.. బుద్ధున్న వారెవరూ అంత పూర్తయిన ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో మార్చరన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, నైనాల గోవర్ధన్, తెలంగాణ విఠల్ పాల్గొన్నారు.

రాజ్యాంగం.. ఓ రక్షణ కవచం

- ప్రతీ జడ్జికి శిక్షణ అవసరం
- సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- దక్షిణ భారత న్యాయమూర్తుల ప్రాంతీయ సదస్సులో ప్రసంగం
- పాల్గొన్న హైకోర్టు సీజే అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు



జ్యోతి ప్రజ్వలన చేసి దక్షిణ భారత న్యాయమూర్తుల ప్రాంతీయ సదస్సును ప్రారంభిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు

సాక్షి, హైదరాబాద్: న్యాయమూర్తులు అంతర్నిర్మిత దురభిప్రాయాలను వదిలించుకోవాలని, రాజ్యాంగ నైతికతను అన్ని సమయాల్లో సమర్థించాల్సిన అవసరం ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లు సూచించారు. నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ హైకోర్టు శనివారం సంయుక్తంగా నిర్వహించిన దక్షిణ భారత న్యాయమూర్తుల ప్రాంతీయ సదస్సు మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో జరిగింది. ఈ సదస్సుకు హాజరైన న్యాయమూర్తులు, జిల్లా జడ్జిలను ఉద్దేశించి వారు మాట్లాడారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా మాట్లాడుతూ.. 'కేవలం లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో న్యాయమూర్తులు ప్రయత్నించకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకుని తీర్పుల్లో నాణ్యతను మరింత పెంచాలి. వీలైనంత త్వరిత పద్ధతిలో గుణాత్మక, సమర్థవంతమైన న్యాయాన్ని అందించాలి. బెయిల్ కోసం ఇంకా అనేక మంది నిందితులు సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. రాజ్యాంగంలోని అత్యంత ప్రాధాన్యమైన ఆర్టికల్ 21ని రక్షించడానికి మనం తీవ్రంగా కృషి చేయాలి. ఈ సోషల్ మీడియా యుగంలో మన పనితీరుపై ప్రజల పరిశీలన పెరిగిందన్న విషయాన్ని న్యాయమూర్తులు తెలుసుకోవాలి. న్యాయమూర్తులకు నిరంతర శిక్షణ ఎల్లప్పుడూ అవసరం. నాకు నచ్చిన సిటీల్లో హైదరాబాద్ ఒకటి. నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. కింది స్థాయి నుంచి సుప్రీంకోర్టు వరకు ఏ న్యాయమూర్తికైనా శిక్షణ అవసరమే. ఒక్కో రాష్ట్రంలో చట్టాల్లో మార్పులు ఉంటాయి. అన్నీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది'అని పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలిగించాలి

జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ.. 'ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలిగేలా న్యాయమూర్తుల విధి నిర్వహణ ఉండాలి. న్యాయవ్యవస్థ తమకు ఓ రక్షణ కవచం అన్న భావన కల్పించాలి. సామాన్యుల విశ్వాసం చూరగొన్నప్పుడే న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు. ఆ విశ్వసనీయత కోల్పోయిన రోజు ఈ వ్యవస్థ నిష్ప్రయోజనం. అంతిమంగా రాజ్యాంగ సారాంశం సమానత్వమే. పక్షపాతాలను పక్కకు పెట్టి పనిచేయాలి. న్యాయమూర్తులు ఉపన్యాసాలు ఇవ్వడం మాని.. చట్టప్రకారం మాత్రమే తీర్పులు వెల్లడించాలి'అని సూచించారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. రాజ్యాంగం కేవలం ఒక చట్టపరమైన డాక్యుమెంట్ మాత్రమే కాదని, ప్రజల రక్షణ కవచమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ సుజోయ్ పాల్, తెలంగాణ రాష్ట్ర న్యాయ అకాడమీ అధ్యక్షుడు జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, తెలంగాణ, ఇతర హైకోర్టుల న్యాయమూర్తులు మాట్లాడారు.

సౌర వెలుగుల దిశగా సింగరేణి

- దేశవ్యాప్తంగా ప్లాంట్లు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్న సంస్థ
- రాష్ట్రంలో జలాశయాలు, కాలువలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు
- మూడు నెలల్లో 76 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు పూర్తి
- సింగరేణి థర్మల్, సోలార్‌పై సమీక్షలో చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్



సాక్షి, హైదరాబాద్/ సింగరేణి(కొత్తగూడెం): దేశవ్యాప్తంగా సోలార్ ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పడానికి సింగరేణి సంస్థ సిద్ధమవుతోంది. సింగరేణి బొగ్గు ఉత్పత్తితోపాటు ఇప్పటికే థర్మల్ విద్యుత్కేంద్రాలు, సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించడానికి ఇతర రాష్ట్రాల్లో సౌర ఇంధన ప్రాజెక్టులు చేపట్టాలని సంస్థ సీఎండీ ఎన్.బలరాం అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని సింగరేణి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజస్తాన్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో సౌర ఇంధన రంగంలో వాణిజ్య ప్రాజెక్టులు చేపట్టడానికి అధ్యయనం చేయాలని, వీలైతే సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టు (జాయింట్ వెంచర్)లు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై త్వరలోనే అధికారుల బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఈ ఏడాది సింగరేణిలో ప్రారంభించే నాలుగు కొత్త గనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరికొన్ని బొగ్గు బ్లాకుల సాధనకు కృషి చేస్తామని బలరామ్ తెలిపారు. ఒడిశాలో చేపట్టిన నైనీ బ్లాక్ చివరి దశ అనుమతులకు ఆ రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని చెప్పారు. ఈ విషయంలో ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించేందుకు డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఈనెల మూడో వారంలో భువనేశ్వర్ వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో సింగరేణి నిర్దేశించుకున్న 300 మెగావాట్ల సౌర ఇంధన ప్లాంట్లలో ఇంకా పూర్తి చేయాల్సిన 76 మెగావాట్ల ప్లాంట్లను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోలార్ ప్రాజెక్టులకు పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జలాశయాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతోపాటు కాలువలపైనా ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రెండో దశలో 232 మెగావాట్ల ప్లాంట్లను చేపడుతున్నట్లు డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు వివరించగా.. ఇందుకు అవసరమైన టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బలరామ్ సూచించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయగలిగితే సంస్థ విద్యుత్ అవసరాలను సోలార్ ప్లాంట్ల ద్వారానే తీర్చుకోగలుగుతామని.. తద్వారా తొలి జీరో ఎనర్జీ బొగ్గు కంపెనీగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సింగరేణి థర్మల్ ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సీఎండీ సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

వారం రోజుల్లో 200 మంది విద్యార్థినులకు అస్వస్థత

బొల్లారం నారాయణ కళాశాలలో ఘటన

- కలుషిత నీరు, ఆహారమే కారణమంటున్న విద్యార్థినులు
- యాజమాన్యంపై విద్యార్థినుల తల్లిదండ్రుల ఆగ్రహం



ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

జిన్నారం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం శివారులోని నారాయణ కళాశాలలో విద్యార్థినులు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురవుతున్నారు. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నారాయణ బాలికల కళాశాలలో సుమారు 500 మంది విద్యార్థినులు ఉన్నారు. నెలరోజుల నుంచి విద్యార్థినులు విరోచనాలు, వాంతులతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని యాజమాన్యం గుట్టుగా ఉంచటంతోపాటు రహస్యంగా విద్యార్థినులను ఇంటికి పంపిస్తోంది. వారంరోజుల్లో 200 మంది విద్యార్థినులు ఆస్పత్రిపాలు కావటంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో భారీ సంఖ్యలో కళాశాలకు చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యాన్ని నిలదీశారు. కలుషిత నీరు, ఆహారం వల్లే ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు వాపోయారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన ఓ విద్యార్థిని తండ్రి వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ ఈ ఏడాది మూడుసార్లు ఇలాగే జరిగిందని, ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదన్నారు. భారీగా ఫీజులు వసూలు చేస్తున్నదే తప్ప విద్యార్థుల ఆరోగ్యంపై యాజమాన్యం దృష్టి సారించటంలేదని విమర్శించారు. సంక్రాంతి పండుగ పేరిట విద్యార్థినులకు పది రోజులపాటు యాజమాన్యం సెలవులు ప్రకటించిందన్నారు.

ఇస్తెమా సదస్సు ప్రారంభం



తబ్లిగీ జమాత్ ఇస్తెమాలో పాల్గొన్న ముస్లింలు

పోటెత్తిన భక్తజనం

పరిగి: వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని న్యామత్‌నగర్‌లో శనివారం తబ్లిగీ జమాత్ ఇస్తెమా సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు తెలంగాణ జిల్లాలతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి ముస్లింలు భారీగా హాజరయ్యారు. ఈ నెల 8వ తేదీ వరకు సదస్సు జరగనుంది. శనివారం ఒక్కరోజే లక్ష మందికి పైగా హాజరయ్యారు. మూడురోజులు జరగనున్న సదస్సుకు అధికారులు నిరంతరం విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. సదస్సును స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ కోటిరెడ్డి కూడా సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాజీ రాష్ట్రపతి కోవింద్‌తో విద్యాసాగర్‌రావు భేటీ

సాక్షి, హైదరాబాద్: మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం రాజ్‌భవన్‌లో కోవింద్‌ను ఆయన శాలువాతో సన్మానించారు. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాల అధ్యయానికి కోవింద్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వచ్చిన కోవింద్‌తో విద్యాసాగర్‌రావు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశం సందర్భంగా వీరిద్దరి మధ్య వివిధ అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం.

రాజన్న కోడెలు పక్కదారి!

- ఇతర గోశాలల నిర్వాహకులు కొందరు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు
- అసలు గోశాలలే లేకుండా ఫెడరేషన్ లేఖతో తీసుకెళ్తున్నారనే అనుమానాలు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో 24 కోడెలతో పట్టుబడిన వ్యాన్
- 'శ్రీ సోమేశ్వర గోసంరక్షణ' పేరిట అసలు గోశాలే లేదని తేలిన వైనం


రాజన్న గోశాలలోని కోడెలు..


ఈ నెల 2న సోమేశ్వర గోశాలకు అందిస్తున్న కోడెలు..

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న కోడెలు పక్కదారి పడుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజన్న భక్తులు శివుడికి అత్యంత భక్తి శ్రద్ధలతో కోడెలను, ఆవులను అందజేస్తుంటారు. తమ కోరికలు నెరవేరితే కోడెమొక్కు చెల్లించుకుంటామని మొక్కుకున్న భక్తులు పలువురు కోడెలను ఆలయ గోశాలకు అప్పగిస్తుంటారు. ప్రధానంగా రైతులు తమ ఇంట్లో శుభకార్యాలు జరిగితే కోడెను తీసుకొచ్చి రాజన్న ఆలయానికి అప్పగించడం అనాదిగా జరుగుతోంది. అయితే ఈ కోడెలు, ఆవుల పోషణ ఇబ్బందిగా మారడంతో ఆలయ అధికారులు ఇటీవల వివిధ ప్రాంతాల్లోని ఇతర గోశాలల నిర్వాహకులకు కొన్ని కోడెలు, ఆవులను అందజేస్తున్నారు. వారు వాటిని పోషించడం లేదా రైతులకు అందజేయాల్సి ఉండగా.. కొందరు నిర్వాహకులు ఇతరులకు విక్రయిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. అలాగే అసలు లేని గోశాలల పేరిట కూడా కొందరు కోడెలు తీసుకెళ్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్‌లో కోడెలతో వెళ్తున్న వ్యాన్ పట్టుబడడం, వారు చెప్పిన గోశాల అసలు లేనట్లు తేలడం ఈ అనుమానాలను బలపరుస్తోంది.

పోషణభారం తగ్గించుకునేందుకు..

వేములవాడ రాజన్న ఆలయ గోశాలలు స్థానిక తిప్పాపూర్‌లో ఒకటి, గుడిచెరువు కట్టకింద ఒకటి ఉన్నాయి. తిప్పాపూర్ గోశాలలో సుమారు 150 కోడెలు, వేములవాడ కట్టకింద గోశాలలో 150 కోడెలు, ఆవులు ఉన్నాయి. వేములవాడ కట్టకింద గోశాలలోని కోడెలను ఆలయంలో కోడె మొక్కుల కోసం తీసుకెళ్తుంటారు. ఆవులను స్వామి వారి పూజకు ఉపయోగపడే పాల కోసం వినియోగిస్తున్నారు. తిప్పాపూర్ గోశాలలో భక్తులు అప్పగించిన కోడెలు ఉంటాయి. ఇక్కడి కోడెలు ఎక్కువైనప్పుడు నిర్వహణ భారం తగ్గించుకునేందుకు ఇతర గోశాలలకు అప్పగిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో భూమి పట్టా పాస్‌బుక్కు ఉన్న రైతులకు పెంచుకునేందుకు ఉచితంగా అందజేసేవారు. తర్వాత కాలంలో వేలం ద్వారా రైతులకే అమ్మేవారు. అయితే 2012 నుంచి తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో లేఖ తెచ్చుకున్నవారికి ఉచితంగా ఇస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపంతో..

ఈనెల 2న తిప్పాపూర్ గోశాలలోని 20 కోడెలను ఫెడరేషన్ లేఖ తెచ్చుకున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం దుబ్బాతండాలోని శ్రీ సోమేశ్వర గోసంరక్షణ సేవా సంఘానికి అందజేశారు. ఈ కోడెలతో బయలుదేరిన వ్యాన్‌ను జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో బజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకుని తనిఖీ చేశారు. 20 కోడెలు ఉండాల్సి ఉండగా 24 కనిపించడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో దుబ్బాతండాలో ఈ పేరుతో గోశాల లేదని తేలింది. దీంతో ఈ వ్యాన్‌ను నేరుగా స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కోడెలను ధర్మసాగర్ మండలంలోని గోశాలకు తరలించారు. గోశాల ఫెడరేషన్ సూచించిన గోశాలలకు కోడెలను అప్పగిస్తున్న అధికారులు.. ఈ కోడెలు గోశాలలకు వెళ్తున్నాయా.. లేదా? అని పరిశీలించకపోవడంపై భక్తులు, స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజన్న గోశాల నుంచి వివిధ గోశాలలకు అందిన కోడెల వివరాలు..

సంవత్సరం	కోడెలు	ఆవులు
2022	2,200	72
2023	1,846	58

2023లో రాజన్నకు భక్తులు అందించినవి..

కోడెలు	2,400
ఆవులు	130

అక్రమాలపై విచారణ చేపట్టాలి



రాజన్న ఆలయ కోడెలను ఈ ప్రాంత రైతులకు అప్పగించాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. కోడెల అప్పగింతలో అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టాలి. హిందువుల మనోభావాలను కాపాడాలి.
– గడప కిశోర్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి


ఫెడరేషన్ లెటర్ మేరకే ఇచ్చాం



ఎప్పటిలాగానే తెలంగాణ గోశాల ఫెడరేషన్ నుంచి వచ్చిన లేఖ మేరకే కోడెలను అందించాం. కానీ అక్కడ గోశాల ఉందో.. లేదో మాకు తెలియదు. ఈ విషయం ఫెడరేషన్ వారు చూసుకోవాలి. – శ్రీనివాస్, రాజన్న ఆలయ ఏఈవో



ఎందుకీ ఫొటో.. ఏముంది అని మీరు డౌట్ పడేలోపు.. మేమే చెప్పేస్తాం. ఒక డాల్ఫిన్ ఆవులిస్తుండగా తీసిన చిత్రం ఇదీ.. ఇందులో వింతేముంది అని అనిపిస్తోంది కదూ.. శాస్త్రవేత్తల ప్రకారం.. డాల్ఫిన్ ఆవులిస్తుండగా తీసిన తొలి చిత్రం ఇదట. అందుకే ఇది చాలా అరుదని వాళ్లు చెబుతున్నారు. అంతేనా.. ఇంకా సముద్ర జీవుల్లో ఏఏ జీవులు ఇలా ఆవులింత తీస్తున్నాయి అన్న దానిపై వాళ్లు ఓ పరిశోధన కూడా మొదలుపెట్టేశారు. అదండీ సంగతి..



2024లో ఇలా జరగొచ్చంటూ కృత్రిమ మేధ(ఏఐ)తో సహా పలువురు తమ జోస్యాలను వెలువరించారు.. అందరూ చెబుతున్నారు సరే.. ఇంతకీ జనమేం అనుకుంటున్నారు.. 2024లో ఏం జరగొచ్చు అని భావిస్తున్నారు? ఈ మేరకు గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్ కంపెనీ ఇప్సాస్ నిర్వహించిన సర్వేలో ఇటు టెక్నాలజీ నుంచి అటు వాతావరణ పరిస్థితుల దాకా అన్నిటిపైనా తమ అభిప్రాయాలను చెప్పారు. కొందరు ఒకటే అని కాకుండా.. పలు సంఘటనలు జరగొచ్చు అని అభిప్రాయపడ్డారు. భారత్ సహా 34 దేశాల్లో నవంబర్‌లో జరిగిన ఈ సర్వేలో 25 వేల మందికి పైగా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మరో రూ.250 కోట్ల పెట్టుబడికి 'వెల్‌స్పన్' సిద్ధం

సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన వెల్‌స్పన్ చైర్మన్ గోయెంకా


సీఎం రేవంత్‌తో సమావేశమైన వెల్‌స్పన్ సంస్థ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు వెల్‌స్పన్ గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. శనివారం సచివాలయంలో వెల్‌స్పన్ సంస్థల చైర్మన్ బి.కె. గోయెంకా తమ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మరో రూ.250 కోట్లను ఐటీ రంగంలో పెట్టుబడి పెడతామని ప్రకటించారు. తమ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వకంగా ఉంటుందని, స్నేహపూర్వక పారిశ్రామిక విధానాన్ని తీసుకుని వస్తున్నట్లు ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా గోయెంకా మాట్లాడుతూ.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ పరిశ్రమను ప్రమోట్ చేసేందుకు, వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని యువతకు ఐటీ ఉద్యోగాలు కల్పించేందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

తెలంగాణకు 4 స్వచ్ఛ అవార్డులు

సాక్షి, హైదరాబాద్: స్వచ్ఛ భారత్ పట్టణ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి మరోసారి అవార్డుల పంట పండింది. జాతీయ స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌తోపాటు దక్షిణ భారతదేశ విభాగంలో మరో మూడు పట్టణాలు ఈ అవార్డులను దక్కించుకున్నాయి. వీటిలో సిద్దిపేట, గుండ్ల పోచంపల్లి, నిజాంపేట మునిసిపాలిటీలు ఉన్నాయి. అవార్డులు దక్కించుకున్న నాలుగింటికిగాను ఢిల్లీ ప్రగతిమైదాన్‌లో ఈ నెల 11న కేంద్రం అవార్డులను అందించనున్నది.

15 వరకు అభ్యంతరాలకు అవకాశం

స్టాఫ్‌నర్స్ పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌పై బోర్డు కార్యదర్శికి మంత్రి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: స్టాఫ్‌నర్స్ నియామకాలకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వారి అభ్యంతరాలను స్వీకరించి నివృత్తి చేయాలని ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌పై అభ్యర్థులు తమ అభ్యంతరాలను జనవరి 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సెక్రెటరీకి సమర్పించుకొనేందుకు అర్హులైన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించారు. అభ్యర్థుల సందేహాలను జనవరి 17లోగా నివృత్తి చేయాలని, అర్హులని తేలితే వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించాలని మంత్రి బోర్డు కార్యదర్శికి సూచించారు.

ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏప్రిల్ 1 నుంచి 7 వరకు ఎంపిక ప్రక్రియ.. 8 నుంచి 14 ఏళ్లలోపు బాలురు అర్హులు

సాక్షి, హైదరాబాద్: బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ (బీఎస్సీ) వన్ ఈఎంఈ సెంటర్ సికింద్రాబాద్‌లో స్పోర్ట్స్ క్యాడెట్‌లుగా చేర్చుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మిలటరీ ఉన్నతాధికారులు తెలిపారు. వాలీబాల్, కయాకింగ్, కెనోయింగ్ విభాగాల్లో ఆటగాళ్ల ఎంపిక కోసం ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీ వరకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్టు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల వయోపరిమితి 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉండాలి. విద్యార్హత కనీసం 3వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లిష్, హిందీలో తగిన పరిజ్ఞానం ఉండాలి. దరఖాస్తుదారుల మెడికల్ ఫిట్‌నెస్‌ను ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆఫీసర్, ఆర్మీ స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ స్పెషలిస్ట్ లు నిర్ధారిస్తారు. ఏదైనా రాష్ట్రం, జాతీయ, అంతర్జాతీయ పతక విజేతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత బోర్డింగ్, లాడ్జింగ్, 10వ తరగతి వరకు విద్య, నివాస వసతి, బీమా, వైద్య సదుపాయంతో పాటు సైంటిఫిక్ కోచింగ్ ఇస్తారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ నిబంధనల ప్రకారం అర్హులైన స్పోర్ట్స్ క్యాడెట్‌లు ఇండియన్ ఆర్మీలో చేరేందుకు అర్హులవుతారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు వాట్సప్ నంబర్ 9398543351 లేదా ఈ–మెయిల్: bsc1emecentre@gmail.com లేదా బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, 1 ట్రైనింగ్ బెటాలియన్, 1 ఈఎంసీ సెంటర్, సికింద్రాబాద్‌లో సంప్రదించవచ్చు.

దీపం.. ధూపం.. అయ్యో పాపం

- 6నెలలుగా అర్చకులకు అందని భృతి
- నాటి సీఎం ప్రకటనతో 2,500 దేవాలయాలకు పథకం విస్తరణ
- ఆరు నెలల క్రితం ఉత్తర్వులు.. ఇప్పటివరకు చెల్లింపులు లేవు

సాక్షి, హైదరాబాద్: ధూపదీప నైవేద్య పథకం కింద ఎంపికైన అర్చకుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఆరు నెలలుగా వారికి ఆ భృతి అందటం లేదు. ఈ పథకాన్ని విస్తరిస్తూ ఆరు నెలల క్రితం 2,500 మంది అర్చకులను కొత్తగా దాని పరిధిలోకి చేర్చారు. ఈ మేరకు దేవాదాయ శాఖ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా గత జూన్‌లో ఉత్తర్వు జారీ చేసింది. కానీ ఆరు నెలలు గడుస్తున్నా వారికి ఇప్పటివరకు ధూప దీప నైవేద్య భృతి అందటం లేదు. దీంతో తాము అసలు ఆ పథకంలో ఉన్నట్టా లేదా అన్న ఆందోళనలో వారున్నారు. ఆదాయం లేని పాత దేవాలయాలలో కైంకర్యాలు కొనసాగేందుకు ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. దాదాపు 3,500 దేవాలయాలకు దీన్ని విస్తరించారు. గతేడాది గోపనపల్లిలో బ్రాహ్మణ సంక్షేమ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ధూప దీప నైవేద్య పథకం పరిధిలోకి మరికొన్ని దేవాలయాలను చేరుస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. దీంతోపాటు అప్పటివరకు ఆ పథకం కింద ప్రతినెలా అందిస్తున్న భృతిని రూ.10 వేలకు పెంచనున్నట్టు ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత జూన్‌లో అదనంగా 2,500 దేవాలయాలను దాని పరిధిలోకి చేరుస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఆ తర్వాత గౌరవ భృతిని రూ.6,500 నుంచి రూ.10 వేలకు పెంచుతూ మరో ఉత్తర్వు జారీ అయింది. దీంతో 2,500 దేవాలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న కుటుంబాల్లో సంతోషం వ్యక్తమైంది. కానీ, ఆయా దేవాలయాలను ధూప దీప నైవేద్యం పథకంలో చేర్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు భృతి విడుదల కాలేదు. అసలు ఆర్థిక శాఖలో దానికి సంబంధించిన డేటాలో అవి చేరనేలేదని తెలిసింది. ఈ విషయం తెలియని అర్చకులు ఆరు నెలలుగా దేవాదాయశాఖ చుట్టూ తిరుగుతున్నారు. ఇదిగో అదిగో అంటూ అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారు. అసలు ఆర్థిక శాఖ కార్యాలయంలోనే సమస్య ఉందని తాజాగా వెల్లడైంది. తమ వద్ద ఎలాంటి లోపం లేదని, ఆర్థిక శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు తాము సంప్రదిస్తూనే ఉన్నామని దేవాదాయ శాఖ అధికారులు తాజాగా ధూప దీప నైవేద్య పథకం అర్చకుల దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినందున, తమ సమస్య కొలిక్కి రాకపోతే ఆ జాబితానే రద్దవుతుందేమోనని అర్చకులు ఆందోళన చెందుతున్నారు.

సిద్దిపేటలోనే ఆయిల్ రిఫైనరీ యూనిట్

గెలల ధర చెల్లింపు ఫార్ములా 19.02 శాతంగా ఖరారు: ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ రెడ్డి

అశ్వారావుపేట రూరల్: ఏడాదికి ఒకసారి నిర్ణయించే పామాయిల్ టన్ను గెలల ధర చెల్లింపుల కొత్త ఫార్ములాను 19.02 శాతంగా ఖరారు చేసినట్లు ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేటల్లోని పామాయిల్ ఫ్యాక్టరీలను, కొత్తగా నిర్మిస్తున్న రెండో ఫ్యాక్టరీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, గతేడాది ఫార్ములా 19.32 శాతం కాగా, ప్రస్తుతం కొంత తగ్గిందని చెప్పారు. ఆయిల్ రిఫైనరీ యూనిట్‌ను సిద్దిపేటలోనే ఏర్పాటు చేస్తున్నామని, దాంట్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. రెండు ప్రైవేటు కంపెనీలకు చెందిన రిఫైనరీ యూనిట్లు అశ్వారావుపేటకు సమీపంలోనే ఉన్నందున.. ఆయిల్‌ఫెడ్ సంస్థ కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తే పోటీ నెలకొంటుందని, ప్రైవేటు ఫ్యాక్టరీలు ధర తగ్గించే ప్రమాదం ఉంటుందని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చే ఏడాది (2023–24)లో మరో 20 వేల ఎకరాల్లో సాగు విస్తరణకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. సిద్దిపేటతో పాటు ఖమ్మం జిల్లా కల్లూరిగూడెంలో 2026 నాటికి మరో ఫ్యాక్టరీని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కొత్తగా సాగు చేస్తున్న రైతులకు ఆయిల్‌పాంపై అవగాహన కల్పించేందుకు జిల్లాకు ఇద్దరు పీఎంవో (ప్లాంటేషన్ మానిటరింగ్ ఆఫీసర్)లను నియమిస్తున్నామని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇంకా నియమించాల్సి ఉందని చెప్పారు.

'బెల్ట్' తీసేందుకు పల్లెలన్నీ కదిలె..

- గ్రామాల్లో మద్యం అమ్మరాదని మహిళల ర్యాలీలు..
- అఖిలపక్షాలుగా ఏర్పడి ఏకగ్రీవ తీర్మానాలు

నోటీసులు జారీ చేస్తున్న పంచాయతీ పాలకవర్గాలు


చల్మెడ గ్రామంలో మద్యం విక్రయించవద్దని దుకాణ యజమానులకు నోటీసులు ఇచ్చిన పాలకవర్గ సభ్యులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పనిచేయగా వచ్చిన డబ్బంతా తాగుడుకే...ఇంట్లో సరుకులు లేవంటూ నిత్యం దంపతుల మధ్య గొడవ.. చిన్నచిన్న మాటలకే ఘర్షణ పడే యువత...మద్యం ఏరులై పారుతుండడంతో పచ్చని పల్లెల్లో ప్రశాంతత కరువైంది. బడి, గుడి లేని ఊరు ఉండొచ్చేమో గానీ...బెల్ట్ షాపు లేని ఊరే లేదన్నంతగా ఉంది ప్రస్తుత పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో నల్లగొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలో బెల్ట్ షాపుల నిషేధానికి ప్రతినబూనారు. ఆ దిశగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో పోలీస్, ఎక్సైజ్‌శాఖ అధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు ఎమ్మెల్యే పిలుపు అందుకొని పల్లెలన్నీ కదిలాయి. బెల్ట్ షాపులను బంద్ చేసేందుకు పూనుకున్నాయి పలు గ్రామాల ప్రజలంతా బెల్ట్ షాపులు బంద్ పెట్టాలని, గ్రామాల్లో మద్యం విక్రయించొద్దంటూ అఖిలపక్షాలుగా ఏర్పడ్డాయి. ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మద్యం అమ్మొద్దంటూ నోటీసులు కూడా జారీ చేస్తున్నాయి. దీంతో ఇప్పుడిప్పుడే పల్లెల్లో ప్రశాంతత నెలకొంటోంది. గొడవలూ తగ్గుముఖం పడుతున్నాయి. బెల్ట్‌షాపుల సంఖ్యా తగ్గుతోంది.

సంయుక్త దాడులు.. ఆపై కేసులు

- ఎక్సైజ్, పోలీసు శాఖలు బెల్ట్‌షాపులపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఆయా గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. గ్రామాల్లో మద్యం అమ్ముతున్న షాపులపై దా డులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు.
- చండూరు మండలం చామలపల్లి గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకొని నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు.
- కిష్టాపురం గ్రామంలోనూ ఓ దుకాణంలో మద్యం పట్టుకొని కేసు నమోదు చేశారు.

మద్యం అమ్మితే జరిమానా



నాంపల్లి మండలంలోని మా కేతపల్లిలో 7 బెల్ట్ షాపులు ఉండేవి. గ్రామంలో ప్రతినిత్యం మద్యం అమ్మకాలు విపరీతంగా జరిగేవి. యువత, పెద్దలు మద్యం తాగడంతో కుటుంబాల్లో ఇబ్బందులు వచ్చేవి. ఇప్పుడు బెల్ట్ షాపులను బంద్ చేశాం.అమ్మితే జరిమానా విధిస్తాం.
– కోరే హేమలత యాదయ్య, కేతపల్లి సర్పంచ్

కుటుంబాలు నాశనం కాకుండా చూసేందుకే



2018 ఎన్నికల సమయంలోనే బెల్ట్ షాపులు బంద్ చేయాలనే ఆలోచన వచ్చింది. అప్పుడు ప్రచారంలో గ్రామాలకు వెళ్లినప్పుడు ఎన్నో కుటుంబాల్లో పెద్దలు, పిల్లలు మద్యానికి బానిసైనట్టు గుర్తించాను. అనేక మంది మహిళలు బెల్ట్ షాపుల వల్ల తమ కుటుంబాలు నాశనం అవుతున్నాయని మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే అయ్యాక వాటిని బంద్ చేయించేందుకు ప్రయత్నం చేశా. అప్పటి ప్రభుత్వం సహకరించలేదు. దీనిపై అసెంబ్లీలోనూ మాట్లాడాను. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. మద్యానికి బానిసైన కుటుంబాలను కాపాడేందుకు బెల్ట్ షాపులను బంద్ చేయాలని నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నాం. తద్వారా యువత మద్యానికి బానిస కాకుండా కంట్రోల్ అవుతారు.
– కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే

కిడ్నాప్ వ్యవహారంలో చెల్లెలు పాత్ర!

- మలుపు తిరిగిన ప్రైవేట్ ఉద్యోగి కిడ్నాప్ కేసు..ఇంటికి చేరుకున్న సురేందర్
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు


కిడ్నాపర్ల చెర నుంచి బయటపడిన సురేందర్

గచ్చిబౌలి: ప్రైవేట్ ఉద్యోగి సురేందర్ కిడ్నాప్ వ్యవహారంలో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఫిర్యాదు చేసిన చెల్లెలు పాత్ర ఉన్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. కిడ్నాప్‌కు గురైన సురేందర్‌ను, ఓ నిందితుడిని కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు చెక్ పోస్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం బాధితుడు ఇంటికి చేరుకున్నాడు. నల్గొండ పట్టణానికి చెందిన గుర్రం సురేందర్ ఓ ప్రైవేట్ కంపెనీలో టెక్నికల్ సపోర్టర్‌గా పని చేస్తూ గోకుల్ ప్లాట్స్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి 7 గంటలకు ఖాజాగూడ పెద్ద చెరువు లింకు రోడ్డు వద్ద సోదరి నిఖితతో మాట్లాడుతుండగా కారులో వచ్చిన నలుగురు దుండగులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. తన సోదరుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు నిఖిత రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం రాత్రి కర్నూలు జిల్లా ఆత్మకూరు చెక్ పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేయగా ముగ్గురు కిడ్నాపర్లు పరారయ్యారు. ఓ కిడ్నాపర్‌తో పాటు బాధితుడు సురేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు.

కొట్టి... కారు తెప్పించుకొని

ఖాజాగూడ లేక్ వద్ద కిడ్నాప్ చేసిన కారులో కడ్తాల్ వరకు వెళ్లగానే ఆ కారు ఆగిపోయింది. దీంతో వాట్సాప్ ద్వారా భార్యకు ఫోన్ చేయించి సురేందర్ తండ్రి కారు స్విఫ్ట్ డిజైర్‌ను తెప్పించుకొని అక్కడి నుంచి ఉడాయించారు. డబ్బు లు ఇవ్వాలని నలుగురు కిడ్నాపర్లు సురేందర్‌ను చితకబాదారు. వాట్సాప్ కాల్, మెసేజీల ద్వారా భార్యను బెదిరించి.. ఫిర్యాదు వాపస్ తీసుకోవాలని, లేదంటే చనిపోతానని సురేందర్‌తో చెప్పించారు. కోటిన్నర ఇస్తేనే సురేందర్‌ను సురక్షితంగా వదిలేస్తామని మేసేజీల ద్వారా తెలిపారు. కడ్తాల్ నుంచి కర్నూలు మీదుగా ఆత్మకూరుకు కొద్ది దూరంలో సురేందర్ ముఖానికి కట్టిన ముసుగును తొలగించారు. అంతలోనే చెక్‌పోస్ట్ రావడంతో అక్కడి పోలీసులు కారులో ఉన్న వారిని పరిశీలించి చూశారు. బాధితుడు ముఖంపై గాయాలుండటంతో పోలీసులు అనుమానించారు. అంతలోనే సురేందర్ కనుసైగలతో పోలీసులకు అప్రమత్తం చేశారు. వెంటనే పోలీసులు కారు దిగాలని కోరగా ముగ్గురు అడవిలోకి పారిపోయారు. సురేందర్ పోలీసుల వెనక దాక్కోగా ఓ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సెల్ ఫోన్ ఆధారంగా మరో ఇద్దరు నిందితులను మిర్యాలగూడ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సూత్రధారి చెల్లెలు?

సురేందర్ కిడ్నాప్ వెనుక ఆయన చెల్లెలు నిఖిత పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాబాయ్ కూతురు అయిన నిఖిత, ఆమె బాయ్‌ఫ్రెండ్ కలిసి సురేందర్ కిడ్నాప్‌నకు ప్లాన్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సురేందర్ కిడ్నాప్ అయిన రోజు అతని భార్య ఖమ్మంలోని పుట్టింటికి వెళ్లింది. భర్తను కిడ్నాప్ చేసిన విషయం తెలియడంతో భార్య నాగమణితో పాటు బంధువులు గోకుల్ ఫ్లాట్స్‌కు రాగా నిఖిత అక్కడే ఉంది. సురేందర్ ఇంటికి ఎవరెవరు వస్తున్నారో కిడ్నాపర్లకు వాట్సాప్ ద్వారా సమాచారం అందినట్లుగా తెలుస్తోంది. ఆమె నేరుగా పంపిందా లేక బాయ్‌ఫ్రెండ్ పంపాడా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కిడ్నాప్ ఎందుకు చేశారో తెలియాల్సి ఉంది. సురేశ్ అనే కిడ్నాపర్‌పై పలు కేసులున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నామని, కిడ్నాప్ కేసు ఆదివారం వరకు కొలిక్కి వస్తుందని పోలీసులు చెబుతున్నారు.

'రోమ్' జనరల్ కౌన్సిలర్‌గా ఆంధ్రుడు..

ఫాదర్ మేరియో అరుదైన ఘనత

దెందులూరు: రోమ్ దేశంలో మిషనరీస్ ఆఫ్ ఫెయిత్ జనరల్ కౌన్సిలర్‌గా ఆంధ్రుడు ఎన్నికయ్యాడు. 19 దేశాల భాగస్వామ్యం ఉండే సంస్థలో కీలక బాధ్యతలు పొందిన తొలి భారతీయుడిగా ఫాదర్ మేరియో ఖ్యాతి గడించారు. ఈయనది ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నగరం. కూరపాటి రాయప్ప, చిట్టెమ్మ దంపతుల కుమారుడే ఫాదర్ మేరియో. ఇంగ్లాండ్‌లోని అగ్రపీఠం బర్నింగ్ హోమ్‌లోని ప్యారిష్ క్రిస్ట్‌గా సేవలందిస్తున్నారు. ఆధ్యాత్మిక, విద్య, వైద్య సేవారంగాలతో పాటు ప్యారిష్ క్రిస్ట్‌గా విధి నిర్వహణను పరిగణనలోనికి తీసుకుని ఇటీవల జరిగిన ఎన్నికల్లో రోమ్ మిషనరీస్ ఆఫ్ ఫెయిత్ (19 దేశాల)కు జనరల్ కౌన్సిల ర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన సోదరుడు ఎస్‌ఎంసీ విద్యాసంస్థల అధినేత చుక్కా అవినాష్‌రాజు శనివారం సానిగూడెంలో స్థానిక విలేకరులకు తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.